www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 17-11-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 229 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: విదియ రా. 9.07 తదుపరి తదియ; నక్షత్రం: రోహిణి సా. 5.22 తదుపరి మృగశిర; వర్జ్యం: ఉ.10.04-11.31, రా.10.36-12.06; దుర్ముహూర్తం: సా.4.05-4.50; అమృతఘడియలు: మ.2.26-3.54; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.24; సూర్యాస్తమయం: 5.35 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అహంకారం.. హాహాకారం!

అధికారంలో ఉన్నప్పుడు కన్నూమిన్నూ కానకుండా అహంకార పూరితంగా వ్యవహరించిన వారు ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

రాజకీయాలలో వ్యక్తిగత కక్షలకు తావు ఉండకూడదు. కానీ.. ఇటు తెలంగాణలో, అటు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందేమిటి? రాజకీయ ప్రత్యర్థులను వ్యక్తిగత శత్రువులుగా ప్రకటించుకొని వేటాడారు. ఈ క్రమంలో వ్యవస్థలను, ముఖ్యంగా పోలీసు వ్యవస్థను భ్రష్టుపట్టించారు. ఇప్పుడు పోలీసులు అధికార పక్షానికి తొత్తులుగా మారారని సుద్దులు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

తెలుగునాట ఎంతో మంది సీఎంలుగా పనిచేసినప్పటికీ సొంత మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నది కేసీఆర్, జగన్ రెడ్డి మాత్రమే. ఈ ఇద్దరూ అధికారంలో ఉన్నప్పుడు వారి మీడియాకు అంతా పచ్చగా కనబడేది. ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చోవలసి రావడంతో సదరు మీడియాకు సర్వత్రా విధ్వంసమే కనిపిస్తోంది.

తెలంగాణ రాజకీయాల్లో వ్యక్తిగత కక్షలు ప్రధాన అజెండా అయ్యాయి. అటు కేసీఆర్ అండ్ కో, ఇటు రేవంత్ అండ్ కో కత్తులు దూసుకోవడం మొదలైంది. ఎన్నికలు జరిగి ఏడాది కూడా పూర్తి కాకముందే తెలంగాణ రాజకీయాలు ఇంతలా మండటానికి కారణం.. రాజకీయ వైరం స్థానంలో వ్యక్తిగత వైరం ప్రవేశించడమే.

ఇటు రేవంత్ రెడ్డి, అటు కేసీఆర్ కుటుంబం మధ్య వైరం ముదురుతున్నప్పటికీ, ఇది తగదు అని చెప్పే రాజకీయ పార్టీగానీ, వ్యక్తులుగానీ, వ్యవస్థలుగానీ తెలంగాణలో కనిపించడం లేదు. గతంలో అధికార, ప్రతిపక్షాల మధ్య కీలక సందర్భాలలో మధ్యవర్తిత్వం నడిపిన కమ్యూనిస్టులను కూడా ఆయన అవమానించారు. దీంతో కేసీఆర్‌కు అండగా నిలబడేవారు కరువయ్యారు. విచిత్రం ఏమిటంటే, కేసీఆర్ కుటుంబానికి అరెస్టుల ముప్పు పొంచి ఉందని వార్తలు వెలువడుతున్నా ప్రజల్లో కూడా సానుభూతి ఏర్పడటం లేదు.

అధికారం శాశ్వతం కాదని అధికారంలో ఉన్నప్పుడు భావించి ఉన్నట్టయితే కేసీఆర్ కుటుంబానికి ఈ దుస్థితి వచ్చేది కాదు. ముఖ్యమంత్రి రేవంత్ కూడా కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్‌గా చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా వ్యవహరించే విషయమై పునరాలోచన చేయాలి. తన ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నందున ప్రజల మనోభావాలు ఎలా ఉన్నాయి? ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడుతున్నదా? అదే నిజమైతే అందుకు కారణాలేమిటి? వంటి ప్రశ్నలు వేసుకొని సమీక్షించుకోవాలి.



కొత్త పలుకు

ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ముఖ్యమంత్రి రేవంత్ పట్ల ప్రజల్లో సదభిప్రాయం ఉండేది. క్రమేపీ అది కనుమరుగవుతోందన్న వార్తలు వస్తున్నాయి. కేసీఆర్ కుటుంబం పట్ల ప్రజల్లో సానుభూతి ఏర్పడకపోయినా, ప్రభుత్వంపై సానుకూలత కొరవడటం రేవంత్‌కు నష్టం చేస్తుంది. ఇటీవల కాలంలో సీఎం పనితీరుపై కొన్ని వర్గాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. రేవంత్‌తో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులు పరిస్థితులను సమీక్షించుకోవలసిన అవసరం ఉంది. తప్పొప్పులను సరిదిద్దుకోవడానికి ఇదే సరైన తరుణం.

4

రాజకీయాలలో అప్పుడప్పుడూ నీచత్వానికి పరాకాష్ఠ అనదగిన నికృష్టులు తారసపడుతుంటారు. ఏపీ రాజకీయాల్లో ప్రస్తుతం అటువంటి నికృష్టుడిని విజయసాయి రెడ్డి రూపంలో చూడవచ్చు. ఏబీఎన్ చానల్‌లో ఏదో ఒక కార్యక్రమం ప్రసారమైందని, అందులో తనను విమర్శించారంటూ ఈ నికృష్టుడు నన్ను తిడుతూ సుదీర్ఘ ట్వీట్ చేశాడు. ఆ ట్వీట్‌లో నాపై చేసిన ఆరోపణలకు స్పందించాల్సిన పని లేదు. ఎందుకంటే నేనేమిటో, నా ప్రస్థానం ఎలా మొదలైందో గతంలో ఓపెన్‌గా చెప్పాను. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. సాధారణ జర్నలిస్టు మీడియాకు అధిపతి అవడం ఏమిటి? అని ఆశ్చర్యపోతున్నాడు మన ఏ2 విజయసాయి రెడ్డి. ఈ ప్రశ్నకు నేను గతంలోనే జవాబిచ్చాను. మా నాన్న ముఖ్యమంత్రి కాదు- జగన్ రెడ్డివలే దొంగ ఆడిటర్ విజయసాయి రెడ్డి వంటి వారి సహకారంతో తెల్లారే సరికి మా వ్యాపార సామ్రాజ్యాన్ని నెలకొల్పలేదు. ఒక్కో ఇటుకా పేర్చుకుంటూ 'ఆంధ్రజ్యోతి'ని విస్తరించాం.

విజయసాయి వంటి నీచ నికృష్టుడికి ఉన్న తెలివితేటలు నాకు ఉన్నట్టయితే రోత మీడియా వలె ఒకేసారి 23 ఎడిషన్లు ప్రారంభించి ఉండేవాడిని. నేను బ్లాక్ మెయిల్ చేస్తాననీ డీల్ మేకర్‌ననీ కూడా ఈ నీచుడు నన్ను నిందించాడు. బ్లాక్ మెయిల్ చేసి డబ్బు సంపాదించే బుద్ధి ఉంటే ఇటు తెలంగాణలో, అటు ఏపీలో కేసీఆర్, జగన్‌తో ఏక కాలంలో పోరాడాల్సిన అవసరం ఏమిటి నాకు? ఆ ఇద్దరు సీఎంల అహంకార ధోరణుల వల్ల ప్రజలకు నష్టం జరుగుతుందని నమ్మి పోరాడి ఆర్థికంగా ఎంతో నష్టపోయాం.

నాతో సయోధ్య కుదుర్చుకోవడానికి జగన్ కూడా రాయబారాలను పంపిన విషయం విజయసాయి రెడ్డికి తెలియదా? 'ఎంత కావాలి?' అని అడిగితే 'మీరు ప్రజాస్వామ్యబద్ధంగా పాలించండి చాలు' అని నేను చెప్పిన విషయం మరిచావా? జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు, అధికారం కోల్పోయిన తర్వాత కూడా నన్ను అనేక పర్యాయాలు కలిశావు కదా? ఏ డీల్ కోసం కలిశావో చెప్పు? ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ప్రైవేట్ సంభాషణలను బహిర్గతం చేయడం అనైతికం కనుక విజయసాయిరెడ్డి నా వద్ద ప్రస్తావించిన అంశాలను ఇప్పుడు నేను వెల్లడించడం లేదు. నెల రోజుల క్రితం కూడా ఈ రాజకీయ వికృత జీవి నన్ను కలిశాడు. ఎందుకు కలిశాడో చెప్పే దమ్ముందా అతగాడికి? 'తెలుగు రాష్ట్రాల వెలుపల ఎక్కడైనా తనతో బహిరంగ చర్చకు వచ్చే ధైర్యం ఉందా?' అని విజయసాయి రెడ్డి సవాలు కూడా విసిరాడు.

విజయసాయి రెడ్డి వంటి నీచుడు చర్చకు ఆహ్వానిస్తే వెళ్లకుండా ఉంటానా!? నువ్వూ నేనూ కలిసి ఢిల్లీలో 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే' కార్యక్రమం పెట్టుకుందాం. నీ సంగతి.. నా సంగతి ఏంటో తేల్చుకుందాం. మన ఇద్దరి మధ్య సాగే చర్చను ఏబీఎన్‌లో లైవ్ టెలీకాస్ట్ చేద్దాం. మీ రోత చానల్‌లో కూడా లైవ్ టెలికాస్ట్ చేసుకోవడానికి అనుమతిస్తాను. కండీషన్స్ కూడా ఏమీ లేవు.

ముఖ్యమంత్రుల మోచేతి నీళ్లు తాగే అలవాటు లేదు కనుకనే తల ఎత్తుకొని తిరుగుతున్నాను. నిజంగా నీది మనిషి పుట్టుకే అయితే నీవు విసిరిన సవాలుకైనా సిద్ధపడు. లేని పక్షంలో 'నీచ మానవుడిని' అని బహిరంగంగా అంగీకరించు.



ఆర్ ఆర్ ఆర్

దారి ఇలా..

ఉత్తరభాగం నిర్మాణం ఈపీసీ, హెచ్ఏఎం పద్ధతుల్లో!

- ఈ విధానాల్లోనైతేనే లాభదాయకం
- టోల్ వసూలు ద్వారా 20 ఏళ్లలో రూ. 15,768 కోట్ల ఆదాయం
- బీవోటీ పద్ధతిలో గిట్టుబాటు కాదు
- 120 కి.మీ వేగంతో ప్రయాణించేలా.. 4 లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్ వే
- ఆరు ప్యాకేజీలు.. ఇంటర్ చేంజ్‌లు, టోల్‌ప్లాజాలు, రెస్ట్ ఏరియాల ఏర్పాటు
- సమగ్ర ప్రాజెక్టు రిపోర్టులో వెల్లడి
- ఎన్‌హెచ్ఏఐకి సమర్పించిన కన్సల్టెన్సీ

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా చేపడుతున్న రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తరభాగం నిర్మాణానికి సంబంధించి అడుగులు వేగంగా పడుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణ పనులను ఏ పద్ధతుల్లో చేపడితే లాభదాయకంగా ఉంటుందో తెలుపుతూ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నియమించిన కన్సల్టెన్సీ సంస్థ.. కీలక సూచనలు చేసింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఏఎం) లేదా ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతుల్లో చేపట్టడం ఆర్థికంగా లాభదాయకమని పేర్కొంది. బిల్డ్-ఆపరేట్- ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానంలో చేపడితే.. రాబడి రాకపోగా, పెట్టిన పెట్టుబడిపై వచ్చే అంతర్గత రాబడి కూడా గిట్టుబాటు కాదని తెలిపింది. ఈ మేరకు ఎన్‌హెచ్ఏఐకి ఇటీవల ఇచ్చిన నివేదికలో సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును (డీపీఆర్) పొందుపరిచింది. ఉత్తరభాగం రహదారి నిర్మాణానికి హెచ్ఏఎం, ఈపీసీ విధానమైతేనే మేలు అని సూచించడానికి ముందుగా.. ప్రాజెక్టు కోసం చేసే ఖర్చు, నికర మార్కెట్ విలువలు, రహదారి నిర్మాణం తరువాత వసూలు చేసే టోల్ ద్వారా వచ్చే ఆదాయాన్ని

మిగతా 12వ పేజీలో...

డబుల్ ఇంజన్ అంటే..

ప్రధాని, అదానీ

- ముంబైని లూటీ చేయడానికి వచ్చారు
- ఎంవీఏ సర్కారు కూల్చివేతలో అదానీ పాత్ర!
- శిందే, అజిత్ పవార్‌ను బొంద పెట్టాలి
- మహారాష్ట్ర ప్రచారంలో సీఎం రేవంత్



చంద్రాపూర్(మహారాష్ట్ర)/హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముంబైని లూటీ చేయడానికి గుజరాత్ నుంచి ఇద్దరు వ్యక్తులు వచ్చారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వారే 'ప్రధాని, అదానీ' అని చెప్పారు. శనివారం ఆయన చంద్రాపూర్, రాజురా, డిగ్రాస్, వార్ధా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ సభలు, రోడ్‌షోల్లో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యేతో పాటుగా పొరుగు రాష్ట్ర సీఎంగా

మిగతా 2వ పేజీలో...

'ప్రజావాణి'తో సత్ఫలితాలు

- పేద బాలిక అనారోగ్యానికి సత్వర వైద్యం
- అధికారులకు సీఎం అభినందన 2
- 'ఆంధ్రజ్యోతి' కథనం ట్వీట్ చేసిన రేవంత్

'పది' ఫీజు గడువు 28 వరకు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన 11



హరిత ఇంధనం @

50 వేల మెగావాట్లు

- ప్రస్తుతం 10 వేల మెగావాట్లు..
- పదేళ్లలో భారీగా పెంచాలని లక్ష్యం
- సౌర, పవన విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు భారీగా ప్రోత్సాహకాలు
- సీలింగ్ వర్తించదు.. నాలా అక్కర్లే
- ప్లాంట్ పెట్టగానే పరిశ్రమ హోదా
- యంత్రాలు, పరికరాలకు 100% రాష్ట్ర జీఎస్టీ తిరిగి చెల్లింపు
- తెలంగాణ పునరుత్పాదక ఇంధన విధానం సిద్ధం చేసిన సర్కారు
- త్వరలోనే అధికారికంగా వెల్లడి

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హరిత ఇంధన ఉత్పాదక సామర్థ్యాన్ని భారీగా పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం 10,095 మెగావాట్లుగా ఉన్న సామర్థ్యాన్ని రాబోయే పదేళ్లలో 50,500 మెగావాట్లకు పెంచాలని యోచిస్తోంది. 2034-35 నాటికి కొత్తగా 40,405 మెగావాట్ల సామర్థ్యాన్ని వృద్ధి చేసుకోవడం ద్వారా మొత్తం 50,500 మెగావాట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని భావిస్తోంది. రాష్ట్రంలో సౌర, పవన, డిస్ట్రిబ్యూటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ, ఎనర్జీ స్టోరేజీ (బ్యాటరీ+పంప్డ్ స్టోరేజీ) ప్రాజెక్టులు, జియోథర్మల్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టుల ఏర్పాటును ప్రోత్సహించడానికి వీలుగా 'తెలంగాణ పునరుత్పాదక ఇంధన విధానం- 2024'ని సిద్ధం చేసింది. త్వరలో దీన్ని అధికారికంగా ప్రకటించనుంది. ఈ విధానాన్ని ప్రకటించగానే విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్)లు టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్ ద్వారా కొత్త సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్లు, పవన విద్యుత్కేంద్రాల స్థాపనకు బిడ్లను ఆహ్వానించనున్నాయి. ఈ విద్యుత్కేంద్రాల స్థాపనకు భారీగా ప్రోత్సాహకాలు అందించనున్నారు. డెవలపర్లు ప్రైవేటు, ప్రభుత్వ స్థలాల్లో ఈ ప్రాజెక్టులను స్థాపించడానికి అవకాశం ఇస్తారు. ప్రభుత్వ స్థలాలను నామమాత్రపు అద్దెతో లీజుకు ఇవ్వనున్నారు. బిడ్డర్‌కు మార్కెట్

మిగతా 2వ పేజీలో...

3 నెలలైనా ఉంటా

బస్తీకే నివాసాన్ని మార్చుకుంటా.. పేదల ఇళ్లను కూల్చనివ్వం.. సుందరీకరణ పేరిట రియల్ వ్యాపారం

సీఎం రేవంత్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం.. మూసీ పరీవాహకంలో బీజేపీ నాయకుల బస్తీ నిద్ర

హైదరాబాద్ సిటీ/గోల్నాక/చాదర్‌ఘాట్/దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): "మూసీ పరీవాహకంలోని బస్తీలో ఒక రోజు ఉండాలన్న రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నా.. ఈ ఒక్క రోజే కాదు.. అవసరమైతే మూడు నెలలు మూసీ ఒడ్డున బస్తీలో ఉంటా.. నా నివాసాన్ని ఇక్కడికే మార్చుకుంటా" అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టును విమర్శించే నేతలు దమ్ముంటే ఒక రోజు పరీవాహక బస్తీలో ఉండాలని.. అలా చేయగలిగితే తాను ప్రాజెక్టును విరమించుకుంటానని

మిగతా 11వ పేజీలో...

కేసీఆర్ డైరెక్షన్‌లో కిషన్‌రెడ్డి: పొన్నం



గోల్నాక తులసీరాంనగర్ బస్తీ వాసులతో భోజనం చేస్తున్న కిషన్‌రెడ్డి




నటి కస్తూరి అరెస్టు

- అదుపులోకి తీసుకున్న చెన్నై పోలీసులు
- తెలుగువారిపై తీవ్ర వ్యాఖ్యలతో కేసు
- అప్పట్నుంచి అజ్ఞాతంలో ఉన్న నటి 14
- హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి అరెస్టు

మూసీకి ప్రపంచ బ్యాంకు

4 వేల కోట్ల రుణం



- కేంద్రం అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ
- తొలి దశలో 17 కి.మీ మేర పునరుజ్జీవ పనులు
- ఆరేళ్ల వ్యవధిలో రూ. 5,863 కోట్ల ఖర్చు 2
- రాష్ట్ర ప్రభుత్వ వాటాగా 1,763 కోట్ల వ్యయం
- మిగతా పనులకు ఇతర మార్గాల ద్వారా నిధులు



తమ్ముడి మృతదేహం వద్ద ఏపీ సీఎం బాబు, చిత్రంలో జస్టిస్ రమణ, బాలకృష్ణ

తప్పు చేయలే!

- అందుకే ధైర్యంగా నిలబడ్డాను 11
- ప్రజలు కూడా అండగా నిలిచారు
- సోషల్ సైకోలను అణిచేయాల్సిందే
- హిందుస్థాన్ టైమ్స్ సదస్సులో బాబు



13

దిగొస్తున్న పసిడి

17 రోజుల్లో రూ.6,150 తగ్గిన ధర

14

మస్క్ రాకెట్..

ఇస్రో శాటిలైట్

- ఫాల్కన్-9తో జీశాట్-ఎన్2 ప్రయోగం
- స్పేస్ ఎక్స్, ఇస్రో మధ్య కీలక ఒప్పందం
- వచ్చే వారం అమెరికాలో ప్రయోగం
- భారత్‌లో విమానంలో ఇంటర్నెట్ సేవలకే

వృద్ధుల సంరక్షణకు పాలసీ

- వేగంగా కసరత్తు.. 25 ఏళ్లలో తొలిసారి.. వచ్చే పాతికేళ్లపాటు మార్గదర్శనం
- 'తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ, సంక్షేమ చట్టానికి' సవరణలు.. కేంద్ర కార్యదర్శి వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 16: వృద్ధుల కోసం కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకురానుందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ వెల్లడించారు. గత 25 ఏళ్లలో ఇటువంటి పాలసీని రూపొందించడం ఇదే తొలిసారన్నారు. దీంట్లో భాగంగా 'తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ, సంక్షేమ చట్టానికి' సవరణలు చేస్తామని, ప్రస్తుత కాలంలో వృద్ధుల అవసరాలకు అనుగుణంగా ఈ కొత్త విధానం

మిగతా 14వ పేజీలో...





'సాంస్కృతిక సారథి'గా

గద్దర్ కుమార్తె

గుమ్మడి వెన్నెలను నియమించిన సర్కారు 12

మూసీ పేరిట ఢిల్లీకి మూటలు

- రేవంత్.. నీ వాటా ఎంత?
- సీఎం పదవి తుమ్మితే ఊడేదే
- రేవంత్‌కు సహాయ మంత్రి తరహాలో బండి సంజయ్
- పొంగులేటి తుస్సు మంత్రి
- బీజేపీ నేతలు కాంగ్రెస్‌లో ఉన్నారా?.. కేటీఆర్ విసుర్లు

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'మూసీ' పేరిట సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి మూటలు మోస్తున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలకు డబ్బులు కావాలని, అందుకే రేవంత్ మూటలు పంపే పనిలో ఉన్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డిది తుమ్మితే ఊడిపోయే పదవి

మిగతా 3వ పేజీలో...

ఇంజనీర్ల బాధ్యతలు, విధులపై స్పష్టత

» నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ ఉత్తర్వులు

హైదరాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ ఇంజనీర్లు(ఏఈలు), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (ఏఈఈలు) విధులు, బాధ్యతలపై నీటి పారుదల శాఖ స్పష్టతనిచ్చింది. ఈ మేరకు ఈఎన్‌సీ(జనరల్) జీ అనిల్‌కుమార్ సర్క్యులర్ జారీ చేశారు. ఏఈఈలు (సివిల్/మెకానికల్).. నీటి పారుదలతో ముడిపడిన సర్వేలు, ప్లాన్ల తయారీ, డ్రాయింగ్‌లు, అంచనాల రికార్డుల నిర్వహణ, నాణ్యతా ప్రమాణాల ప్రకారం నిర్మాణం జరుగుతోందా లేదా చూసుకోవడం వంటి మొత్తం 32 రకాల విధులు/బాధ్యతలు నిర్వర్తించాలి. ఏఈలు (సివిల్/మెకానికల్)... చెరువులు, చెక్‌డ్యామ్‌ల బాధ్యతతో పాటు నీటి విడుదలపై నియంత్రణ, ఆమోదించిన డ్రాయింగ్‌ల ఆధారంగా అంచనాలను సిద్ధం చేయడం, శాఖ భూముల్లో అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలను గుర్తించి, తొలగించడం వంటి 26 రకాల విధులు/బాధ్యతలు నిర్వర్తించాలి. ఏఈఈ/ఏఈలు (ఎలక్ట్రికల్)... ఎత్తిపోతల పథకాల పంప్‌హౌస్‌లు, సబ్‌స్టేషన్ల వద్ద విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఎత్తిపోతల పథకాల సాంకేతిక బాధ్యతలు చూసుకోవాలి. పంపులు/మోటార్లు, సబ్‌స్టేషన్లు, ఎలక్ట్రికల్‌తో ముడిపడిన పనులు సహా 22 రకాల బాధ్యతలు చూడాల్సి ఉంటుంది. ఏఈఈలు (అగ్రికల్చర్).. ప్రాజెక్టుల పరిధిలో ఏయే రకాల పంటలు పండుతున్నాయనే వివరాలు, భూసార పరీక్షల కోసం నమూనాలు సేకరించడం, సాగునీటి రంగంలో కొత్త పద్ధతులు, విపత్తులు లేదా కాల్వలు, ప్రాజెక్టులకు గండ్లు పడినా/తెగినా జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికలు పంపించడం వంటి 20 రకాల బాధ్యతలు చూడాల్సి ఉంటుంది.

నేటి నుంచి గ్రూప్-3 పరీక్షలు

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్-3 పరీక్షలు ఆదివారం ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 1,401 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 115 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 65,361మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. రంగారెడ్డిలో 103 పరీక్ష కేంద్రాల్లో 56,394 మంది, హైదరాబాద్‌లో 102 కేంద్రాల్లో 45,918 మంది పరీక్ష రాయనున్నారు. ములుగు జిల్లాలో అత్యల్పంగా 9 కేంద్రాలుండగా.. 2,173 అభ్యర్థులు హాజరుకానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,36,395 మంది అభ్యర్థులు గ్రూప్-3 పరీక్షలకు హాజరుకానున్నారని టీజీపీఎస్సీ తెలిపింది. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు కమిషన్ తెలిపింది. ఆది, సోమవారాల్లో గ్రూప్-3 పరీక్షలు జరగనున్నాయి.

తెలంగాణ పోలీసులకు కొత్త బ్యాడ్జీలు

» టీఎస్‌పీ స్థానంలో టీజీపీ..

హైదరాబాద్,నవంబర్ 16(ఆంధ్రజ్యోతి) తెలంగాణ పోలీసు యూనిఫార్మ్ లోని కీలక మైన బ్యాడ్జీల్లో మార్పుకు ఆదేశాలు జారీ అయ్యాయి..ఇప్పటి వరకు పోలీసు యూనిఫార్మ్ లోని బ్యాడ్జీలో తెలంగాణ స్టేట్ పోలీసు(టీఎస్‌పీ) అనే అక్షరాలు ఉండేవి. ఇక నుంచి తెలంగాణ పోలీసు(టీజీపీ) మార్చాలని హోంశాఖ కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు..ఇదే విధంగా తెలంగాణ పోలీసులకు సంబంధించిన ఇతర ప్రత్యేక విభాగాలైన టీఎస్ఎస్‌పీ స్థానంలో టీజీఎస్‌పీ,అలాగే టీఎస్‌పీఎస్ స్థానంలో టీజీపీఎస్ అనే అక్షరాలతో బ్యాడ్జీలు వాడాలని రవిగుప్తా తన ఆదేశాల్లో స్పష్టం చేశారు.

టెట్ దరఖాస్తుల్లో సవరణలకు 22 దాకా చాన్స్

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్-2024)-2 కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ వివరాలను సరిచేసుకోవడానికి(ఎడిట్) ఈ నెల 22 వరకు అవకాశమిచ్చారు. అభ్యర్థులు www.schooledu.telangana.gov అనే వెబ్‌సైట్‌లో నిర్ణీత వ్యవధిలోగా వివరాలు సరిచేసుకోవాలని పాఠశాల విద్య సంచాలకుడు ఇ.వి.నర్సింహారెడ్డి కోరారు. ఇక సాంకేతిక సమస్యలు ఏమైనా ఉత్పన్నమైతే 70329 01383, 90007 56178 నంబర్లను పనిదినాల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు సంప్రదించాలని సూచించారు.

టీజీసెట్‌లో 7.17 శాతం అర్హత

హైదరాబాద్/తార్నాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష (టీజీ సెట్) 2024 ఫలితాలు విడుదలయ్యాయి. శనివారం ఈ ఫలితాలను ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొ.మొలుగారం కుమార్‌తో కలిసి తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి విడుదల చేశారు. టీజీ సెట్‌కు మొత్తం 33,494 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 26,294 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 1,884 మంది(7.17%) అర్హత సాధించారు. అర్హత సాధించిన అభ్యర్థులకు త్వరలోనే వెరిఫికేషన్ ప్రక్రియ చేపడతామని, అందుకు సంబంధించిన సమాచారాన్ని వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

సామాజిక న్యాయ సాధనలో నల్సార్ కృషి

» హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ప్రశంస

శామీర్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయంపై అవగాహన కలిగించేలా 'నల్సార్' విశేష కృషి చేస్తోందని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రశంసించారు. ఇక్కడ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు ఆ జ్ఞానాన్ని ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించి సమాజంలో గొప్ప ప్రశంసలు పొందాలని కోరారు. శనివారం శామీర్‌పేటలోని నల్సార్ న్యాయవిశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్ కృష్ణదేవరావు ఆధ్వర్యంలో దూరవిద్య కోర్సుల విద్యార్థుల కోసం ప్రత్యేక స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ విశ్వవిద్యాలయం చాన్సలర్ హోదాలో జస్టిస్ అలోక్ అరాధే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ అట్టడుగు వర్గాల ప్రజల సామాజిక న్యాయంపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన దూరవిద్యను అందించడంలో నల్సార్ విశేష కృషి చేస్తోందని అభినందించారు. దూర విద్య కోర్సుల్లో దాదాపు 50 శాతం మహిళలు ఉండడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దూర విద్య లా కోర్సుల్లో 1,255 మంది విద్యార్థులు చదువులు పూర్తి చేశారు. వీరిలో 287 మందికి పట్టాలను ప్రదానం చేశారు.

నాలుగు గ్రంథాలయ సంస్థలకు ఛైర్మన్లు

నాలుగు జిల్లాల గ్రంథాలయ సంస్థలకు ప్రభుత్వం ఛైర్మన్‌లను నియమించింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా బి.శ్రీనివాసరెడ్డి, జనగాం- ఎం. రాంబాబు, హనుమకొండ- అజీజ్‌ఖాన్, యాదాద్రి -భువనగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా ఎం.డి. అవైస్ ఉర్ రహమాన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

డబుల్ ఇంజన్ అంటే.. ప్రధాని, అదానీ

(మొదటిపేజీ తరువాయి)

తాను కూడా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రేవంత్.. ప్రధాని మోదీ, మహారాష్ట్ర సీఎం శిండే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం అంటే ఒకరు ప్రధాని, మరొకరు అదానీ అని చెప్పారు. మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని కూల్చడంలో అదానీ పాత్ర ఉందని అజిత్ పవారే అంగీకరించారని తెలిపారు. సీఎం ఏక్‌నాథ్ శిండే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌లు ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌లకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. శిండే, అజిత్ పవార్‌లను రాజకీయంగా బొంద పెట్టాలంటూ ప్రజలకు పిలుపు ఇచ్చారు. గత ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును కాలరాసి.. ప్రజాస్వామ్యాన్ని పరిహసించారని గుర్తు చేశారు. ఒక్క ఓటుతో ఇద్దరు గుజరాతీ గులాములను కట్టడి చేయాలన్నారు. దేశంలోని మహానగరాల్లో ప్రజలు బీజేపీని తిరస్కరించారని గుర్తుచేశారు. ముంబైలోనూ చిత్తుగా ఓడించాలన్నారు. ఇక కేసీఆర్, ఆయన కుటుంబం తెలంగాణను లూటీ చేశారని ఆరోపించారు. వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి తాను గ్రామాల్లో తిరిగానని, అణచివేతకు గురైన ప్రజల గొంతుకనయ్యానని తెలిపారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు బొంద పెట్టారని రేవంత్ చెప్పారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. మహారాష్ట్రలో కూడా కాంగ్రెస్ కూటమి అధికారంలో వస్తే గ్యారెంటీలు అమలు చేస్తుందని చెప్పారు. తెలంగాణలో తమ ప్రభుత్వం కేవలం 25 రోజుల్లోనే రైతులకు రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. 50 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. మహారాష్ట్రలో ఉద్యోగాల కల్పనపై సీఎం శిండేతో చర్చించడానికి తాను సిద్ధమని రేవంత్ ప్రకటించారు.



మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి

రేవంత్ వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు

సీఎం రేవంత్‌రెడ్డి వాహనాన్ని శనివారం మహారాష్ట్ర పోలీసులు తనిఖీ చేశారు. చంద్రాపూర్ నియోజకవర్గంలోని గుగూస్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యేందుకు సీఎం రేవంత్‌రెడ్డి వెళుతుండగా.. మధ్యలో ఆపిన పోలీసులు, ఆయన వాహనాన్ని తనిఖీ చేశారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి ప్రచార సభలు, నాగ్‌పూర్ రోడ్ షోకు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది.

హరిత ఇంధనం @ 50 వేల మెగావాట్లు!

(మొదటిపేజీ తరువాయి)

రేటులో 10% లీజు ధరతో ప్రభుత్వం భూముల్ని కేటాయించనుంది. అనంతరం రెండేళ్లకోసారి లీజు ధరను 5% పెంచనుంది. అయితే, ప్రాజెక్టు పూర్తయి, ఉత్పత్తి ప్రారంభించిన తర్వాతే జిల్లా కలెక్టర్‌తో లీజు ఒప్పందం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. విద్యుత్తు కొనుగోలు ఒప్పంద(పీపీఏ) కాలానికే లీజు ఒప్పందమూ ఉండనుంది. టీజీఐపాస్ ద్వారా డెవలపర్లకు అన్నిరకాల అనుమతులు వేగంగా జారీ కానున్నాయి. తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(రెడ్కో) నోడల్ ఏజెన్సీగా ఉండనుంది. డెవలపర్లు రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని ప్రైవేటు సంస్థలకు బహిరంగ విపణి ద్వారా అమ్ముకునే అవకాశాన్ని కల్పించనున్నారు. సొంత అవసరాలకూ సౌర, పవన విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు..

నీటిపారుదల శాఖ భాగస్వామ్యంతో టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్ ద్వారా జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటును సైతం ఈ విధానం కింద ప్రభుత్వం ప్రోత్సహించనుంది. వీటితో వచ్చే విద్యుత్తును డిస్కమ్‌లు కొనుగోలు చేస్తాయి. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు జలాశయాలను నామినేషన్ విధానంలో కేటాయించనున్నారు. ఇందుకు గాను నీటిపారుదల శాఖకు డిస్కమ్‌లు విద్యుత్తులో వాటా/నామమాత్రపు అద్దెను చెల్లిస్తాయి. ఇప్పటికే లోయర్ మానేరు, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లలో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు పెట్టాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.

స్వయం సహాయక సంఘాలతో ప్లాంట్లు

రాష్ట్రంలోని సబ్‌స్టేషన్ల వారీగా ఎంత సామర్థ్యంతో సౌర విద్యుత్తు ప్లాంట్ల స్థాపనకు అవకాశం ఉందో వెల్లడిస్తూ డిస్కమ్‌లు ప్రకటన చేయనున్నాయి. ప్లాంట్ల స్థాపనకు స్వయం సహాయక సంఘాల మహిళల నుంచి ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించనున్నాయి. 500కిలోవాట్ నుంచి 2మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్ల స్థాపనకు అవకాశం ఇచ్చి, వారి నుంచి యూనిట్ రూ.3.13లకు విద్యుత్తును కొనుగోలు చేస్తాయి.

పంప్డ్ స్టోరేజీకి రూపాయికే హెక్టారు భూమి!



పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను 45 ఏళ్లకు నామమాత్రపు లీజుతో ఇవ్వనుంది. ప్రైవేటు స్థలాలు అవసరమైతే నోడల్ ఏజెన్సీ అయిన రెడ్కో.. వాటిని సేకరించి వార్షిక లీజు ధరతో డెవలపర్లకు కేటాయించనుంది. పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల స్థాపనకు ప్రైవేటు డెవలపర్లను టెండర్ల ద్వారా ఎంపిక చేస్తే, ప్రభుత్వ రంగ సంస్థలను నామినేషన్ ద్వారా ఎంపిక చేస్తారు. టెండర్లు దక్కించుకున్న ఆరేళ్లలోపు ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలి. సౌర విద్యుత్తు ప్లాంట్లను రెండేళ్లలో, పవన విద్యుత్తు ప్లాంట్లను మూడేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది.

పునరుత్పాదక విద్యుత్తు	ప్రస్తుత సామర్థ్యం (నిర్మాణంలోనివీ కలిపి)	2034-35 నాటికి లక్ష్యం (మెగావాట్లలో)
సౌర విద్యుత్తు	7900	26,000
డిస్ట్రిబ్యూటుడ్ రెన్యూవల్ ఎనర్జీ	467	8000
పవన విద్యుత్తు	128	4500
ఎనర్జీ స్టోరేజీ(పంప్డ్+బ్యాటరీ)	1600	10000
జియో థర్మల్	20 కిలోవాట్లు	2000 మెగావాట్లు
మొత్తం	10,095.20	50,500

భారీ ప్రోత్సాహకాలు..

సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ, ఇతర పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టుల స్థాపనకు వినియోగించే స్థలాలను వ్యవసాయేతర భూములుగా పరిగణిస్తారు. భూ వినియోగ మార్పిడి అనుమతులు అవసరం ఉండదు.

తెలంగాణ ఐపాస్ ద్వారా అన్ని రకాల అనుమతులను వేగంగా జారీ చేస్తారు.

పారిశ్రామిక హోదా కల్పించి రాష్ట్ర పారిశ్రామిక విధానం కింద అందించే అన్ని రకాల ప్రోత్సాహకాలను వర్తింపజేస్తారు.

ప్రత్యేక ఇన్సెంటివ్‌లు

సూపర్‌వైజేషన్ చార్జీల నుంచి మినహాయింపు.

ప్రాజెక్టు కోసం కొనుగోలు చేసే యంత్రాలు, పరికరాలకు చెల్లించే రాష్ట్ర జీఎస్టీ వాటాను 100శాతం రీ యింబర్స్‌మెంట్(తిరిగి) చేస్తారు.

వ్యవసాయ సీలింగ్ చట్టం నుంచి భూములకు మినహాయింపు ఉంటుంది. సోలార్ ఒక మెగావాట్ ప్రాజెక్టుకు 4 ఎకరాల వరకు మాత్రమే ఈ వెసులుబాటు వర్తిస్తుంది.

కేంద్ర మార్గదర్శకాల ప్రకారం పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులకు లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ఫండ్‌తో పాటు ఇతర గ్రాంట్లు అందనున్నాయి.

సర్కారీ భవనాలపై రూఫ్‌టాప్ సోలార్.. ప్రభుత్వ పాఠశాలలు, ఇందిరమ్మ గృహాలు, ప్రభుత్వ భవనాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలపై రూఫ్‌టాప్ సౌర విద్యుత్తు ప్లాంట్ల స్థాపనను ప్రోత్సహించనున్నారు.

'ప్రజావాణి'తో సత్ఫలితాలు

» పేద బాలిక ఆరోగ్య సమస్యపై స్పందించి సత్వర వైద్యం

» అధికారులకు సీఎం అభినందనలు

» 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ట్వీట్ చేసిన రేవంత్

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదల వాణి విని.. వారి సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ప్రజావాణి' సత్ఫలితాలను ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పేదబాలిక బిస్మిల్లా బీ ఆరోగ్య సమస్యపై సత్వరం స్పందించి, మెరుగైన వైద్యం అందించి ఆమె ప్రాణాలు నిలబెట్టిన ప్రజావాణి అధికారులను 'ఎక్స్' వేదికగా అభినందించారు. బిస్మిల్లా బీ ఆయురారోగ్యాలతో కలకాలం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. బిస్మిల్లా, తల్లి జూమన్ బీకి శుభాకాంక్షలు తెలిపారు. బిస్మిల్లా బీ ప్రజావాణిని ఆశ్రయించడం.. ఆమెకు అధికారులు చికిత్స చేయించడంపై 'మా అమ్మాయికి చికిత్స చేయించండి' అన్న శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనాన్ని కూడా ఈ సందర్భంగా సీఎం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

గృహజ్యోతికి రూ.180 కోట్లు

గృహజ్యోతి పథకం కింద గృహ వినియోగదారులకు 200 యూనిట్ల దాకా ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్నందుకు గాను డిస్కమ్‌లకు రూ.180.62 కోట్లను సబ్సిడీ రూపంలో విడుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శనివారం జీవో జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గత మార్చి 1 నుంచి గృహజ్యోతి అమల్లోకి వచ్చింది. గృహజ్యోతి పథకానికి 2024-25లో రూ.1612.12 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. అయితే 200 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగిస్తూ... దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి ప్రభుత్వం గృహజ్యోతి కింద జీరో బిల్లులు జారీ చేస్తూ... ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్న విషయం విదితమే. దాదాపు 45 లక్షలకు పైగా వినియోగదారులకు ఈ పథకం కింద ప్రయోజనం కలుగుతుంది.

మూసీ పునరుజ్జీవానికి ప్రపంచ బ్యాంకు రుణం



కేంద్రం అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ

» రూ.4,100 కోట్ల రుణం పొందేందుకు ప్రతిపాదనలు

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనుల కోసం ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలని నిర్ణయించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపింది. విషతుల్యంగా మారిన మూసీ నీటిని శుద్ధి చేసి.. మూసీనదిని సుందరీకరించేందుకుగాను 55 కిలోమీటర్ల మేర నదీ పరివాహకాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తొలి దశలో 17 కిలోమీటర్ల మేర మూసీ పునరుజ్జీవ పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం ఆరేళ్ల వ్యవధిలో రూ.5863 కోట్ల నిధులు ఖర్చు చేసేలా ప్రతిపాదనలు రూపొందించారు. ఈ మొత్తంలో రూ.4,100 కోట్లను ప్రపంచ బ్యాంకు నుంచి రుణంగా తీసుకోవాలని ప్రాజెక్టు ప్రాథమిక నివేదిక (పీపీఆర్) ఆధారంగా నిర్ణయించినట్లు కేంద్ర ఆర్థిక శాఖకు పంపిన నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. మిగిలిన రూ.1763 కోట్లను రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఖర్చు చేయనున్నట్లు తెలిపింది. తొలి విడతలో మూసీ ఎగువ ప్రాంతం నుంచి బాపుఘాట్ వరకు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే బాపుఘాట్ వద్ద అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను సింగపూర్ కన్సార్టియం మెయిన్ హార్ట్ సమర్పించినట్లు తెలిసింది. ఇక మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులోని ఇతర పనులకు అవసరమైన నిధులను కేంద్ర, రాష్ట్ర పథకాల నుంచి, సీఎస్ఆర్ నిధులతో, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో.. ఇలా వివిధ మార్గాల ద్వారా సమీకరించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. అంతేకాకుండా గ్రీన్ బాండ్లను కూడా జారీ చేసి ప్రకటనలు, పర్యాటక కార్యక్రమాల ద్వారా నిధులు సేకరించనున్నారు.

పునరుజ్జీవంలో ప్రాధాన్య అంశాలు ఇవే..

మూసీ ప్రక్షాళనలో ప్రధానంగా నీటి నిర్వహణపైనే ప్రభుత్వం దృష్టి సారించింది. మూసీలో మురుగునీటికి అవకాశం లేకుండా చర్యలు చేపడుతోంది. ఇందుకోసం 37 ఎస్టీపీల నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పిలిచింది. మురుగునీటిని శుద్ధిచేసి మూసీలోకి వదిలేలా ప్రణాళికలు రూపొందించింది. ఎస్టీపీలతోపాటు మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను తీసుకొచ్చి మూసీ నదిపై ఉన్న హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లలో మంచినీరు నింపి.. ఆ నీటిని నిరంతరం మూసీలో ప్రవహింపజేసేలా సన్నాహాలు చేస్తోంది. 2026 జూన్ నాటికి మంచినీటితో మూసీ కళకళలాడాలన్నది ప్రభుత్వ సంకల్పంగా చెబుతోంది. మూసీ ఆక్రమణల్ని తొలగించి వరదల నుంచి విపత్తులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు.. నదీ పరివాహకంలో నివాసముంటున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించే కార్యక్రమాలు కూడా చేపట్టింది. నిర్వాసితులకు మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు ప్రత్యేక కమిటీని నియమించింది. వీటితోపాటు నదీ పరివాహకంలో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడం కోసం ప్రత్యేక పార్కులను అభివృద్ధి చేయనుంది. నది సహజత్వాన్ని పునరుద్ధరించేందుకు అవసరమైన పనులు చేపట్టనుంది. నదీ పరివాహకంలోకి ప్రజల రాకపోకలు సాఫీగా సాగేందుకు అవసరమైన రహదారుల నిర్మాణం చేపట్టి రవాణా వ్యవస్థను బలోపేతం చేయనుంది. దీని ద్వారా పర్యాటకులను మూసీవైపు తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. పర్యావరణ హిత వాణిజ్య కార్యకలాపాలు చేపట్టేందుకు వీలుగా మూసీ పరివాహకంలో అవసరమైన చోట హాకర్స్ జోన్లు, రిక్రియేషన్ జోన్ల నిర్మాణాలు, వాణిజ్య భవన సముదాయాలను చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసింది.

లగచర్ల ఘటన..

25కు చేరిన అరెస్టులు

మరో నలుగురికి జ్యుడీషియల్ రిమాండ్

వికారాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లగచర్ల ఫార్మావిలేజ్ ఘటనలో పోలీసులు శనివారం మరో నలుగురిని అరెస్టు చేశారు. పరిగి ఠాణా నుంచి వారిని తరలించి.. కొడంగల్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత కోర్టులో హాజరుపరచగా.. జడ్జి వారికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. దీంతో.. ఇప్పటి వరకు రిమాండ్ అయిన వారి సంఖ్య 25కు చేరుకుంది. ఈ కేసులో ఇంకా 22 మంది అరెస్టు కావాల్సి ఉండగా.. కీలక నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

వికారాబాద్‌కు మహేశ్ భగవత్

లగచర్ల కేసు దర్యాప్తును స్వయంగా పర్యవేక్షిస్తున్న శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్ శనివారం వికారాబాద్‌కు వచ్చారు. తొలుత జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయంలో ఎస్పీ నారాయణరెడ్డి, ఇతర అధికారులతో సమావేశమై.. లగచర్ల దర్యాప్తు తీరుపై ఆరా తీశారు. మిగతా నిందితుల అరెస్టుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులపై రైతులు, ప్రజలు దాడి చేయడానికి దారితీసిన పరిస్థితులు.. పోలీసులు వ్యవహరించిన తీరును ఆ సమయంలో ఘటనాస్థలిలో ఉన్న పోలీసులను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు అధికారులు దాడికి ముందు.. ఆ తర్వాత పరిస్థితులను ఆయనకు వివరించారు. కీలక నిందితుడు సురేశ్‌రాజ్, మరో ముగ్గురి అరెస్టుకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. లగచర్ల, రోటింబడ తండా, పులిచర్ల తండా.. వాటి పరిసర గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన నేరుగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కార్యాలయానికి చేరుకున్నారు. ఘటన గురించి ఆయనను కూడా అడిగి తెలుసుకున్నారు. కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై దాడి జరిగిన తీరు.. తాము దాడి నుంచి బయటపడిన విధానం గురించి కలెక్టర్ వివరించారు. అనంతరం మహేశ్ భగవత్ కలెక్టరేట్ నుంచి బయటకు వస్తుండగా మీడియా మాట్లాడేందుకు ప్రయత్నించింది. దానికి ఆయన నిరాకరిస్తూ కేసు విచారణ ఇంకా కొనసాగుతోందని చెప్పారు.

కలెక్టర్‌కు భద్రత పెంపు

లగచర్ల దాడి నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు హోంశాఖ భద్రత పెంచింది. ప్రస్తుతం ఆయనకు ఉన్న 1+1 భద్రతను 2+2గా మార్చింది. అంటే.. ఆయనకు భద్రతగా సాయుధ బలగాల(ఏఆర్)కు చెందిన ఇద్దరేసి గన్‌మన్లు రెండేసి షిఫ్టుల్లో పనిచేస్తారు.

మృత్యువులోనూ వీడని బంధం

రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కుమారుడి దుర్మరణం

» భార్య పరిస్థితి విషమం.. భద్రాద్రి జిల్లా తిప్పనపల్లి వద్ద ఘటన

చంద్రుగొండ/ఎర్రుపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు పనిమీద ఊరెళ్లి వస్తూ ఊహించని రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కుమారుడు మృతి చెందారు. భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి వద్ద శనివారం ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టిన ఘటనలో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం కొత్తపాలెం ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న చిలుమూరి సతీశ్ కుమార్ శర్మ (40) ఆయన కుమారుడు హనీశ్వర్ (9) మృతి చెందారు. కొన్నేళ్ల క్రితం ఆంధ్రా నుంచి వలస వచ్చిన సతీశ్ కుమార్ శర్మ.. భార్య, పిల్లలతో కలిసి ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఉంటూ అక్కడి ఆంజనేయస్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఆయన భద్రాద్రి జిల్లా అశ్వాపురానికి బ్యాంక్ పని మీద భార్య హిమబిందు, కుమారుడు హనీశ్వర్‌తో కలిసి బైక్‌పై వెళ్లారు. అక్కడ పని ముగించుకొని తిరిగి వస్తుండగా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి వద్ద బైక్ అదుపు తప్పి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సతీశ్ కుమార్ శర్మ ఆయన కుమారుడు హనీశ్వర్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ భార్య హిమబిందును కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి కుమార్తె నిత్యలక్ష్మి ఎర్రుపాలెం కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. పూజారి సతీశ్ కుమార్ శర్మ ప్రస్తుతం అయ్యప్ప మాల ధరించి ఉన్నారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందడంతో కొత్తపాలెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

20 నుంచి సర్వే వివరాల నమోదు!

» డేటా ఎంట్రీ ఆపరేటర్లకు మాస్టర్ ట్రైనింగ్ పూర్తి

» రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మందికి పైగా ఆపరేటర్లు

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేలో సేకరించిన వివరాలను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసేందుకు అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు డమ్మీ సాఫ్ట్‌వేర్‌పై ప్రభుత్వం శిక్షణ ఇచ్చింది. శనివారం హైదరాబాద్‌లోని నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జిల్లాకు 5-10 మంది, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 20 మంది చొప్పున మొత్తం 300 మంది హాజరయ్యారు. సర్వే వివరాలను సాఫ్ట్‌వేర్‌లో నమోదుచేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 20వేల మందికిపైగా ఆపరేటర్లు అవసరమవనున్నట్టు ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... సర్వే వివరాల నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని శిక్షణకు హాజరైన ఆపరేటర్లకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 50 శాతం సర్వే జరిగినట్లు తెలిపారు. కాగా, ప్రస్తుతం సర్వే ఉమ్మడి జిల్లాల వారీగా కాకుండా కొత్త జిల్లాల వారీగానే సాగుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటై, తక్కువ జనాభా ఉన్న జిల్లాల్లో సర్వే వేగంగా జరుగుతోందని అధికారిక వర్గాలు అంటున్నాయి. దీంతో సర్వేలో వచ్చిన వివరాలను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసే ప్రక్రియను ఈ నెల 20 నుంచి ప్రారంభించే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.

లగచర్ల ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు

బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో రైతులు దాడులు చేశారన్న నెపంతో పోలీసులు అక్కడి మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ బీఆర్ఎస్ నేతలు శనివారం ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బాధిత మహిళలతో వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు కమిషన్ ఛైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా బాధిత మహిళలు తమతో పోలీసులు వ్యవహరించిన తీరును వివరించారు. తమపై దాడి చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అత్యాచార కేసులు నమోదు చేయాలని కోరారు. లగచర్ల ఘటనలో దాడి జరిగింది ఎస్సీ, ఎస్టీలపైనేనని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ ఆరోపించారు. రైతులు దాడులు చేశారన్న నెపంతో ఎస్సీ, ఎస్టీ మహిళలతో పోలీసులు అసభ్యకంగా ప్రవర్తించారని, ఈ అంశంపై దర్యాప్తు జరిపించి న్యాయం చేయాలని కమిషన్‌ను కోరామన్నారు. ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పాలనకు లగచర్లలో పోలీసులు వ్యవహరించిన తీరే ఉదాహరణ అన్నారు. రేవంత్ తన నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ కోసం గిరిజనులపై దురహంకారంతో వ్యవహరిస్తూ వారి భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలన్నారు. ఫార్మా కంపెనీ కోసం భూములు కోల్పోతున్న ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. త్వరలోనే కమిషన్ లగచర్లలో పర్యటిస్తుందని తెలిపారు.

లోకం తీరు



గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్య

- ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం
- కొత్లాపూర్ పాఠశాలలో ఘటన
- కూతురి మృతిపై అనుమానాలున్నాయని పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు
- సంగారెడ్డి ఆస్పత్రి వద్ద సీపీఐ, విద్యార్థి సంఘాల నేతల ఆందోళన

సంగారెడ్డి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని శనివారం ఆత్మహత్య చేసుకుంది. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న స్వాతి(14) అనే బాలిక ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఏపీలోని గుంటూరుకు చెందిన పాండురాజ్, దివ్యవాణి దంపతుల చిన్న కుమార్తె స్వాతి.. కొత్లాపూర్ గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతుంది. పాండురాజ్ దంపతులు సదాశివపేటలో ఉంటూ హైదరాబాద్, మదీనగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారి పెద్ద కుమార్తె పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నది. కాగా, ఎప్పట్లాగే శనివారం ఉదయం 6 గంటలకు పాఠశాలలో జరిగే ప్రార్థనలో పాల్గొన్న తర్వాత హాస్టల్‌లోని తన గదికి వెళ్లిన స్వాతి ఎంతసేపటికి తిరిగి రాలేదు. దీంతో తోటి విద్యార్థినులు ఆమె కోసం వెళ్లగా తలుపు లోపలి నుంచి గడియపెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడగా స్వాతి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు స్వాతిని వెంటనే సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. బాలిక అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. స్వాతి మృతిపై పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. తమ కుమార్తె ఆత్మహత్య చేసుకునేంత పిరికి వ్యక్తి కాదని, స్వాతి మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు తెలిపారు. ఈ మేరకు వారి నుంచి ఫిర్యాదు తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద బాధిత కుటుంబంతో కలిసి సీపీఐ, విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తగిన న్యాయం చేస్తామని అధికారులు బాధిత కుటుంబానికి హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళన విరమించారు. విద్యార్థిని కుటుంబానికి రూ.2 లక్షలు, అంత్యక్రియలకు రూ.50వేలు ఇచ్చేందుకు ఆర్డీవో రవీందర్‌రెడ్డి, గురుకుల పాఠశాల జాయింట్ సెక్రటరీ తిరుపతి అంగీకరించారు. కాగా, మానసిక ఒత్తిడితోనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని వివరాలు తెలిసే అవకాశముందని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ తెలిపారు.


స్వాతి (ఫైల్)

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- ధర్నాచౌక్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ధర్నా
- మద్దతు ప్రకటించిన ఈటల, కోదండరాం, కృష్ణయ్య

కవాడిగూడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ)లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్న డిమాండ్‌తో శనివారం ధర్నా చౌక్ వద్ద తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు అన్ని జిల్లాల నుంచి సమగ్ర శిక్షా ఉద్యోగులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి కూడా ధర్నాకు హాజరై ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. తమను విద్యాశాఖలో విలీనం చేసి పేస్కేల్ అమలు చేయాలని ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు డిమాండ్ చేశారు. ప్రతీ ఉద్యోగికి రూ.10 లక్షల జీవిత బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు వారి సర్వీసులను క్రమబద్ధీకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ..ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని, దశల వారీగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తుందని అన్నారు.

కామారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో పసికందు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకుల ఆందోళన

కామారెడ్డిటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శనివారం ఓ పసికందు మృతి చెందగా అందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆ శిశువు కుటుంబీకులు ఆందోళన చేశారు. కామారెడ్డికి చెందిన రాధకు శనివారం తెల్లవారుజామున నొప్పులు రాగా ఉదయం 6 గంటలకు ఆమెను కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. మొదట నార్మల్ డెలివరీ కోసం ప్రయత్నించిన వైద్యులు తర్వాత ఆపరేషన్ చేసి డెలివరీ చేశారు. అయితే కడుపులోనే బిడ్డ చనిపోయిందని వైద్యులు చెప్పడంతో రాధ కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే బిడ్డ చనిపోయిందని రాధ భర్త శేఖర్ ఆరోపించాడు. నిర్లక్ష్యం వహించిన వైద్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మార్కుల్లో కోతపెట్టిన ప్రొఫెసర్లకు మెమోలు

- జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ ఆదేశం

హైదరాబాద్ సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజీ పరీక్షల విభాగంలో జరిగిన తప్పులను సరిదిద్దకుండా కాలయాపన చేయడమేంటని ప్రిన్సిపాల్ నరసింహారెడ్డిని ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం ప్రశ్నించారు. ఇన్‌చార్జ్ వీసీ శనివారం వివిధ విభాగాల డైరెక్టర్లు, హెచ్‌వోడీలతో సమావేశమయ్యారు. ఇటీవల వర్సిటీలో పలు పరిణామాలపై ఆయన మాట్లాడుతూ 150 మంది విద్యార్థులకు సెమిస్టర్ మార్కుల్లో కోత పెట్టిన ప్రొఫెసర్లకు మెమో జారీ చేయాలని, బాధ్యులైన విభాగాధిపతిని సంజాయిషీ కోరాలని స్పష్టం చేశారు. వర్సిటీలో, క్యాంపస్ కళాశాలలో వివిధ సమస్యల పరిష్కారానికి 5 కమిటీలను సోమవారంలోగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వానికి తెలియకుండా గతంలో ఒక వీసీ 80 కళాశాలలకు నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీలు) జారీచేశారని, ఆయనకు సహకరించిన అకడమిక్ ఆడిట్ సెల్ అధికారులు ఇకనైనా మారకుంటే జైలుకు వెళ్లకతప్పదని హెచ్చరించారు. ఒక సందర్భంలో ప్రభుత్వాన్నే సవాల్ చేసిన సదరు వ్యక్తిపై ఏసీబీ దర్యాప్తుకు ఆదేశించామని, దర్యాప్తు అధికారులు త్వరలో జేఎన్టీయూకు వచ్చే అవకాశం ఉందన్నారు. జేఎన్‌టీయూకు వివాదరహితుడైన వ్యక్తిని వైస్‌చాన్స్‌లర్‌గా నియమించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారన్నారు. ప్రభుత్వం రెండు రోజుల్లో వర్సిటీకి పాలక మండలిని నియమిస్తుందన్నారు.

ప్రేమించకపోతే ఎయిడ్స్ ఇంజక్షన్ ఇచ్చేస్తా..!

- చెప్పిన మాట వినకపోతే మీ అమ్మానాన్నని చంపేస్తా
- నర్సింగ్ విద్యార్థినికి ఓ యువకుడి బెదిరింపులు
- పోలీసులను ఆశ్రయించిన యువతి, కేసు నమోదు

హయత్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రేమించకపోతే ఎయిడ్స్ (హెచ్‌ఐవీ) ఇంజక్షన్ ఇస్తా, చెప్పిన మాట వినలేదో మీ అమ్మానాన్నని చంపేస్తా.. అంటూ బెదిరిస్తున్న ఓ యువకుడి వేధింపులు తాళలేక ఓ యువతి శనివారం హయత్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. హైదరాబాద్, హయత్‌నగర్ ప్రాంతానికి చెందిన బాధిత యువతి ప్రస్తుతం బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. నాగార్జునసాగర్‌కు చెందిన చెరుకుపల్లి విజయ్‌కుమార్ (26) ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆమెకు పరిచయమై స్నేహితుడయ్యాడు. విజయ్ ఇటీవల ఆమెను ప్రేమ పేరిట వేధిస్తున్నాడు. వీరిద్దరూ స్నేహితులుగా ఉన్న సమయంలో తీసుకున్న ఫొటోలను చూపించి డబ్బు వసూలు చేశాడు. తనని ప్రేమించకపోతే ఎయిడ్స్ ఇంజక్షన్ ఇచ్చి జీవితాంతం రోగిలా ఉండేలా చేస్తానని, చెప్పిన మాట వినకపోతే తల్లిదండ్రులను చంపేస్తానని యువతిని బెదిరిస్తున్నాడు. తనతో బయటకు రావాలంటూ ఇల్లు, బస్టాప్, కళాశాల వద్ద ఇబ్బంది పెడుతుండడంతోపాటు చేయి కూడా చేసుకుంటున్నాడు. ఈ వేధింపులు తాళలేక పోలీసులను ఆశ్రయించిన బాధిత యువతి విజయ్ కుమార్ నుంచి తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని పోలీసులను కోరింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు తేల్చేందుకే కమిషన్

బీసీ ప్రత్యేక కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు

నల్లగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తేల్చడానికే బీసీ ప్రత్యేక కమిషన్ ఏర్పాటైందని కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో స్థానిక సంస్థల రిజర్వేషన్లపై శనివారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో బహిరంగ విచారణలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ, ఇతర కుల సంఘాల బాధ్యుల నుంచి వినతి పత్రాలను స్వీకరించిన అనంతరం ప్రజాభిప్రాయం సేకరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ గ్రామపంచాయతీ, వార్డులు, జిల్లా, మండల పరిషత్‌లలో ఎంత శాతం రిజర్వేషన్ ఉండాలనే విషయం తేల్చడానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటైందని, ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక కమిషన్ కార్యదర్శి బి.సైదులు, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నల్లగొండ వైద్య కళాశాలలో ర్యాగింగ్?

జూనియర్ డాక్టర్ సహా నలుగురిపై సస్పెన్షన్ వేటు

నల్లగొండ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో వైద్య కళాశాలలో ర్యాగింగ్ భూతం కలకలం రేపింది. జూనియర్ వైద్య విద్యార్థులను ర్యాగింగ్ చేసినందుకు కళాశాలకు చెందిన ఓ జూనియర్ డాక్టర్ సహా ముగ్గురు వైద్య విద్యార్థులను సస్పెండ్ చేసినట్టు తెలిసింది. కేరళకు చెందిన జూనియర్ విద్యార్థులను 15 రోజుల క్రితం పలువురు ర్యాగింగ్ చేశారు. దీనిపై బాధిత విద్యార్థులు ఈ నెల 12న కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. తమతో ఇబ్బందికరమైన రీతిలో మాట్లాడుతూ, చెప్పిన పని చేయమని వేధిస్తున్నారని అందులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన యాంటీ ర్యాగింగ్ కమిటీ ఓ జూనియర్ డాక్టర్, ముగ్గురు వైద్య విద్యార్థులు మద్యం మత్తులో ర్యాగింగ్ చేశారంటూ జిల్లా కలెక్టర్, వైద్య విద్య సంచాలకులకు నివేదిక ఇచ్చింది. దీంతో ర్యాగింగ్‌కు పాల్పడిన 2020 బ్యాచ్‌కి చెందిన ఇద్దరు వైద్య విద్యార్థులను ఆరు నెలలు, 2023 బ్యాచ్‌కి చెందిన మరో విద్యార్థికి ఒక నెల, జూనియర్ డాక్టర్‌ను మూడు నెలలు సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

మూసీ పేరిట ఢిల్లీకి మూటలు

(మొదటి పేజీ తరువాయి)

అని, ఢిల్లీవాళ్లకు కోపం వస్తే సీఎం పదవి ఎప్పుడు ఊడుతుందో తెలియదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే ప్రయోజనమెంత అంటూ తమను ప్రశ్నించారని, మరి మూసీ ప్రాజెక్టుతో మురిసే రైతులెంత మంది? కొత్తగా సాగులోకి వచ్చే ఆయకట్టు ఎంత? మూసీ మూటల్లో మీ వాటా ఎంత? అంటూ రేవంత్‌ను ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్యాద్రి నాయుడు, షేక్ అరిఫ్ తమ అనుచరులతో కలిసి శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పైరవీల కోసం పార్టీ మారినప్పటికీ తామున్నామంటూ కార్యకర్తలు బీఆర్ఎస్ వెనకాల నిలబడటం గర్వంగా ఉందన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

సంక్షేమానికి లేని నిధులు మూసీకి ఎక్కడివి?

సంక్షేమ పథకాలకు పైసలు లేవంటగానీ మూసీ ప్రాజెక్టుకు రూ.లక్షా 50వేల కోట్లు ఉన్నాయనడం విడ్డూరమని కేటీఆర్ అన్నారు. రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ సహాయక మంత్రిగా మారాడని, తాము సీఎంను తిడితే బీజేపీ ఎంపీలకు రోషమొస్తుందని, బండి సంజయ్, రఘునందన్‌రావు, విశ్వేశ్వర్‌రెడ్డి, అర్వింద్ తట్టుకోలేకపోతున్నారని కేటీఆర్ అన్నారు. అసలు వాళ్లు బీజేపీలో ఉన్నారా లేక కాంగ్రెస్‌లో ఉన్నారా? రేవంత్ కూ డా బీజేపీలో ఉన్నాడా? కాంగ్రెస్‌లో ఉన్నాడా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

పొంగులేటి బాంబులు పేలడం లేదు

బాంబుల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అమావాస్యకు బాం బులు కొంటే కార్తీక పౌర్ణమి నాటికి కూడా పేలడం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆయన తుస్సు బాంబుల శాఖ మంత్రి అని అన్నారు. తాను కోకాపేట భూముల్లో అవినీతికి పాల్పడ్డానని రేవంత్ ఆరోపించారని, విచారణ జరిపించి తప్పు చేస్తే శిక్ష వేయాలని కేటీఆర్ సవాల్ చేశారు.

వందలాది కేటీఆర్‌లు పుట్టుకొస్తారు

రేవంత్‌రెడ్డి గాడ్సే శిష్యుడని, గాడ్సే వారసుడని కేటీఆర్ ఆరోపించారు. గాంధీ విగ్రహాన్ని అడ్డం పెట్టుకుని శిఖండి రాజకీయాలు చేస్తామంటే మంచిది కాదని సూచించారు. ఏవో కేసులు పెట్టి జైల్లో పెడితే ప్రశ్నించటం మానేస్తామనుకుంటున్నారని, తాను జైలుకు పోతే వందలాది మంది కేసీఆర్‌లు, కేటీఆర్‌లు పుట్టుకొస్తారని అన్నారు. ఇప్పుడే పోరాటం మొదలైందని, మరో నాలుగేళ్లు కాంగ్రెస్‌తో పోరాటం చేయాల్సి ఉందన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీలకు సిగ్గులేదని, ఏ పార్టీలో ఉన్నారో చెప్పేదమ్ము లేదన్నారు. రాజేంద్రనగర్‌లో ఉప ఎన్నిక రావటం ఖాయమని, ఆ ఎన్నికలో గులాబీ జెండా ఎగరటం ఖాయమని అన్నారు.

హామీలను నమ్మి ఓట్లేస్తే భస్మాసుర హస్తమైంది...

శరం తప్పినోడు చేనేస్తే వడగళ్ల వానకు పోయిందట అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ఎక్స్(ట్విట్టర్) వేదికగా విమర్శించారు. 420 హామీల కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా కింద రూ.15 వేలు రాలేదని, రూ.2 లక్షల పంట రుణాల పథకం పూర్తిగా అమలు కాలేదని అన్నారు. 24 గంటల ఉచిత కరంటు మాయమైందని, పంటల కొనుగోళ్లు జరగడం లేదని, వరి ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వలేదని పేర్కొన్నారు. అబద్ధపు హామీలను నమ్మి ఓటేస్తే... భస్మాసుర హస్తమైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు.. మాజీ ఎమ్మెల్యే జైపాల్ విచారణ

- తిరుపతన్న కాల్ లిస్టు చుట్టూ దర్యాప్తు
- ఎఫ్ఎస్ఎల్ నివేదిక ఆధారంగా ప్రశ్నలు
- ఓ కుటుంబం వివాదం గురించి.. తిరుపతన్నతో మాట్లాడా: జైపాల్ యాదవ్
- మరో ఇద్దరు మాజీల విచారణకు చాన్స్

హైదరాబాద్, ఆమనగల్లు, కల్వకుర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ శనివారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఏసీపీ నేతృత్వంలోని బృందం ఆయనను విచారించింది. విచారణ సాంతం మాజీ అదనపు ఎస్పీ తిరుపతన్న కాల్ లిస్ట్ చుట్టూ తిరిగింది. "మీరు తిరుపతన్న మొబైల్ ఫోన్‌కు రెండు ఫోన్ నంబర్లు పంపించారు. వాటిని ఎందుకు పంపారు?" అని ప్రశ్నించినట్లు తెలిసింది. ఆ రెండు నంబర్లను ట్యాప్ చేయాల్సిందిగా పంపారా? అనే కోణంలో సమాధానాలు రాబట్టేందుకు ప్రయత్నించారు. సుమారు రెండు గంటల పాటు విచారణ కొనసాగింది. కాగా.. ఈ కేసులో ఇటీవలే మరో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను పోలీసులు విచారించిన విషయం తెలిసిందే..! లింగయ్య ఇచ్చిన రెండు నంబర్లను తిరుపతన్న ట్యాప్ చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరులు మదన్‌రెడ్డి, రాజ్‌కుమార్ ఫోన్లను తిరుపతన్న ట్యాప్ చేసినట్లు నిర్ధారణ కావడంతో.. పోలీసులు లింగయ్యను మరోమారు విచారించే సూచనలు కనిపిస్తున్నాయి. ఇంకా ఒకరిద్దరు మాజీ ఎమ్మెల్యేలు, ఓ పారిశ్రామికవేత్తను పోలీసులు విచారించనున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు నమోదైన తర్వాత.. ఎఫ్ఎస్ఎల్ నివేదిక రావడంతో.. దర్యాప్తు అధికారులు తిరుపతన్న కాల్‌డేటా ఆధారంగా ముందుకు సాగుతున్నారు. ఈ కేసులో కీలక పాత్ర పోషించిన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఓ టీవీ చానల్ సీఈవో శ్రవణ్‌కుమార్‌లను విదేశాల నుంచి వెనక్కి రప్పించేందుకు రెడ్‌కార్నర్ నోటీసులను జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే.. ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసి.. ఆ తర్వాతే భారత్‌కు వచ్చే యోచనలో ప్రభాకర్‌రావు ఉన్నట్లు పోలీసువర్గాలు చెబుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్‌కు ఇజ్రాయెల్ నుంచి ప్రత్యేక పరికరం(షార్ట్ రేంజ్ బగ్) తెప్పించిన రవిపాల్‌ను మరోసారి విచారించేందుకు దర్యాప్తు అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యేలు లింగయ్య, జైపాల్‌ను పోలీసులు విచారించడంతో.. ఇప్పుడు గులాబీ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది.

నేను ఏ తప్పూ చేయలేదు: జైపాల్

విచారణ అనంతరం జైపాల్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. "నేను ఏ తప్పూ చేయలేదు. ఏ రాజకీయ నాయకుడి ఫోన్‌ను ట్యాప్ చేయాలని తిరుపతన్నను ఆదేశించలేదు. తిరుపతన్నది నాది ఒకే సామాజిక వర్గం. ఓ వివాదానికి సంబంధించి ఇద్దరు వ్యక్తులతో మాట్లాడాలని కోరుతూ.. తిరుపతన్నకు రెండు నంబర్లను పంపాను" అని వివరించారు. దర్యాప్తు అధికారులు మరోసారి విచారణకు రావాలని ఏమీ కోరలేదని 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. పోలీసుల విచారణకు సహకరించానని పేర్కొన్నారు.

మెడికోకు గుండు కొట్టించిన అసిస్టెంట్ ప్రొఫెసర్

- ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఘటన
- అంతర్గత విచారణ చేపట్టిన అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ మెడికోకు అసిస్టెంట్ ప్రొఫెసర్ గుండుకొట్టించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖమ్మం మెడికల్ కళాశాలలో జరిగిన ఈ ఘటనపై ఉన్నతాధికారులు గోప్యంగా విచారణ చేపట్టారు. ములుగు జిల్లాకు చెందిన ఓ విద్యార్థి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈ ఏడాది ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో చేరాడు. కళాశాల హాస్టల్‌లో ఉంటున్న ఈ విద్యార్థి ఈనెల 12న రాత్రి చైనీస్ స్టైల్‌లో హెయిర్ కటింగ్ చేయించుకుని వచ్చాడు. సెకండియర్ విద్యార్థులు అది బాగోలేదని చెప్పడంతో మళ్లీ వెళ్లి ట్రిమ్మింగ్ చేయించుకుని వచ్చాడు. ఆ విద్యార్థి వచ్చేసరికి హాస్టల్‌లో యాంటీ రాగింగ్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ విషయాన్ని తెలుసుకుని కోపోద్రిక్తుడయ్యారు. ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆ విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బయటికి తీసుకెళ్లి సెలూన్ షాప్‌లో గుండుగీయించినట్లు తెలిసింది. దాంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆ మెడికో రాత్రికి రాత్రే కళాశాల ప్రిన్సిపాల్‌కు ఆ ప్రొఫెసర్‌పై ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా యాంటీ రాగింగ్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను 13న అక్కడి నుంచి తప్పించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం బయటికి పొక్కింది. దీంతో ఘటనపై మరింత విచారణ నిర్వహించేందుకు నలుగురితో కమిటీని వేశామని, నివేదికను డీఎంఈకి పంపిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఈక్విటీ ఫండ్స్‌లో లాభాలంటూ రూ.48.97 లక్షల బురిడీ

మరో ఘటనలో ఐటీ ఉద్యోగికి 4.77లక్షల టోకరా

హైదరాబాద్ సిటీ, మహబూబ్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఈక్విటీ ఫండ్స్‌లో ట్రేడింగ్ చేస్తే అధిక లాభాలు వస్తాయని నగరానికి చెందిన ఓ వ్యాపారిని బురిడీ కొట్టించారు సైబర్ కేటుగాళ్లు. వ్యాపారి నుంచి రూ. 48.97 లక్షలు కొల్లగొట్టారు. శనివారం నగరానికి చెందిన ఓ వ్యాపారికి వాట్సాప్‌లో కాల్ వచ్చింది. అంతర్జాతీయ ఈక్విటీ ఫండ్స్ ప్లాట్‌ఫామ్‌లలో పెట్టుబడులు పెడితే.. అధిక మొత్తంలో లాభాలు వస్తాయని అవతలి వ్యక్తి సలహా ఇచ్చాడు. ప్లేస్టోర్ నుంచి ఈక్విటీ ఫండ్స్‌కు చెందిన ఒక అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేయించాడు. అనంతరం అవతలి వ్యక్తి చెప్పిన సలహాలు, సూచనలతో ప్రారంభంలో మంచి లాభాలు వచ్చాయి. అలా మెల్లగా బాధితున్ని నమ్మిస్తూ... చివరకు రూ.48.97లక్షలు పెట్టుబడులు పెట్టించారు. అందుకు గాను లాభంతో కలిపి మొత్తం రూ.62.13 లక్షలు వచ్చినట్లు యాప్‌లో చూపించారు. అయితే బాధితుడు వాటిని విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా కాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్టకు చెందిన సత్తూరు రమేశ్‌గౌడ్ అనే ఐటీ ఉద్యోగి నుంచి సైబర్ కేటుగాళ్లు రూ. 4.77 లక్షలు కాజేశారు. కస్టమ్స్ అధికారులమంటూ ఫోన్ చేసి మీ పేరు మీద కొరియర్ వచ్చిందని అందులో డ్రగ్స్ సంబంధించిన వివరాలున్నాయని బెదిరించారు. 2 గంటలపాటు ఫోన్‌లో మాట్లాడుతూ అకౌంట్‌లో నుంచి రూ.4.77 లక్షలు కొట్టేశారు.


జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు చేసిన జీఐఎస్ మ్యాప్

సమగ్ర కుటుంబ సర్వే ఆదర్శనీయం

జీఐఎస్ మ్యాప్ సాంకేతికత ఉపయోగకరం

ఎక్స్‌లో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి జైరాం రమేశ్

మిర్యాలగూడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఆదర్శనీయమని ఏఐసీసీ ప్రధానకార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్ శనివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇది చాలా పెద్ద పని అని, దీనికి అపార పరిపాలనా సామర్థ్యం అవసరమని అన్నారు. "తెలంగాణలోని 33 జిల్లాల్లో 1.17 కోట్ల కుటుంబాలను సర్వే చేయడానికి 80 వేల మంది ఎన్యూమరేటర్లు పాల్గొంటున్నారు. 44 వార్డులుగా విస్తరించి ఉన్న మిర్యాలగూడ మునిసిపాలిటీలో మొత్తం 288 ఎన్యూమరేషన్ బ్లాకుల జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) మ్యాప్‌ను అభివృద్ధి చేశారు. ఈ సాంకేతికత భవిష్యత్తులో మునిసిపల్ సేవల కోసం మెరుగైన ప్రణాళికను రూపొందించడానికి ఉపయోగకరం." అని పేర్కొన్నారు. పూర్తి చేసిన షెడ్యూల్ గోప్యతను నిర్ధారించడానికి, వాటిని సురక్షితంగా నిల్వచేయడానికి, భద్రత కలిగిన ఇనుప ట్రంకు పెట్టెలను అధికారులు సిద్ధం చేశారని తెలిపారు. కుల సర్వే సమగ్రత ఎన్నికల ప్రక్రియకు సమానంగా ఉంటుందని జైరాం రమేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీ ముట్టడి ఉద్రిక్తం

ముట్టడికి యత్నించిన ఏబీవీపీ కార్యకర్తల అరెస్టు

- అమ్మవారి క్యూలైన్లలో ఉన్న ఏబీవీపీ నాయకులు అదుపులోకి..
- ఏబీవీపీ కార్యకర్తల అరెస్టు దుర్మార్గం: బండి సంజయ్
- విద్యార్థులు చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజం

బాసర, హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలను నిరసిస్తూ ఏబీవీపీ పిలుపునిచ్చిన క్యాంపస్ ముట్ట డి ఉద్రిక్తంగా మారింది. ఇటీవలే క్యాంపస్‌లో స్వాతిప్రియ అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం, నిరసనల్లో పాల్గొన్న ఏబీవీపీ కార్యకర్తలపై ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం తో ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఏబీవీపీ కార్యకర్తలు ముట్టడికి ప్రయత్నించగా.. వారిని శనివారం ఉద యం నుంచే పోలీసులు అరెస్టులు చేశారు. బాసర రైల్వే స్టేషన్‌లో భారీ సంఖ్యలో ప్రత్యేక బలగాలను మోహరించి.. రైళ్లలో దిగిన కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. కొందరు పోలీసుల కళ్లు కప్పి క్యాంపస్ వద్ద ట్రైన్ చైన్ లాగి సుమారు 30 మంది కార్యకర్తలు ప్రహరీ గోడ దూకి లోపలికి వెళ్లారు. బాసర సరస్వతీ అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో నిలుచున్న ఏబీవీపీ కార్యకర్తలను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఏబీవీపీ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. శనివారం సుమారు 500మందిని అదుపులోకి తీసుకున్నామని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు.


ట్రిపుల్ ఐటీ ప్రహరీ గోడ దూకి లోపలికి వెళ్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

ఏబీవీపీ నాయకుల అరెస్టు హేయమైన చర్య: బండి సంజయ్

బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినికి న్యాయం చేయమంటే విచక్షణారహితంగా దాడి చేయిస్తారా? అక్కడ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది? విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా? అని నిలదీశారు. ఏబీవీపీ నాయకులపై పోలీసులు, బాసర ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం దుర్మార్గం అని సంజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏబీవీపీ నాయకుల అరెస్టు హేయమైన చర్య అని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

అహంకారం.. హాహాకారం!

ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రజాగ్రహం కారణంగా అధికారం కోల్పోయి ప్రతిపక్షంలోకి నెట్టివేయబడిన భారత రాష్ట్ర సమితి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నాయకుల హాహాకారాలు మిన్నంటుతున్నాయి. తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో కొనసాగిన కేసీఆర్ అండ్ కోలో అహంకారం పరాకాష్ఠకు చేరడంతో తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉండిన జిల్లాల ప్రజానీకం భారత రాష్ట్ర సమితికి గట్టి గుణపాఠం చెప్పింది. అధికారంలో ఉన్నప్పుడు కన్నూమిన్నూ కానకుండా అహంకార పూరితంగా వ్యవహరించిన వారు ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని గుర్తు చేసుకుంటున్నారు. దీన్నే కాల మహిమ అంటారు. ధర్మో రక్షతి రక్షితః అంటారు. అధికారంలో ఉన్నప్పుడు తాము ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామన్న వాస్తవాన్ని విస్మరించి నియంతలా వ్యవహరించిన వారు ఇప్పుడు 'ఇదెక్కడి ప్రజాస్వామ్యం?' అంటూ గతం మరచిపోయి మాట్లాడుతున్నారు. తాము

> **జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఆయనతో పరోక్షంగా అంటకాగిన సీపీఎం నాయకులు ఇప్పుడు జెండాలను బయటకు తీసి ఉద్యమాలకు సిద్ధమవుతున్నారు. మరోవైపు జగన్‌రెడ్డి పార్టీతో పరోక్షంగా స్నేహం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సమాజంలో స్వేచ్ఛాయుత వాతావరణం ఉందని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి? సోషల్ మీడియా సైకోలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ అంశంపై జగన్‌రెడ్డి మాత్రమే గుండెలు బాదుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు రహస్యంగా అండదండలు అందించిన సీపీఎం కూడా ఈ విషయంలో జగన్‌తో గొంతు కలపలేని పరిస్థితి. సోషల్ మీడియా సైకోలు చేసిన అరాచకాలను తెలుసుకున్న కొద్దీ ప్రజల్లో ఏవగింపు పెరుగుతోంది. ప్రాథమిక హక్కులు అంటే ఇళ్లలోని ఆడవాళ్లకు రంకులు అంటకట్టడం కాదు కదా?**


శాశ్వతంగా అధికారంలో కొనసాగుతామని నమ్మి విర్రవీగిన బీఆర్‌ఎస్, వైసీపీ నాయకులు ఇప్పుడు 'అధికారం శాశ్వతం కాదు' అని సూక్తులు చెబుతున్నారు. రాజకీయాలలో వ్యక్తిగత కక్షలకు తావు ఉండకూడదు. కానీ.. ఇటు తెలంగాణలో, అటు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందేమిటి? రాజకీయ ప్రత్యర్థులను వ్యక్తిగత శత్రువులుగా ప్రకటించుకొని వేటాడారు. ఈ క్రమంలో వ్యవస్థలను, ముఖ్యంగా పోలీసు వ్యవస్థను భ్రష్టుపట్టించారు. ఇప్పుడు పోలీసులు అధికార పక్షానికి తొత్తులుగా మారారని సుద్దులు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

మారిన కాలం...

గడచిన పదేళ్లలో దేశ రాజకీయాల స్వరూప స్వభావాలు మారిపోయాయి. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి అధికారాన్ని వాడటం పరిపాటిగా మారింది. ఈ విషయంలో ఇటు కేసీఆర్, అటు జగన్‌రెడ్డి సరికొత్త రికార్డులను నెలకొల్పారు. ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చోవలసి రావడంతో 'అధర్మం రాజ్యమేలుతోంది' అని గుండెలు బాదుకుంటున్నారు. తెలుగునాట ఎంతో మంది ముఖ్యమంత్రులుగా పనిచేసినప్పటికీ సొంత మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నది కేసీఆర్, జగన్‌రెడ్డి మాత్రమే. వారిరువురూ అధికారంలో ఉన్నప్పుడు వారి మీడియాకు అంతా పచ్చగా కనబడేది. ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చోవలసి రావడంతో సదరు మీడియాకు సర్వత్రా విధ్వంసమే కనిపిస్తోంది. కొత్త ప్రభుత్వాల పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నట్టు చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయాలలో వ్యక్తిగత కక్షలు తగవు అని మంచి మాటలు చెబితే చెవికి ఎక్కించుకోని వారు ఇప్పుడు గగ్గోలుపెడుతున్నారు. ముందుగా కేసీఆర్ విషయమే తీసుకుందాం! ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ రాజ్యానికి తాను ఒక చక్రవర్తిని అని భావించారు. ప్రతిపక్షాల ముఖం చూడ్డానికి కూడా ఇష్టపడేవారు కారు. ప్రధాన అంశాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించడం అటుంచితే ప్రతిపక్షాలకు చెందిన వారికి వ్యక్తిగత అపాయింట్మెంట్లు కూడా ఇచ్చేవారు కారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కమ్యూనిస్టులు విలక్షణ పాత్ర పోషించేవారు. రాష్ట్ర విభజన తర్వాత వారి ప్రాధాన్యం తగ్గిపోయింది. కమ్యూనిస్టులకు కేసీఆర్ కనీస గౌరవం కూడా ఇవ్వలేదు. ప్రజా సమస్యల గురించి వివరించడానికి సమయం కోరినా నిరాకరించారు. అదే కేసీఆర్‌కు మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా కమ్యూనిస్టుల అవసరం ఏర్పడింది. అంతే.. వారిని ఆహ్వానించి భోజనాలు పెట్టారు. ఆ ఉప ఎన్నికల్లో కమ్యూనిస్టుల సహకారంతో బయటపడ్డారు. ఆ తర్వాత సాధారణ ఎన్నికల వరకు వారి ముఖం చూడలేదు. మునుగోడులో అవగాహన కుదుర్చుకున్నట్టుగానే సాధారణ ఎన్నికల్లోనూ కేసీఆర్ తమతో పొత్తు కుదుర్చుకుంటారని కమ్యూనిస్టులు భావించారు. అయితే, తనకు కమ్యూనిస్టుల అవసరం లేదని భావించిన కేసీఆర్ వారిని కనీసం కలుసుకోవడానికి కూడా ఇష్టపడలేదు. దీంతో సీపీఐ నాయకులు కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టారు. సీట్ల పంపకంలో పేచీ ఏర్పడటంతో సీపీఎం విడిగా పోటీచేసింది. తెలంగాణ ఉద్యమంలో తనతో కలసి నడిచిన, తన ఎదుగుదలకు కారకులైన కోదండరాం వంటి వారందరినీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ దూరం పెట్టారు. అధికారం శాశ్వతమని భావించి అందరినీ వదులుకొని, తానే ఒంటరివారు అయ్యారు. మీడియాను నయానో భయానో లొంగదీసుకునే ప్రయత్నం చేశారు. తనకు నచ్చని అధికారుల ముఖం చూడ్డానికి కూడా ఇష్టపడేవారు కారు. తండ్రి బాటలో కేటీఆర్, కవిత అధికారాన్ని గరిష్ఠంగా అనుభవించారు. ఈ క్రమంలో తాము ప్రజలకు దూరమవుతున్నామని గ్రహించలేకపోయారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వ్యక్తిగత శత్రువుగా ప్రకటించుకున్నారు. పొరపాటున తాము ఓడినా, కాంగ్రెస్ పార్టీ గెలిచినా రేవంత్‌రెడ్డి మాత్రం ముఖ్యమంత్రి కాకూడదని భావించారు. తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచినట్టుగా కాంగ్రెస్ గెలవడం, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం జరిగిపోయాయి. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తనను వెంటాడి వేధించిన కేసీఆర్ కుటుంబంపై ప్రతీకారం తీర్చుకొనే అవకాశం రేవంత్‌రెడ్డికి లభించింది. దీంతో తెలంగాణ రాజకీయాల్లో వ్యక్తిగత కక్షలు ప్రధాన అజెండా అయ్యాయి. అటు కేసీఆర్ అండ్ కో, ఇటు రేవంత్ అండ్ కో కత్తులు దూసుకోవడం మొదలైంది. ఫలితంగా తెలంగాణ రాజకీయాల్లో వేడి రాజుకుంది. ఎన్నికలు జరిగి ఏడాది కూడా పూర్తి కాకముందే తెలంగాణ రాజకీయాలు ఇంతలా మండటానికి కారణం.. రాజకీయ వైరం స్థానంలో వ్యక్తిగత వైరం ప్రవేశించడమే.

ఆందోళన... అయోమయం...

ఢిల్లీ లిక్కర్ కేసులో తన బిడ్డ కవిత తీహార్ జైలుకు వెళ్లాల్సి రావడంతో కేసీఆర్ కుంగిపోయారు. ఇప్పుడు ఫార్ములా వన్ రేసు వ్యవహారంలో కుమారుడు కేటీఆర్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏ క్షణాన్నయినా అరెస్టు చేయవచ్చునన్న వార్తలు రావడంతో ఆయన కలవరం చెందుతున్నారు. కేటీఆర్‌ను నిజంగా అరెస్టు చేస్తారా? చేస్తే ఎంతకాలం జైల్లో ఉండవలసి వస్తుంది? అని బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. అరెస్టుల పర్వం అంతటితో ఆగుతుందా? కేసీఆర్ వరకూ వెళుతుందా? అని బీఆర్‌ఎస్ ముఖ్యులు ఆరా తీస్తున్నారు. ఇటు రేవంత్‌రెడ్డి, అటు కేసీఆర్ కుటుంబం మధ్య వైరం ముదురుతున్నప్పటికీ, ఇది తగదు అని చెప్పే రాజకీయ పార్టీగానీ, వ్యక్తులుగానీ, వ్యవస్థలుగానీ తెలంగాణలో కనిపించడం లేదు. ఈ పరిస్థితికి కేసీఆర్ స్వయంకృతాపరాధమే కారణం. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంఘాలను, ప్రజాస్వామ్య ప్రియులను కేసీఆర్ నిర్లక్ష్యం చేశారు. గతంలో అధికార, ప్రతిపక్షాల మధ్య కీలక సందర్భాలలో మధ్యవర్తిత్వం నడిపిన కమ్యూనిస్టులను కూడా ఆయన అవమానించారు. దీంతో కేసీఆర్‌కు అండగా నిలబడేవారు కరువయ్యారు. విచిత్రం ఏమిటంటే, కేసీఆర్ కుటుంబానికి అరెస్టుల ముప్పు పొంచి ఉందని వార్తలు వెలువడుతున్నా ప్రజల్లో కూడా సానుభూతి ఏర్పడటం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబును అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు ఆయన పట్ల ప్రజల్లో సానుభూతి ఏర్పడింది. ఈ పరిస్థితి తెలంగాణలో కనిపించడం లేదు. కవిత నెలల తరబడి తీహార్ జైల్లో ఉన్నప్పుడు కూడా ప్రజల్లో సానుభూతి కనిపించలేదు. తెలంగాణ జాతిపితగా ప్రకటించుకున్న తన కుటుంబాన్ని కష్టాలు చుట్టుముడుతున్నా ప్రజల్లో స్పందన ఎందుకు లేదో కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. అధికారం శాశ్వతం కాదని అధికారంలో ఉన్నప్పుడు భావించి ఉన్నట్టయితే కేసీఆర్ కుటుంబానికి ఈ దుస్థితి వచ్చేది కాదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్‌గా చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా వ్యవహరించే విషయమై పునరాలోచన చేయాలి. తన ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నందున ప్రజల మనోభావాలు ఎలా ఉన్నాయి? ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడుతున్నదా? అదే నిజమైతే అందుకు కారణాలేమిటి? వంటి ప్రశ్నలు వేసుకొని సమీక్షించుకోవాలి. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్ల ప్రజల్లో సదభిప్రాయం ఉండేది. క్రమేపీ అది కనుమరుగవుతోందన్న వార్తలు వస్తున్నాయి. కేసీఆర్ కుటుంబం పట్ల ప్రజల్లో సానుభూతి ఏర్పడకపోయినా, ప్రభుత్వంపై సానుకూలత కొరవడటం రేవంత్‌రెడ్డికి నష్టం చేస్తుంది. ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి పనితీరుపై కొన్ని వర్గాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నందున రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులు పరిస్థితులను సమీక్షించుకోవలసిన అవసరం ఉంది. తప్పొప్పులను సరిదిద్దుకోవడానికి ఇదే సరైన తరుణం. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వద్దాం!



ఐదు నెలలకే అంత రచ్చ

చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలే అయింది. అయినప్పటికీ రాష్ట్రం అన్ని రంగాలలో అధోగతి పాలవుతోందని జగన్ అండ్ కో గగ్గోలుపెడుతున్నారు. చంద్రబాబు పాలనలో దమనకాండ పెచ్చరిల్లుతోందని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. సోషల్ మీడియా ఉన్మాదులపై చర్యలు తీసుకోవాలన్న విషయాన్ని ప్రభుత్వం మరచిపోయినా ప్రజలు మాత్రం మరచిపోలేదు. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా హరించిన జగన్‌రెడ్డి పాలనను ఎవరు మాత్రం ఎలా మరచిపోగలరు? 'ప్రశ్నించే గొంతులను నొక్కేస్తారా?' అని ఇప్పుడు నీతి వాక్యాలు వల్లెవేస్తున్న జగన్ అండ్ కో మొన్నటిదాకా చేసిందేమిటి? ఈ ఐదు నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం ఏం సాధించింది? ఏం సాధించలేదు? అన్న విషయం పక్కన పెడితే ప్రజలు మాత్రం స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. నీలి మీడియా, కూలి మీడియాకు ఇది కనిపించకపోవచ్చు. తెలంగాణలో వలె ఆంధ్రప్రదేశ్‌లో కూడా కమ్యూనిస్టులకు పెద్దగా ప్రాధాన్యం లేకుండా పోయింది. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు అయనతో పరోక్షంగా అంటకాగిన సీపీఎం నాయకులు ఇప్పుడు జెండాలను బయటకు తీసి ఉద్యమాలకు సిద్ధమవుతున్నారు. మరోవైపు జగన్‌రెడ్డి పార్టీతో పరోక్షంగా స్నేహం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సమాజంలో స్వేచ్ఛాయుత వాతావరణం ఉందని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి? సోషల్ మీడియా సైకోలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ అంశంపై జగన్‌రెడ్డి మాత్రమే గుండెలు బాదుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు రహస్యంగా అండదండలు అందించిన సీపీఎం కూడా ఈ విషయంలో జగన్‌తో గొంతు కలపలేని పరిస్థితి. సోషల్ మీడియా సైకోలు చేసిన అరాచకాలను తెలుసుకున్న కొద్దీ ప్రజల్లో ఏవగింపు పెరుగుతోంది. ప్రాథమిక హక్కులు అంటే ఇళ్లలోని ఆడవాళ్లకు రంకులు అంటకట్టడం కాదు కదా? ఇతరుల మనోభావాలను గాయపరచడం ప్రాథమిక హక్కు కాబోదని తమిళనాడు హైకోర్టు మదురై బెంచ్ తాజాగా వ్యాఖ్యానించింది. పండు వృద్ధులని కూడా చూడకుండా ప్రముఖుల తల్లుల వ్యక్తిత్వ హననానికి పాల్పడిన వారికి ప్రాథమిక హక్కులు ఉండాలని జగన్‌రెడ్డి

> **గడచిన పదేళ్లలో దేశ రాజకీయాల స్వరూప స్వభావాలు మారిపోయాయి. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి అధికారాన్ని వాడటం పరిపాటిగా మారింది. ఈ విషయంలో ఇటు కేసీఆర్, అటు జగన్‌రెడ్డి సరికొత్త రికార్డులను నెలకొల్పారు.**

చెప్పగలరా? తన భార్య భారతిరెడ్డి వ్యక్తిత్వ హననానికి ఎవరైనా పాల్పడితే ఆయన సహించగలరా? ఇతరుల తల్లులు, భార్యలను అవమానించినప్పుడు వారికి కూడా అంతే బాధ కలుగుతుంది కదా? ఈ నేపథ్యంలో జగన్‌రెడ్డికి మద్దతుగా ఒక జర్నలిస్టు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు తీవ్రంగా స్పందించింది. హైకోర్టు న్యాయమూర్తులనూ వదలకుండా వేధించిన సోషల్ మీడియా సైకోలపై చర్యలు తీసుకోవద్దా? అని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కారణంగానే జగన్ రోత మీడియా పేజీలకు పేజీలు అభూత కల్పనలతో కథనాలు వండి వార్చినా జగన్‌రెడ్డితో గొంతు కలిపేవారే కరువయ్యారు. అనాగరిక పాలన చేసిన జగన్‌రెడ్డి ఇప్పుడు ఎంతో కొంత ఫలితం అనుభవించాలి కదా?

'హోదా' కోసం బాధ

తాను 30 ఏళ్ల పాటు అధికారంలో కొనసాగుతానని జగన్‌రెడ్డి నమ్మడమే కాకుండా, అలా అనేక కలలు కన్నారు. కానీ, ప్రజలు ఈ ఎన్నికల్లో ఆయనకు ప్రతిపక్ష నేత హోదా కూడా ఇవ్వలేదు. అయినప్పటికీ తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకపోతే శాసనసభకు హాజరు కాబోనని అంటున్న జగన్‌రెడ్డిని ఎలా అర్థం చేసుకోవాలి? 1994లో ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా లభించకపోయినా అప్పుడు సీఎల్పీ నాయకుడిగా ఉన్న దివంగత పి.జనార్దన్‌రెడ్డి ప్రభుత్వంపై పోరాటం చేశారు. "నేను అంత.. నేను ఇంత" అని చెప్పుకొనే జగన్‌రెడ్డికి ఆ మాత్రం నైతిక ధైర్యం కూడా లేదే? శాసనసభలో చంద్రబాబును ఎదుర్కోలేరా? సభకు ముఖం చాటేయడం పిరికితనమే అవుతుంది. కుటుంబ సభ్యులను కూడా దూరం చేసుకున్న జగన్‌రెడ్డితో కేసీఆర్‌ను పోల్చలేము. కాకపోతే ఇద్దరు నాయకులూ నియంతృత్వ పోకడలతో ఒకరితో ఒకరు పోటీ పడి ప్రజలకు దూరమయ్యారు. ఇతర పక్షాల నుంచి నైతిక మద్దతు కూడా పొందలేని స్థితిలో ప్రస్తుతం ఉన్నారు. 30 ఏళ్లు అధికారంలో ఉంటామని ప్రగల్భాలు పలికిన జగన్ అండ్ కో ఇప్పుడు అధికారం శాశ్వతం కాదని సుద్దులు చెప్పడం కొసమెరుపు!

సాయిరెడ్డికి సవాల్...

రాజకీయాలలో అప్పుడప్పుడూ నీచత్వానికి పరాకాష్ఠ అనదగిన నికృష్టులు తారసపడుతుంటారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ప్రస్తుతం అటువంటి నికృష్టుడిని విజయసాయిరెడ్డి రూపంలో చూడవచ్చు. కావ్య నాయిక చింతామణి మంచం కింద ఒకరిని, తలుపు చాటున మరొకరిని దాచిపెట్టేది. అలాగే విజయసాయి రెడ్డి కూడా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వైసీపీకి, నాయకుడు జగన్‌రెడ్డికి విధేయుడినని చెప్పుకుంటూనే.. చీకటి మాటున ఇతర పార్టీల నాయకులను కలుసుకుంటుంటారు. ఏబీఎన్ చానల్‌లో ఏదో ఒక కార్యక్రమం ప్రసారమైందని, అందులో తనను విమర్శించారంటూ ఈ నికృష్టుడు నన్ను తిడుతూ సుదీర్ఘ ట్వీట్ చేశాడు. ఆ ట్వీట్‌లో నాపై చేసిన ఆరోపణలకు స్పందించాల్సిన పని లేదు. ఎందుకంటే నేనేమిటో, నా ప్రస్థానం ఎలా మొదలైందో గతంలో ఓపెన్‌గా చెప్పాను. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. సాధారణ జర్నలిస్టు మీడియాకు అధిపతి అవడం ఏమిటి? అని ఆశ్చర్యపోతున్నాడు మన ఏ2 విజయసాయిరెడ్డి. ఈ ప్రశ్నకు నేను గతంలోనే జవాబిచ్చాను. మా నాన్న ముఖ్యమంత్రి కాదు– జగన్‌రెడ్డివలే దొంగ ఆడిటర్ విజయసాయిరెడ్డి వంటి వారి సహకారంతో తెల్లారే సరికి మా వ్యాపార సామ్రాజ్యాన్ని నెలకొల్పలేదు. ఒక్కో ఇటుకా పేర్చుకుంటూ 'ఆంధ్రజ్యోతి'ని విస్తరించాం. విజయసాయి వంటి నీచ నికృష్టుడికి ఉన్న తెలివితేటలు నాకు ఉన్నట్టయితే రోత మీడియా వలె ఒకేసారి 23 ఎడిషన్లు ప్రారంభించి ఉండేవాడిని. నేను బ్లాక్ మెయిల్ చేస్తాను, డీల్ మేకర్‌ని అని కూడా ఈ నీచుడు నన్ను నిందించాడు. బ్లాక్ మెయిల్ చేసి డబ్బు సంపాదించే బుద్ధి ఉంటే ఇటు తెలంగాణలో, అటు ఆంధ్రప్రదేశ్‌లో కేసీఆర్, జగన్‌రెడ్డితో ఏకకాలంలో పోరాడాల్సిన అవసరం ఏమిటి నాకు? ఎవరినో

బ్లాక్ మెయిల్ చేసే బదులు ముఖ్యమంత్రులతోనే రాజీపడిపోవచ్చు కదా! ఆ ఇద్దరు ముఖ్యమంత్రుల అహంకార ధోరణుల వల్ల ప్రజలకు నష్టం జరుగుతుందని నమ్మి పోరాడి ఆర్థికంగా ఎంతో నష్టపోయాం. అయినా చలించలేదు. నాతో సయోధ్య కుదుర్చుకోవడానికి జగన్‌రెడ్డి కూడా రాయబారాలను పంపిన విషయం విజయసాయిరెడ్డికి తెలియదా? 'ఎంత కావాలి?' అని అడిగితే 'మీరు ప్రజాస్వామ్యబద్ధంగా పాలించండి చాలు' అని నేను చెప్పిన విషయం మరిచావా? నన్ను డీల్ మేకర్‌గా అభివర్ణించారు కదా! జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు, అధికారం కోల్పోయిన తర్వాత కూడా నన్ను అనేక పర్యాయాలు కలిశావు కదా? ఏ డీల్ కోసం కలిశావో చెప్పు? ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ప్రైవేట్ సంభాషణలను బహిర్గతం చేయడం అనైతికం కనుక విజయసాయిరెడ్డి నా వద్ద ప్రస్తావించిన అంశాలను ఇప్పుడు నేను వెల్లడించడం లేదు. నెల రోజుల క్రితం కూడా ఈ రాజకీయ వికృత జీవి నన్ను కలిశాడు. ఎందుకు కలిశాడో చెప్పే దమ్ముందా అతగాడికి? 'తెలుగు రాష్ట్రాల వెలుపల ఎక్కడైనా తనతో బహిరంగ చర్చకు వచ్చే ధైర్యం ఉందా?' అని సవాలు కూడా విసిరాడు. విజయసాయిరెడ్డి వంటి నీచుడు కూడా చర్చకు ఆహ్వానిస్తే వెళ్లకుండా ఉంటానా? నువ్వూ నేనూ కలసి ఢిల్లీలో 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే' కార్యక్రమం పెట్టుకుందాం. నీ సంగతీ నా సంగతీ ఏంటో తేల్చుకుందాం. ముందుగా ట్వీట్స్ పెట్టడం, ఆ తర్వాత రహస్యంగా కలుసుకొని పైవాళ్ల ఒత్తిడితో చేశాను– నన్ను అపార్థం చేసుకోవద్దని వేడుకోవడం వెన్నెముక లేని ఈ నికృష్టుడికి అలవాటే. ముఖాముఖి చర్చకు సిద్ధం అన్నావు కనుక తాజా ట్వీట్‌లో వాగిన చెత్తకు ఇక్కడ సమాధానం చెప్పడం లేదు. మన ఇద్దరి మధ్య సాగే చర్చను ఏబీఎన్‌లో లైవ్ టెలీకాస్ట్ చేద్దాం. మీ రోత చానల్‌లో కూడా లైవ్ టెలికాస్ట్ చేసుకోవడానికి అనుమతిస్తాను. కండీషన్స్ కూడా ఏమీ లేవు. నువ్వు ఆరోపించినట్టుగా నేను వెధవ పనులు చేసి ఉన్నా, ప్రభుత్వం నుంచి అనుచిత లబ్ధి పొంది ఉన్నా జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు నన్ను వదిలిపెట్టేవారా? ఎంతగా రంధ్రాన్వేషణ జరిపినా ఏమీ దొరకనందునే కదా నా మీద ఒక్క కేసూ పెట్టలేకపోయారు. ప్రభుత్వాలకు ఎదురు వెళ్లడానికి నైతిక బలం ఉండాలి. అది నాకు పుష్కలంగా ఉంది. నీకు ఆ నైతిక బలం లేనందునే కేంద్రంలో అధికారంలో ఎవరుంటే వాళ్ల కాళ్లు పట్టుకుంటావు. నీచ్ కమీన్ విజయసాయికి తెలియనిది


> **ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కమ్యూనిస్టులు విలక్షణ పాత్ర పోషించే వారు. రాష్ట్ర విభజన తర్వాత వారి ప్రాధాన్యం తగ్గిపోయింది. కమ్యూనిస్టులకు కేసీఆర్ కనీస గౌరవం కూడా ఇవ్వలేదు. ప్రజా సమస్యల గురించి వివరించడానికి సమయం కోరినా నిరాకరించారు. అదే కేసీఆర్‌కు మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా కమ్యూనిస్టుల అవసరం ఏర్పడింది. అంతే... వారిని ఆహ్వానించి భోజనాలు పెట్టారు. ఆ ఉప ఎన్నికల్లో కమ్యూనిస్టుల సహకారంతో బయటపడ్డారు. ఆ తర్వాత సాధారణ ఎన్నికల వరకు వారి ముఖం చూడలేదు. మునుగోడులో అవగాహన కుదుర్చుకున్నట్టుగానే సాధారణ ఎన్నికల్లోనూ కేసీఆర్ తమతో పొత్తు కుదుర్చుకుంటారని కమ్యూనిస్టులు భావించారు. అయితే, తనకు కమ్యూనిస్టుల అవసరం లేదని భావించిన కేసీఆర్ వారిని కనీసం కలుసుకోవడానికి కూడా ఇష్టపడలేదు. దీంతో సీపీఐ నాయకులు కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టారు. సీట్ల పంపకంలో పేచీ ఏర్పడటంతో సీపీఎం విడిగా పోటీచేసింది.**

ఏమిటంటే 'ఆంధ్రజ్యోతి' పత్రికను నేను ప్రారంభించాలనుకున్నప్పుడు ఆ విషయం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియనే తెలియదు. మూతపడిన పత్రిక కార్యాలయాలను తెరిచిన తర్వాత మాత్రమే రాజశేఖరరెడ్డితోపాటు చంద్రబాబును కలసి విషయం చెప్పాను. విజయవాడ వద్ద ఏర్పాటు చేసిన మినీ హైడల్ ప్రాజెక్టు విషయం కూడా చంద్రబాబుకు తెలియదు. ముఖ్యమంత్రుల మోచేతి నీళ్లు తాగే అలవాటు లేదు కనుకనే తల ఎత్తుకొని తిరుగుతున్నాను. ఇప్పటివరకు నువ్వే నా ఇంటికి వచ్చావు కానీ నేను నీ ఇంటికి రాలేదే? 'జగన్‌రెడ్డి నన్ను నమ్మడం లేదు, దూరం పెట్టాడు' అని కనిపించిన వారందరి దగ్గరా ఏడ్చే నువ్వో రాజకీయ వ్యభిచారివి. రాజ్యసభలో పార్టీ ఎంపీలను చేర్పిస్తానని భారతీయ జనతా పార్టీ పెద్దలకు చెప్పి ముఖం చాటేస్తున్నదెవరు? 'నువ్వు నమ్మదగిన వ్యక్తివి కావు– మోసగాడివి' అని కేంద్ర హోం మంత్రి నిన్ను ఉద్దేశించి అనడం నిజం కాదా? అయినా 'ఓపెన్ హార్ట్ ప్రోగ్రాం'కు సిద్ధంగా ఉండు. అన్ని విషయాలూ అక్కడే తేల్చుకుందాం. నిజంగా నీది మనిషి పుట్టుకే అయితే నీవు విసిరిన సవాలుకైనా సిద్ధపడు. లేని పక్షంలో 'నీచ మానవుడిని' అని బహిరంగంగా అంగీకరించు... నీచ నికృష్ట విజయసాయిరెడ్డీ! బెస్టాఫ్ లక్!!

> **విజయసాయీ, నువ్వు ఆరోపించినట్టుగా నేను వెధవ పనులు చేసి ఉన్నా, ప్రభుత్వం నుంచి అనుచిత లబ్ధి పొంది ఉన్నా జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు నన్ను వదిలిపెట్టేవారా? ఎంతగా రంధ్రాన్వేషణ జరిపినా ఏమీ దొరకనందునే కదా నా మీద ఒక్క కేసూ పెట్టలేక పోయారు. ప్రభుత్వాలకు ఎదురు వెళ్లడానికి నైతిక బలం ఉండాలి. అది నాకు పుష్కలంగా ఉంది. నీకు ఆ నైతిక బలం లేనందునే కేంద్రంలో అధికారంలో ఎవరుంటే వాళ్ల కాళ్లు పట్టుకుంటావు. నీచ్ కమీన్ విజయసాయికి తెలియనిది ఏమిటంటే 'ఆంధ్రజ్యోతి' దినపత్రికను నేను ప్రారంభించాలనుకున్నప్పుడు ఆ విషయం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియనే తెలియదు. మూతపడిన పత్రిక కార్యాలయాలను తెరిచిన తర్వాత మాత్రమే రాజశేఖరరెడ్డితోపాటు చంద్రబాబును కలసి విషయం చెప్పాను. 'జగన్‌రెడ్డి నన్ను నమ్మడం లేదు, దూరం పెట్టాడు' అని కనిపించిన వారందరి దగ్గరా ఏడ్చే నువ్వో రాజకీయ వ్యభిచారివి. 'నువ్వు నమ్మదగిన వ్యక్తివి కావు– మోసగాడివి' అని కేంద్ర హోం మంత్రి నిన్ను ఉద్దేశించి అనడం నిజం కాదా? అయినా 'ఓపెన్ హార్ట్' ప్రోగ్రాంకు సిద్ధంగా ఉండు. అన్ని విషయాలూ అక్కడే తేల్చుకుందాం.**

కృష్ణాతీరంలో సాహితీ తపస్వి

> **పోలవరపు కోటేశ్వరరావు (1929–2008) కవి, కథకుడు, నవలా రచయిత, నాటకకర్త, వ్యాసకర్త, గేయకర్త, పరిశోధకుడు, భాషా సైనికుడు, సాహిత్య సంస్కృతీ వికాస శ్రామికుడు, స్వాతంత్రోద్యమకారుడు, ఆదర్శ రైతు, పారిశ్రామికవేత్త, వితరణశీలి, వెరసి 'మంచి మనిషి'. కృష్ణానదిపై ఆయన వ్రాసిన 'కృష్ణవేణి' సంగీత రూపకానికి అఖిలభారత స్థాయిలో ఆకాశవాణి ప్రథమ బహుమతి లభించింది. స్వీయచరిత్ర 'నా రచనా మార్గం – అక్షరాన్వేషణ', ఆ కీర్తిశేషుడి సాహితీమూర్తిని సంపూర్ణంగా ఆవిష్కరించింది.**



తెలుగు నేల నాలుగు చెరగులా వివిధ మాండలికాల్లో రచనలు చేసిన రచయితలు, కవులు ఎందరో ఉన్నారు. అన్ని మాండలికాలు మధురమైనవే. 'వచ్చిండన్నా, వచ్చాడన్నా వరాల తెలుగు ఒకటేనన్నా' అని జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సి. నారాయణరెడ్డి ఎలుగెత్తారు. వివిధ మాండలికాలలో రచనలు చేసిన వారిలో కృష్ణా జిల్లా గ్రామీణ మాండలికంలో రచనలు చేసి 'నేటి శ్రీనాధుడు', 'కథాహాలిక', 'కథా కథన సవ్యసాచి'గా బిరుదాంకితుడైన సాహితీ తపస్వి పోలవరపు కోటేశ్వరరావు.

ఈ కీర్తిశేషుడు (1929–2008) కవి, కథకుడు, నవలా రచయిత, నాటకకర్త, వ్యాసకర్త, గేయకర్త, పరిశోధకుడు, సాంఘిక ఉద్యమాల నాయకుడు, భాషా సైనికుడు, సాహిత్య సంస్కృతీ వికాస శ్రామికుడు, పర్యాటకుడు, స్వాతంత్రోద్యమకారుడు, ఆదర్శ రైతు, పారిశ్రామికవేత్త, సినీ నిర్మాత, వితరణశీలి, వెరసి 'మంచి మనిషి'. ముగ్గురు పద్మశ్రీలు ఉన్న సభలో యిచ్చిన 'సాహిత్య తపస్వి', ఆయనకు చక్కగా అతికిన బిరుదు.

తెలుగు సాహిత్యంలో ఉన్న అన్ని ప్రక్రియలలోను 'వాసి' ప్రధానంగా, సుమారు 50 సంవత్సరాల అక్షర సేద్యంలో '55'కు పైగా సృజనాత్మక రచనలు చేసారు. అయన కృతులు 3 వేల పేజీల పర్యంతం విస్తరించాయి.

1929లో కృష్ణానదికి పడమరగా ఉన్న గుంటూరు జిల్లా, అనంతవరంలో లక్ష్మయ్య – శ్రీవేణమ్మలకు కోటేశ్వరరావు జన్మించారు. నదికి తూర్పున ఉన్న కృష్ణాజిల్లా, వీరమాచనేనివారి పాలెంలో ఆయన బాల్యం అంతా గడిచింది. అలా కృష్ణా నదికి ఇరువైపులా, ఆ నదితో పెనవేసుకుపోయిన జనన – బాల్యాల వల్ల, కమ్మని కృష్ణమ్మ నీరు త్రాగుతూ, అందాలను ఆస్వాదిస్తూ, ప్రేమిస్తూ, పరవశిస్తూ, తన చదువు, వ్యవసాయం సాగించారు.

చిన్ననాడే మహాత్మాగాంధీని దర్శించుకున్న ప్రభావంతో, 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. గోడలపై నినాదాలు వ్రాసి, వ్రాయించారు. తన 21వ ఏటనే ఆంధ్రోద్యమం, నందికొండ ప్రాజెక్టు ఉద్యమాలలో, నాయకత్వం వహించారు. చుట్టూ ఉన్న గ్రామాలలోని విద్యార్థులను, యువకులను తాను వ్రాసిన 'ఎన్నికల పోరాటం' వంటి పాటలతో, 'ఆంధ్రభాగోతం' అనే యక్షగానంతో సమీకరించి, రాత్రి పాఠశాలలు – గ్రామీణ ఆటల నిర్వహణ – గ్రామసేవ శిక్షణ – దళిత జనోద్ధరణలలో పాల్గొనేలా చేసారు. 'దీపిక' పేరుతో వ్రాత పత్రిక నిర్వహించారు. ద్వితీయ ప్రపంచ సంగ్రామంపై పరిశోధన వ్యాసాలు, కథలు వ్రాసారు. 'సీతమ్మ', 'రిక్షావాలా' మొదలైన నవలలు వ్రాసారు. యువజనోత్సవాలు నిర్వహించి, జానపదగేయాలు, దేశభక్తిని పెంపొందించే నాటకాలు స్వయంగా వ్రాసి, ప్రదర్శించారు. స్వాతంత్ర్యానంతరం తన ఆలోచనలు – ఆచరణలు, యువజన వికాసానికి, గ్రామ అభ్యుదయానికి వినియోగించారు.

సహకారోద్యమ స్ఫూర్తితో 'ఆంధ్రనాయక విశాల పరపతి సంఘం' స్థాపించారు. వివిధ విషయాలలో జిజ్ఞాస, క్రమశిక్షణ, అధ్యయనాలు ఆయన ఆలోచనా పరిధిని, అవగాహనా విస్తృతిని పెంచాయి. స్థానిక, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ మార్పుల పట్ల ప్రశంసనీయమైన పరిజ్ఞానం సంపాదించారు. విశాలాంధ్ర రాష్ట్ర పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు.

తదనంతరం, విజయవాడ వచ్చి ఆటోమొబైల్ వ్యాపారం చేస్తూ, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమికి సారథ్యం వహిస్తూ, వందలాది సాహిత్య – సాంస్కృతిక కార్యక్రమాలు రూపొందించి, నిర్వహించి, కళారంగానికి తలమానికమైన సేవ చేసారు. కృష్ణా – గోదావరీ బేసిన్ ఓఎన్‌జీసీ ప్రాంతీయ కార్యాలయం ఆంధ్రలోనే ఉండాలనే ఉద్యమంలో ప్రధాన భూమిక వహించారు.

కృష్ణానదిపై వ్రాసిన 'కృష్ణవేణి' సంగీత రూపకానికి అఖిలభారత స్థాయిలో ఆకాశవాణి ప్రథమ బహుమతి అందుకున్నారు. ఆయన రాసిన 'కృష్ణవేణి' సంగీత రూపకం గత మూడు కృష్ణా పుష్కరాల సందర్భంగా ఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాలలోనే కాక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పట్టణాలలో ప్రదర్శిస్తున్నారు. 'దక్షిణ గంగ గోదావరి' అనే టీవీ సీరియల్ రచన – నిర్మాణం చేసి దూరదర్శన్‌లో ప్రసారం చేశారు. ఆయన రేడియో నాటికలు, ప్రసంగాలు అసంఖ్యాకం.

1980లో వ్యాపార వ్యాపకాలకు విరామం ప్రకటించి, పూర్తి స్థాయిలో రచనా వ్యాసంగంలో, సాంస్కృతిక – సామాజిక సేవలో నిమగ్నమయ్యారు. సి. ధర్మారావు గారి స్నేహంతో తెలుగు భాషోద్యమ సమాఖ్యలో ప్రవేశించి, ఇబ్బడిముబ్బడిగా అద్భుతమైన 100కు పైగా కథలు (లచ్చుమయ్య కథలు, కృష్ణా తరంగాలు కాకుళయ్య కథలు మా ఊరి మనుషులు); మహాత్మా జిందాబాద్, శ్రీనాథుల వారొచ్చారు, రాయలు రంగన్న, రథయాత్ర వంటి నాటికలు; మనము– మన నృత్యాలు, నృత్య పూజ వంటి పరిశోధనాత్మక రచనలు; నృత్యారాధన, గౌతమబుద్ధ, యయాతి, విశాలాంధ్ర వైభవం వంటి నృత్య రూపకాలు; చినబాబు – రాజముద్రిక వంటి బాలల నవలలు; భర్తృహరి – గాథాసప్తశతి – చాటువులపై కథలు; మొదలైనవి పోలవరపు కలం నుండి జాలువారాయి. స్వీయచరిత్ర 'నా రచనా మార్గం – అక్షరాన్వేషణ', పోలవరపు కోటేశ్వరరావు సాహితీమూర్తిని సంపూర్ణంగా ఆవిష్కరించింది.

పోలవరపు కుటుంబసభ్యులు తెలుగు భాషను పల్లకీలో మోస్తున్న ఉత్తమ కవులు, రచయితలకు 'సాహితీ తపస్వి పోలవరపు కోటేశ్వరరావు' పురస్కారం ఏర్పాటు చేసారు. అందుకున్న వారిలో శ్రీ విరించి, విహారి, ఆచార్య కొలకలూరి ఇనాక్, శ్రీమతి జలంధర, కన్నెగంటి అనసూయ, శ్రీమతి వాడ్రేవు వీరలక్ష్మీదేవి, వివినమూర్తి, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, పతంజలి శాస్త్రి, సింగమనేని నారాయణ మొదలైన ప్రముఖులు ఉన్నారు.

విజయవాడ, తుమ్మలపల్లి కళాక్షేత్రంలో త్రిపురనేని రామస్వామి, చలం వంటి ఎందరో వైతాళికుల, మార్గదర్శకుల విగ్రహాలను పోలవరపు ప్రతిష్ఠింపచేసారు. 2008లో ఆయన తిరిగిరాని ప్రయాణం పెట్టుకున్నారు. నేనాయనకు పెద్ద అల్లుడినీ, నా భార్య మొదటి కుమార్తె అని మనఃస్ఫూర్తిగా నన్ను ప్రేమిస్తూ ఉండేవారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వున్న ఆయన కాంస్య విగ్రహాన్ని ఎప్పుడూ తలుచుకుంటూ వుంటాను.

పోలవరపు రచనల సంకలనం మూడు భాగాలుగా మా 'లోకనాయక్ ఫౌండేషన్' ద్వారా తీసుకురావడం నా అదృష్టం. మొదటి, రెండవ భాగాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. మూడవ భాగాన్ని మిత్రులు వేమూరి రాధాకృష్ణ ఆవిష్కరించడం ఎంతో ఆనందదాయకం.

• ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
జాతీయ అధ్యక్షులు, విశ్వ హిందీ పరిషత్



ఆదరణ కరువై.. బతుకు బరువై..

- ఆధునికతతో మాయమైన దశాబ్దం నాటి వెలుగులు
- జీవన పోరాటం చేస్తున్న చిందు కళాకారులు
- ఆరునెలలు రంగుల ప్రపంచం.. ఆపై ఉపాధి పోరాటం
- ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొంటున్న కుటుంబాలు
- అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్



8

ఇటీవల నెక్కొండలో ప్రదర్శన ఇస్తున్న చిందు కళాకారులు

సండే స్పెషల్ SUNDAY SPECIAL

మహా భారతం, రామాయణం, పాండవ వనవాసం, సతీసావిత్రి, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణార్జున యుద్ధం, శివగంగ కల్యాణం, అల్లిరాణి, బసవపురాణం, మాదలిక చరిత్ర లాంటి అనేక పురాణ, ఇతిహాసాలను నిరక్షరాస్యులకు సైతం అర్థమయ్యేలా ప్రదర్శించడం చిందు కళాకారుల నైపుణ్యానికి నిదర్శనం. ఆడుతూ.. పాడుతూ.. నవ్విస్తూ.. వీక్షకులను కనువిందు చేస్తూ చరిత్రను కళ్లకు కట్టినట్టు చూపడం వారి చతురత. తొలినాళ్లలో కాలక్షేపంగా వారు ప్రారంభించిన కళ.. వృత్తిగా మారింది. విశేష జనాదరణ పొందింది. కానీ ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం పెరిగి.. అంతర్జాలం అరచేతిలోకొచ్చి జీవితాలను శాసిస్తున్న నేటి రోజుల్లో ఆ చిందు కళ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. బుల్లితెర, వెండితెర ప్రపంచం అంతగా తెలియని రోజుల్లో ఎనలేని ప్రజాదరణ పొందిన చిందు కళలను నమ్ముకున్న కుటుంబాలు నేడు రోడ్డున పడుతున్నాయి. పాత తరం వారి తరహాలోనే ఇప్పుడూ ఆరునెలల పాటు అడపాదడపా ప్రదర్శనలిస్తున్నా వచ్చే సొమ్ములు రోజువారీ ఖర్చులకే సరిపోతున్నాయి. దీంతో మిగిలిన ఆరునెలలు బతుకుదెరువు కోసం కూలిపనులకు వెళుతున్నారు. ఇక వారి పిల్లలైతే ఉన్నత చదువులకు దూరమవుతూ.. చిందు కళను కొనసాగించలేక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

- నెక్కొండ, ఆంధ్రజ్యోతి



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కాంగ్రెస్ బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, అధికారులు



19న ప్రజాపాలన విజయోత్సవ సభ

8

- హనుమకొండలో లక్ష మంది మహిళలతో నిర్వహణ
- సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన
- వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ మాయం.. బీజేపీకి అధికారం దక్కదు
- నిరుపేదల జీవన, ఆర్థిక ప్రగతి కోసమే కుల సర్వే
- మీడియా సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
- సభ నిర్వహణపై ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశం
- సభ విజయానికి దిశా, నిర్దేశం.. ఆర్ట్స్ కళాశాల మైదానం పరిశీలన

ఆ ఠాణాలో షరా 'మామూలే'!

- నగరం నడిబొడ్డున కొందరు పోలీసుల వసూళ్ల పర్వం
- దళారులతో దోస్తీ.. స్థాయిని బట్టి సెటిల్‌మెంట్లు
- ప్రైవేట్ వ్యక్తులతో దందాలు చేయిస్తున్న వైనం



హనుమకొండ టౌన్, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఆ ఠాణాలో వసూళ్లు షరా మామూలైపోయాయి. దళారులతో సన్నిహితంగా ఉంటూ ఎంచక్కా పనులు చేసిపెడుతుంటారు. స్థాయిని బట్టి ఇక్కడ సెటిల్‌మెంట్ చేసుకునే అవకాశం కూడా ఉంది. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధి నగర నడిబొడ్డున ఉన్న ఈ ఠాణా పరిధిలో అనేక వ్యాపారాలు జరుగుతుంటాయి. అధికంగా లాడ్జీలు ఉన్నాయి. అలాగే ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కూడా మారింది. వీటిని ఆసరాగా చేసుకుంటున్న కొందరు పోలీసులు రోజువారీ, నెలవారీ మామూళ్లతో సొమ్ము చేసుకుంటున్నారు.

మచ్చుకు కొన్ని..

- హనుమకొండ బస్టాండ్ పరిసరాల్లో అర్ధరాత్రి వరకు షాపులు నిర్వహించే 15మంది నిర్వాహకుల నుంచి రోజుకు రూ.200 చొప్పున రూ.90,000 గుట్టుచప్పుడు కాకుండా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పోలీస్‌స్టేషన్‌కు వాటర్‌బాటిల్స్ ఈ షాపుల యాజమానులే సరఫరా చేయాలి.
- ఇటీవల కమిషనరేట్ పరిధిలోని ఈస్ట్‌జోన్‌లో పనిచేసే ఓ ఇన్‌స్పెక్టర్ ఈ ఠాణా పరిధిలో రౌండ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించాడు. ఆ రోజు రాత్రి ఓ పాన్‌షాపులో నిషేధిత గుట్కాలు విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకున్న రౌండ్ ఆఫీసర్ స్థానిక ఎస్సైకి అప్పగించగా కేసు, షాపు సీజ్ పేరుతో భయభ్రాంతులకు గురిచేసి సదరు ఎస్సై రూ.20,000 అప్పనంగా తీసుకున్నాడు.
- కొంత కాలం కిందట వివాదంలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాల ప్రహరీ నిర్మించేందుకు పాఠశాల యజమాని నుంచి ఠాణాలోని ఓ అధికారి రూ.30,000 తీసుకొని అవతలివర్గాన్ని కేసుల పేరుతో బెదిరించి ప్రహరీని నిర్మింపచేశాడని విశ్వసనీయ సమాచారం.
- బస్టాండ్ పరిసరాల్లో వ్యభిచారం నిర్వహిస్తున్న కొందరు మహిళలు కొన్ని లాడ్జీలను ఎంపికచేసుకొని రోజుకింత లాడ్జి నిర్వాహకులకు అప్పగిస్తూ దర్జాగా వారి పనివారు కానిస్తున్నారు. వ్యభిచారానికి కేరాఫ్‌గా మారిన సంబంధిత లాడ్జిల నిర్వాహకులు సదరు ఠాణాకు నెలవారీ మామూళ్లు ముట్టజెప్పుతారనే ఆరోపణలున్నాయి.
- నిషేధిత గుట్కాలు విక్రయిస్తున్న వారి నుంచి మామూళ్లు తీసుకొని మౌనంగా ఉంటుండటంతో ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగప్రవేశం చేసి లక్షల విలువ చేసే ప్రభుత్వ నిషేధిత గుట్కాల దందా గుట్టురట్టు చేశారు.

కష్టపడితే విద్యార్థులు గమ్యాన్ని చేరవచ్చు..

- ఈజీఎస్ పనులతోనే గ్రౌండ్‌లను శుభ్రం చేయించుకోవాలి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్
- ఎల్కతుర్తిలో రూ.3.25 కోట్లతో కేజీబీవీ భవన నిర్మాణానికి భూమి పూజ



కేజీబీవీ ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్కతుర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సూచించారు. శనివారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో రూ.3.25కోట్లతో కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల నూతన భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. సమావేశానికి బలగం సినిమా సింగర్ కొమురమ్మ హాజరై పాడిన పాట పలువురిని ఆకట్టుకుంది. అనంతరం మంత్రి ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యార్థులకు కష్టాలు తీరనున్నాయన్నారు. కస్తూర్బా, మోడల్ స్కూల్, రెసిడెన్సియల్ పాఠశాలకు 40 శాతం డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1,029 గురుకులాలు, 3వేలకు పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. దీంతో పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడుతున్నారన్నారు.

ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులు ఎక్కువ మంది ప్రభుత్వ గురుకులాల్లో చదువుకున్న వారేనని మంత్రి తెలిపారు. విద్యార్థుల యోగ క్షేమాలను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు బాధ్యతయుతంగా ఉండాలని సూచించారు. ఇటీవల జగిత్యాల జిల్లా పెద్దపూర్ పాఠశాలలో విద్యార్థి పాము కాటుకు గురై మృతి చెందడంతో విద్యార్థులకు ఎలాంటి పనులు చెప్పవద్దని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. పాఠశాల ఆవరణంలో పెరిగిన పిచ్చి మొక్కలను, గ్రౌండ్‌ను ఈజీఎస్ పనుల్లో శుభ్రం చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం ఎల్కతుర్తి కేజీబీవీ పాఠశాల లోతట్టు ప్రాంతంలో ఉందని, గతంలో జరిగిన సంఘటనలు దృష్టిలో పెట్టుకుని భవన నిర్మాణం చేపట్టాలన్నారు. పాఠశాల ఆవరణంలో పండ్ల మొక్కలు నాటాలని ప్రతీ విద్యార్థి మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కే రఘోత్తంరెడ్డి, వరంగల్ జిల్లా టీజీఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వాహక ఇంజనీర్ జాలి నరేందర్‌రెడ్డి, డీసీవో సునిత ఎంపీడీవో విజయ్‌కుమార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ అనితాదేవి, ఎంఈవో చదువుల సత్యనారాయణరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, సంతాజీ, రాజేశ్వర్‌రావు, మండ సుమన్, అంబాల శ్రీకాంత్, డాక్టర్ రమేష్, గొర్రె మహేందర్, వినయ్, వెంకటేష్, స్వామి, ముప్పు శ్రీనివాస్, వివిధ గ్రామ శాఖల అధ్యక్షులు, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



భూ నిర్వాసితులకు ఇచ్చే స్థలంలో ఏర్పాటు చేసిన బీటీ రోడ్లు

టెక్స్‌టైల్‌పార్కు భూ నిర్వాసితుల్లో హర్షం

- 863 మందికి ఇళ్ల పట్టాలతోపాటు ఇందిరమ్మ ఇళ్లు
- మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

గీసుగొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కుకు భూములు ఇచ్చి కొన్నేళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం తీపికబురు అందించింది. మొత్తం 863 మంది నిర్వాసితులకు స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిర్వాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కుకు శ్రీకారం చుట్టింది. అదే సంవత్సరం అక్టోబర్ 22న గీసుగొండ మండలం శాయంపేట శివారులో పార్కుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. పార్కు కోసం 1,350 ఎకరాలను సేకరించారు. పార్కుకు భూములు ఇచ్చిన రైతులకు ఎకరానికి రూ.9లక్షల95వేల చొప్పున నష్టపరిహారాన్ని అందించారు. దాంతో పాటు ఎకరానికి వందగజాల చొప్పున స్థలం, ఇల్లు, పార్కులో ఏర్పాటు చేసే పరిశ్రమల్లో ఉద్యోగాలు ఇస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ అవేమీ నెరవేరకపోవడంతో పలుమార్లు ఆందోళన చేశారు. కాగా గత జూన్ 29న సీఎం రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్‌పార్కుకు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి భూములు ఇచ్చిన వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారికి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి మోడల్‌కాలనీగా అన్ని హంగులతో తీర్చిదిద్ది ఇవ్వాలని సీఎం ఆదేశించారు. దీంతో కొద్దినెలలుగా నిర్వాసితులకు ఇచ్చే ఇళ్ల స్థలాల్లో బీటీ రోడ్లను శరవేగంగా పూర్తిచేశారు. ఈ నెల 19న సీఎం వరంగల్‌కు వస్తున్న సందర్భంగా వారికి ఇంటిస్థలం పట్టాలతో పాటు రూ.5లక్షలతో నిర్మించే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందిస్తామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి తెలిపారు.

చెరువులు, నాలాల్లో నిర్మాణాలు చేపట్టొద్దు

నీటిపారుదలశాఖ హనుమకొండ డీఈఈ హర్షవర్ధన్ రెడ్డి

ఫేస్ టు ఫేస్



ఆంధ్రజ్యోతి: హనుమకొండ డివిజన్‌లోని చెరువులను డ్రోన్ కెమెరాలతో సర్వే ఎందుకు చేస్తున్నారు..?

నీటిపారుదల శాఖ డీఈఈ: చెరువులను డ్రోన్ కెమెరాలతో సర్వే చేసి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎవరు ఎంక్రోచ్ కాకుండా హద్దులు ఏర్పాటు చేస్తున్నాం..

ఆంధ్రజ్యోతి: ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉంటే ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?

డీఈఈ: ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు ఉంటే టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో జాయింట్ సర్వే చేసి నోటీసులు అందజేసి చర్యలు తీసుకుంటాం..

ఆంధ్రజ్యోతి: నగరంలో వరదకాలువల నిర్మాణ పనులపై కాంట్రాక్టర్లు ఆలస్యం చేస్తున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు?

ఇరిగేషన్ డీఈఈ: హనుమకొండ పరిధిలో నయీంనగర్ నాలా పనులు జరుగుతున్నాయి. వర్షాల వల్ల నాలా పనులు ఆలస్యం అవుతున్నాయి. వేసవిలో పనులు పూర్తి చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ఎఫ్‌టీఎల్ పరిధిలో కబ్జాదారులు వెంచర్లు చేసి అమాయక ప్రజలకు విక్రయిస్తున్నారు. కబ్జాదారులపై ఇప్పటి వరకు చర్యలు ఎందుకు తీసుకోలేదు..?

డీఈఈ : హనుమకొండ పరిధిలో ఇప్పటివరకు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్లు వేసినట్లు మా దృష్టికి రాలేదు. సర్వేపూర్తి చేసిన తరువాత ఎక్కడైనా ఎంక్రోచ్ అయితే సర్వే ఆధారంగా చర్యలు తీసుకుంటాం..

ఆంధ్రజ్యోతి: చెరువుల సర్వేను ఎప్పటివరకు పూర్తి చేస్తారు..?

డీఈఈ: నెల రోజులలో సర్వే పూర్తి చేస్తాం. సర్వే రిపోర్టును కుడా అధికారులకు, రెవెన్యూ అధికారులకు అందిస్తాం. కుడా ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో చెరువుల వివరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం..

ఆంధ్రజ్యోతి : ప్రజలకు మీరు ఎలాంటి సలహాలు ఇస్తున్నారు...?

డీఈఈ: చెరువులు, నాలాలు, ఎఫ్‌టీఎల్ పరిధిలో భూములు కొనుగోలు చేసే ముందు సంబంధిత అధికారులతో భూమికి సంబంధించిన వివరాలు తెలుసుకోవాలి. ప్రస్తుతం అక్కడ చెరువులేకపోయినా ఎఫ్‌టీఎల్‌లో భూములు ఉంటున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- బాలసముద్రం



సదానందంగౌడ్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్‌కు సన్మానం

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అనగోని సదానందం గౌడ్ నియమితులైన సందర్భంగా బీసీ సంఘం నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వద్లకొండ వేణుగోపాల్ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోలా ప్రతాప్, పెరుమాండ్ల అనిల్, పంజాల మధు, బొమ్మగాని ఆదర్శ్ శనిగరపు సుమన్, విక్రమ్ పాల్గొన్నారు.

గ్రూపు-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ● నేటి నుంచి రెండు రోజుల పాటు పరీక్షలు



హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17, 18 తేదీలలో జరిగే గ్రూపు-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివార అదనపు కలెక్టర్ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాలకు అధికారులు ముందుగానే చేరుకుని అన్ని వసతులు ఉన్నాయా లేదా గమనించాలని, లేనట్లయితే సంబంధిత అధికారులతో సమకూర్చుకోవాలన్నారు. పరీక్షల కేంద్రంలో నిరంతర విద్యుత్, మంచినీరు, టాయిలెట్స్ సౌకర్యాలు కల్పించాలని, ముఖ్యంగా అంగవైకల్యం ఉన్న అభ్యర్థులకు గ్రౌండ్‌ఫ్లోర్‌లో పరీక్ష రాసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతీఒక్క రూట్ అధికారులు తమకు కేటాయించిన రూట్‌లో పరీక్షాపత్రాన్ని తరలించే సమయంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలీసు బందోబస్తుతో పరీక్షకేంద్రానికి చేరుకోవాలని, దారిలో ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రతీ ఒక్క ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎప్పటికప్పుడు పరీక్షా కేంద్రాలను సందర్శించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో ఆర్‌డీవో రమేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవికుమార్, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, లోకల్ రూట్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఐడెంటికల్ అధికారులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ కలెక్టరేట్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షల కోసం వరంగల్ జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు రెండుదశల్లో పరీక్ష జరగనుంది. వరంగల్ జిల్లాలో మొత్తం 10,919 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. ఇందుకు గాను 28 సెంటర్లను ఏర్పాటు చేసి మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. 28మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 32 మంది పరిశీలకులు, 82 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఐదుగురు రూట్ ఆఫీసర్లు, 28 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

గ్రూప్-3 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

హనుమకొండ టౌన్: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆదివారం, సోమవారం నిర్వహించబోయే గ్రూప్-3 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపాల్లో సమావేశాలు, ర్యాలీలు, సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు నిషేధించామన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. ఉత్తర్వులు అతిక్రమించేవారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పరీక్ష సజావుగా సాగేందుకు కమిషనరేట్ పరిధిలోని 127 పరీక్ష కేంద్రాల వద్ద రెండు రోజుల పాటు 144 సెక్షన్ సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ పేర్కొన్నారు.

మైనారిటీల సంక్షేమంలో ప్రభుత్వం విఫలం

మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్



హనుమకొండలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఇంతియాజ్

బాలసముద్రం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్రప్రభుత్వం మైనారిటీల సంక్షేమంలో విఫలమైందని మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మైనారిటీలకు మంజూరైన రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. మైనారిటీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే రానున్న రోజుల్లో మైనారిటీల హక్కుల కోసం పోరుబాట పడుతామన్నారు. కాళోజీ కళాక్షేత్రం పేరును ఉర్దూలో అధికారికంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు నయీముద్దీన్, సయ్యద్ మసూద్, ఇస్మాయిల్, ఖలీల్, తస్లీమ్, గౌస్‌ఖాన్, అహ్మద్, అబిద్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



నిందితుడిని అరెస్ట్ చూపిన కాజీపేట పోలీసులు

ఆటో చోరీ చేసిన వ్యక్తి అరెస్టు

కాజీపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆటో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాజీపేట ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండకు చెందిన భూక్య రాజేశ్ ఈనెల 5న కాజీపేటలో ఆటోను పార్క్ చేసి వెళ్లి సరుకులు కొని వచ్చేసరికి ఆటోచోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తుండగా శనివారం కడిపికొండ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా చోరీ జరిగిన ఆటో నడుపుతూ కమలాపూర్‌కు చెందిన మాటేటి రమేశ్ పట్టుబడ్డారు. చోరీ చేసిన ఆటోను హైదరాబాద్‌లో అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆటోను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపారు.



శఠగోపాలాచార్యకు ఉత్తమ సంస్కృత పండిత పురస్కారం

హనుమకొండ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉభయ వేదాంత శ్రీమాన్ సముద్రాల శఠగోపాలచార్య ఉత్తమ సంస్కృత పండిత పురస్కారాన్ని అందుకోబోతున్నారు. ఈనెల 17వ తేదీన హైదరాబాద్‌లోని వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో జరిగే కార్యక్రమంలో ఆయనకు ఈపురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. మరింగంటి శ్రీ రంగాచార్య తిరునక్షత్రోత్సవ ప్రయుక్త 20వ స్మారక పురస్కారంగా దీనిని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా శఠగోపాలాచార్య ఈపురస్కర ప్రదానం జరుగుతుంది.

శఠగోపాలాచార్య ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త. విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారకుడు. బహుగ్రంథ కర్త. శ్రీవైష్ణవ సిద్ధాంత ప్రచారంలో భాగంగా అనేక సభలు, సమావేశాలు నిర్వహించారు. సంప్రదాయసేవ చేస్తూ అనేక గ్రంథాలను తెలుగులో రాశారు. రామాయణం, భారత, భాగవత పురాణాలలోని విషయాలను అందరికీ అర్థమయ్యే రీతిలో పదహారుకుపైగా పుస్తకాలు రచించారు. వాఙ్మయ సుధాతరంగాలు, సద్భావలహరి, ఆర్షవిజ్ఞాన సౌరభాలు మొదలైనవి వీటిలో ఉన్నాయి. వరంగల్, హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రాల ద్వారా అనేక ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. పలు పత్రికల్లో వందలాది వ్యాసాలు రాశారు. కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం డిగ్రీ, పీజీ విద్యార్థులకు 17 పాఠ్యపుస్తకాలు రాశారు. ఐదు పుస్తకాలకు సంపాదకత్వం హించారు. తిరుమల తిరుపతి, యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో ధార్మిక ప్రసంగాలు చేశారు. శఠగోపాలచార్య సేవలకు గాను పలు పురస్కారాలు వరించాయి. డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య సాహితీ పురస్కారం, డాక్టర్ వంగీపురం రామానుజాచార్య స్మారక పురస్కారం, కోవెల రంగాచార్య స్మారక పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం, వేదనిధి పురస్కారం అందుకున్నారు.

నేడు కెరీర్ పాయింట్‌లో సీపీ స్టార్ స్కాలర్‌షిప్ టెస్ట్

న్యూశాయంపేట, నవంబరు16(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ వారి జాతీయ స్థాయి నీట్, ఐఐటీ కోచింగ్ సెంటర్ హనుమకొండ హంటర్‌రోడ్‌లోని న్యూశాయపేట జంక్షన్‌లో ఉన్న కెరీర్ పాయింట్ వరంగల్ బ్రాంచ్‌లో ఆదివారం పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు సీపీ స్టార్ టాలెంట్ టెస్ట్-2025 నిర్వహిస్తున్నట్లు వరంగల్ బ్రాంచ్ చైర్మన్ జె.కరుణాకర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30గంటల నుంచి 12గంటల వరకు ఈ పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దాదాపు రూ.1.5కోట్ల విలువ గల స్కాలర్‌షిప్, రివార్డులు అందేవిధంగా, టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన వారికి పూర్తి ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు. ఈ సదవకాశాన్ని పదో తరగతి విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

నైపుణ్యంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి



విద్యార్థినికి డిగ్రీ ప్రదానం చేస్తున్న కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రతాప్‌రెడ్డి

హసన్‌పర్తి, న వంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యంతో సమస్యల పరిష్కారానికి కృషిచేసి సమాజహితానికి పాటుపడాలని కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాసురోడ్డు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్లేఫీల్డ్‌లో శనివారం స్వయం ప్రతిపత్తి 2020-2024 7వ అటానమస్ బ్యాచ్ విద్యార్థుల 41వ వార్షికోత్సవ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోకేరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, గౌరవ అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, గవర్నింగ్ బాడీ చైర్మన్ కెప్టెన్ వి.లక్ష్మీకాంతారావు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ కె.అశోకేరెడ్డిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 28 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, అకాడమిక్ మెరిట్ అవార్డులు, డిగ్రీలు, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ గ్రాండ్ అంట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కిట్స్ యాజమాన్య కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, వి.కిషన్‌రావు, ఇ.వెంకట్రాంరెడ్డి, కె.దేవిప్రసాద్, ఎ.సత్యనారాయణరాజు, డాక్టర్ వి.పవన్, కె.ప్రతాప్‌రెడ్డి, ఎ.హరీష్, వి.శ్రీరామ్‌రావు, కిట్స్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.కోమల్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ వి.రాజగోపాల్, అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ కె.వేణుమాధవ్, సీఈవో ప్రొఫెసర్ వి.రాజగోపాల్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.కిరణ్‌కుమార్, డాక్టర్ ఎస్.ఉమామహేశ్వర్, డాక్టర్ డి.రాజయ్య, యూజీ కోర్సుల ఇన్‌చార్జి ఫ్యాకల్టీ డాక్టర్ పి.ప్రభాకర్‌రావు, పీజీ కోర్సుల ఇన్‌చార్జి ఫ్యాకల్టీ డాక్టర్ ఆర్.శ్రీకాంత్, పీఆర్వో డాక్టర్ డి.ప్రభాకరాచారి, వివిధ విభాగాధిపతులు, డీన్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు అధ్యాపకులు, సిబ్బంది, 1200లకు పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నకిలీ డాక్టర్‌ను పట్టుకున్న వైద్య మండలి సభ్యులు



నకిలీ వైద్యుడి(సర్కిల్‌లోని వ్యక్తి)ని విచారిస్తున్న కమిటీ సభ్యులు

వరంగల్ మెడికల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్ ద్వారా డాక్టర్‌గా చెప్పుకుంటూ ప్రజలను బురిడీ కొట్టించిన నకిలీ వైద్యుడు వేములవలస రాంబాబును తెలంగాణ వైద్య మండలి అధికారులు పట్టుకున్నారు. టీజీఎంసీ అధికారులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఇమ్రాన్‌అలీ మూడు నెలలు రెక్కీ నిర్వహించి ఎట్టకేలకు హైదరాబాద్‌లోని సాయివాణి హాస్పిటల్‌లో శనివారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్ కుమార్ మాట్లాడుతూ.. అంబులెన్స్‌లో పనిచేసేందుకు ఫస్ట్ ఎయిడ్ శిక్షణ తీసుకొన్న రాంబాబు.. డాక్టర్‌గా చెలామణి అవుతూ ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో ఎలాంటి శాస్త్రీయత, విశ్వసనీయత లేని ఆరోగ్య సలహాలు ఇస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేయడం ఇతడి నైజం అన్నారు. అలాగే ఇన్‌స్టాగ్రామ్‌తోపాటు ఇతర సామాజిక మాధ్యమాల్లో వచ్చే నకిలీ వైద్యుల సలహాలు ఎవరూ పాటించరాదని వారు సూచించారు. కాగా, నకిలీ వైద్యుడిపై ఎన్ఎంసీ చట్టం 34, 35, టీఎస్ఎంపీఆర్ యాక్ట్ 22 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అర్హతకు మించి వైద్యం చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

హనుమకొండ జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్‌గా అజీజ్‌ఖాన్?



బాలసముద్రం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ 14వ చైర్మన్‌గా హనుమకొండకు చెందిన అజీజ్‌ఖాన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించినట్లు సమాచారం. ఈ మేరకు శనివారం గ్రంథాలయ సంస్థ రాష్ట్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు తనకు ఫ్యాక్స్ ద్వారా అందినట్లు అజీజ్‌ఖాన్‌ను ఆంధ్రజ్యోతికి తెలిపారు. హనుమకొండ బొక్కలగడ్డకు చెందిన అజీజ్‌ఖాన్.. 2017 అక్టోబరు 18 నుంచి 2023 వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పనిచేశారు. 2023లో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. మళ్లీ ఆయనను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రెండోసారి కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. అజీజ్‌ఖాన్ 1987 నుంచి యూత్ కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, 1997 నుంచి 2002 వరకు కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీగా, 2003 నుంచి 2008 వరకు మైనారిటీ జిల్లా చైర్మన్‌గా, 2000 నుంచి 2010 వరకు రెండు పర్యాయాలు కార్పొరేటర్‌గా పని చేశారు. అజీజ్‌ఖాన్ నియామక విషయంపై జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయానికి ఇంకా ఎలాంటి ఉత్తర్వులు రాలేదని సంబంధిత అధికారులు తెలిపారు.

పుస్తక పఠనం ద్వారానే మెరుగైన సమాజం

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. రియాజ్



'తెలంగాణ చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రియాజ్ తదితరులు

హనుమకొండ చౌరస్తా, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం ద్వారానే మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి.రియాజ్ అన్నారు. జాతీయ పుస్తక వారోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ అశోక కాంప్లెక్స్‌లోని నవ చేతన బుక్ హౌస్‌లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి నారాయణరెడ్డి రచించిన 'తెలంగాణ చరిత్ర' పుస్తకాన్ని, ప్రముఖ న్యాయవాది ఏరుకొండ జయశంకర్ రచించిన 'చెదిరిన స్వప్నం' పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు పుస్తక పఠనం పెంపొందించుకోవాలని సూచించారు. నవ చేతన బుక్ హౌస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలో ప్రముఖుల రచనలను అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. నవ చేతన బుక్‌హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ.. పుస్తక ప్రదర్శన ఈనెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు. అన్ని రకాల పుస్తకాలపై 10 నుంచి 30 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, న్యాయవాది ఏరుకొండ జయశంకర్, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, బుక్ హౌస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం



ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్, స్టాలిన్‌లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలపైన స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్, మల్లేశ్, భరత్, అజయ్, సాయికుమార్, సందీప్, ప్రశాంత్, రాహుల్, సూరత్ తదతరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మట్టెవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గౌట్ ఎగ్జామ్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జీటీఏ వరంగల్ జిల్లా పక్షాన శనివారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి ప్రకాశ్‌గౌడ్, ఆకోజు కిరణ్, భరత్, అశోక్, రఘు, తులసీరాణి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కనీస వసతులు లేని కాలనీలు

- అధ్వానంగా రోడ్లు.. కానరాని డ్రెయినేజీలు
- సౌకర్యాల లేమితో శ్మశాన వాటిక
- ఇబ్బందుల్లో 4వ డివిజన్ ప్రజలు
- పరిష్కరించాలని వేడుకోలు

రెడ్డికాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 4 డివిజన్ అభివృద్ధిలో వెనుకబడింది. పెద్దమ్మ గడ్డ నుంచి కేయూ జంక్షన్ వరకు వంద ఫీట్ల రోడ్డును ఆనుకొని ఉన్న ఈ డివిజన్ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. వరంగల్ నగర పాలక సంస్థ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

● రోడ్లపై మురుగు నీరు

4వ డివిజన్‌లో ఎక్కడా డ్రైనేజీ కానరాదు. మురుగు కాల్వల నిర్మాణం జరగలేదు. మురుగునీరంతా రోడ్లమీదే పారుతుంటుంది. ద్విచక్రవాహనదారులు ఈ బురద రోడ్లపై నుంచి వెళుతూ తరుచూ ప్రమాదానికి గురవుతున్నారు. వర్షాకాలం వస్తే పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. లోతట్టు ప్రాంతాల్లో మురుగు నీరంతా ఇళ్లలోకి కూడా ప్రవేశిస్తుంటుంది. డ్రైనేజీలు నిర్మించాలని కార్పొరేషన్ అధికారులను ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకునేవారే లేరని డివిజన్‌వాసులు వాపోతున్నారు. డివిజన్‌లో పలుచోట్ల పైప్‌లైన్ లీకేజీలతో ప్రజలు సతమతమవుతున్నారు. తాగునీరు కలుషితమై రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. గౌతమ్‌నగర్, లోటస్ కాలనీలో లీకేజీలను అరికట్టాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునేవారే కరవయ్యారని విమర్శిస్తున్నారు.

● అధ్వానంగా అంతర్గత రోడ్లు

డివిజన్‌లో అంతర్గత రోడ్లు అత్యంత అధ్వాన్నంగా మారాయి. గతంలో వేసిన రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. కంకర తేలి నడవడానికి వీలులేని పరిస్థితులు నెలకొన్నాయి. కొత్తగా వెలసిన కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం జరగలేదు. ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయడం లేదు. రాత్రి వేళ అయితే విద్యుత్‌దీపాలు సరిగా వెలగక, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పని చేయక అంతా చీకటిమయం కావడంతో ఎదురుగావచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

వసతుల్లేని శ్మశాన వాటిక

డివిజన్‌లో రెడ్డిపురం రోడ్డులో కట్టపక్కన ఉన్న స్మశాన వాటికలో కనీస వసతులు లేవు. దహన సంస్కారాలు చేయాలంటే తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీటి సరఫరా లేదు. చెట్లు, చెదారంతో లోపల అడుగుపెట్టడానికి వీలులేకుండా ఉంది. డివిజన్‌లో కమ్యూనిటీ హాళ్లు లేవు. ప్రజల సౌకర్యార్థం రెడ్డికాలనీ, క్రిష్ణకాలనీలో రూ.52 లక్షల చొప్పున రెండు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదు. నిధులూ విడుదల కాలేదు.

రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి..

డాక్టర్ కుమార స్వామి, గౌతమ్ నగర్



డివిజన్‌లో రోడ్లు సరిగా లేక తరూచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉంది. దోమలు స్వైర్యవిహారం చేస్తున్నాయి. పందులు, కుక్కలు విచ్చల విడిగా తిరగుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. నగరంలోని ఇతర డివిజన్ల కన్నా 4వ డివిజన్ అభివృద్ధిపరంగా బాగా వెనుకబడింది. ఇప్పటికైనా డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.



డ్రెయినేజీ లేక రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

వివక్ష చూపుతున్నారు..

బొంగు అశోక్, 4వ డివిజన్ కార్పొరేటర్



డివిజన్ అభివృద్ధికి గతంలో సుమారు రూ.3కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాను. మరో కోటి రూపాయల ప్రతిపాదనలకు సంబంధించిన ఫైళ్లను ఇప్పటి పాలకులు తొక్కిపెడుతున్నారు. డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు, అంతర్గత రోడ్ల, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సమర్పించిన ప్రతిపాదనలు మంజూరు చేయకపోవడం అన్యాయం. కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లకు ఒక న్యాయం, మాకు ఒక న్యాయమా?. నిధులు రాకుండా మేయర్, ఇతర అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అడ్డుపడుతున్నారు.



కంకర తేలిన రోడ్డు



అధ్వానంగా అంతర్గత రోడ్డు

ఉప ఎన్నికల్లో అవకాశమివ్వాలి

పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం

కాజీపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాజీపేట 61వ డివిజన్‌కు త్వరలో జరగబోయే ఉప ఎన్నికల్లో తమకు అవకాశమివ్వాలని కోరుతూ పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌కు శనివారం రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ కార్యదర్శి గొట్టిముక్కుల రమాకాంత్‌రెడ్డి, తమిళనాడు యూత్‌కాంగ్రెస్ ఇన్‌చార్జి తక్కళ్లపల్లి సాగరికరావు దంపతులు వినతిపత్రం సమర్పించారు. కాజీపేట ఫాతిమానగర్ జంక్షన్‌లో నగరానికి వచ్చిన పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ గౌడ్‌కు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు శనివారం రమాకాంత్‌రెడ్డి దంపతులు బాణాసంచా కాల్చి, ఘనంగా స్వాగతం పలికి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం రమాకాంత్‌రెడ్డి దంపతులు పీసీసీ చీఫ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్ నాయక్,అభినవ్, లక్ష్మణ్ నాయక్, లింగమూర్తి, ప్రశాంత్, రమేశ్, రవి, నరేశ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో పీసీసీ చీఫ్‌కు ఘనస్వాగతం..

మడికొండ: పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు శనివారం మడికొండ చౌరస్తా వద్ద వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట 46, 64 వ డివిజన్ అధ్యక్షులు వస్కుల నాగరాజు, కుర్లమోహన్, నాయకులు భైరి లింగమూర్తి, వస్కుల శంకర్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘు చందర్, బిల్లా రవీందర్, వస్కుల శ్రీనివాస్‌లు ఉన్నారు.



మహేశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న రమాకాంత్ రెడ్డి

ముదిరాజ్ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ

న్యూశాయంపేట, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న నిర్వహించే తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలు, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు శనివారం హంటర్‌రోడ్‌లోని ముదిరాజ్ మహాసభ కార్యాలయంలో ఆవిష్కరించారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బయ్యస్వామి, పులి రజనీకాంత్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ హాజరై మాట్లాడారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ఆదేశాల మేరకు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్‌లు మన డిమాండ్‌లను ప్రభుత్వానికి తెలియజేసేవిధంగా ఈనెల 21న ప్రతీ గ్రామంలో, పట్టణంలో జిల్లా కేంద్రంలో ముదిరాజ్ జెండాలు ఎగురవేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు బండి సారంగపాణి, జోరుక సదయ్య, నీల గట్టయ్య, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్లు బుస్సా మల్లేశం, చొప్పరి సోమయ్య శానబోయిన రాజ్‌కుమార్, పులి ప్రభాకర్‌తోపాటు పెద్ద సంఖ్యలో ముదిరాజ్ మహాసభ నాయకులు, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల హక్కులను కాపాడుదాం

అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్‌పర్సన్ అనితారెడ్డి



చిన్నారులతో అనితారెడ్డి, ఇతర అధ్యాపకులు

కేయూ క్యాంపస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అందరూ బాలల హక్కులకు రక్షణగా నిలిచి, చిన్నారులను కాపాడుకోవాలని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కారుకాల అనితారెడ్డి అన్నారు. శనివారం కేయూ వద్ద గల సాయి బోధివృక్ష స్కూల్‌లో బాల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని స్టాండ్ ఫర్ చైల్డ్ రైట్స్ - నో చైల్డ్ లెఫ్ట్ బిహైండ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో ఆడి, పాడి వారిని ఉత్సాహపరిచారు. బాలల హక్కులను కాపాడటం మనందరి బాధ్యత అని ఉద్బోధించారు. పిల్లలకు నాణ్యతలో కూడిన విద్య అందించాలని, ఆరోగ్య సౌకర్యాలను కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో నిర్వహకు రాలు మానస, టీచర్స్, పిల్లలు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత: సీఐ

వరంగల్ చౌరస్తా: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఇంతెజార్‌గంజ్ సీఐ ఎంఏ.షుకూర్ అన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫోరం వరంగల్ వారు నిర్వహిస్తున్న బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని సేవా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్లను శనివారం ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బాలల హక్కుల రక్షణ కోసం సేవా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి అయిత ఉషాభాస్కర్, అధ్యక్షుడు కుమ్మరి బాబూరాజ్, ఉపాధ్యక్షుడు గండి ఆనందం, సభ్యులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి అభివృద్ధికి సహకరించండి

- మంత్రి పొన్నంను కోరిన కాంగ్రెస్ నాయకులు

హసన్‌పర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి అభివృద్ధికి సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను హసన్‌పర్తి కాంగ్రెస్ నాయకులు కోరారు. శనివారం కరీంనగర్ నుంచి హనుమకొండకు వెళ్తున్న మంత్రికి హసన్‌పర్తి ప్రధానరహదారిపై కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ పాలనలో హసన్‌పర్తి వెనకబాటుకు గురైందన్నారు. హసన్‌పర్తి ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్, డివైడర్లు లేక యువత ప్రమాదాలకు గురవుతున్నారని, తక్షణమే డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనుల మంజూరికి నిధులు కేటాయించే విధంగా చూడాలని కోరారు.

మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, 66వ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మెన్ తంగెళ్లపల్లి తిరుపతి, డైరెక్టర్ పల్లె దయాకర్, మాజీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, ఆరెల్లి వెంకటస్వామి, మాజీ జడ్పీటీసీలు విజయమూరి వెంకటేశ్వర్లు, పోతరాజు ప్రభాకర్, తాళ్ల మధు, కొండమీది సంతోష్, రవి, మహిళా నాయకురాలు, బుల్లెమ్మ, గంగాధర్ తదితరులు ఉన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శాలువా కప్పి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

24 నుంచి 26 వరకు బొడ్రాయి ఉత్సవాలు



బొడ్రాయి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఖిలావరంగల్ ప్రజలు

ఖిలావరంగల్, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): బొడ్రాయి ఏర్పాటు చేసి ఐదేళ్లు గడుస్తున్న సందర్భంగా ఖిలావరంగల్‌లో ఈ నెల 24, 25, 26 తేదీలలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం ఖిలావరంగల్ బొడ్రాయి వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వాహకులు మాట్లాడుతూ అన్నికులాల వారు బొడ్రాయి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఇందుకోసం 24న ఆదివారం ఉదయం గోపూజ, గణపతి పూజ, 25న సోమవారం స్థాపిత దేవతా పూజలు జరిపిన అనంతరం సాయంత్రం ప్రతీ ఇంటి నుంచి బిందెడు నీళ్లతో బొడ్రాయికి జలాభిషేకం చేస్తామన్నారు. 26న, మంగళవారం గ్రామదేవతకు అలంకరణ, మహానైవేద్యం మధ్యాహ్నం మహా అన్నదానం చేస్తామన్నారు. ఖిలావరంగల్‌లోని అన్ని కులాల ప్రజలు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో ఖిలావరంగల్‌లోని అన్ని కులాల పెద్దలు పాల్గొన్నారు.

నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా సదానందచారి



వడ్డెపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా ప్రముఖ రంగస్థల నటుడు, వరంగల్‌కు చెందిన మారెడోజు సదానందచారి నియమితులయ్యారు. తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం ఆదేశం మేరకు రాష్ట్ర ప్రధాన క్యాదర్శి సాదు శ్యాంప్రసాద్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నాటక సమాజాలను ప్రభుత్వం ప్రోత్సహించాలని సదానందచారి కోరారు.

మునిసిపల్ కార్మికులకు పీపీఈ కిట్లు అందించాలి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు మూడేళ్లుగా పీపీఈ కిట్లు ఇవ్వడం లేదని, దీంతో మహిళా, పురుష కార్మికులు రోగాల బారిన పడుతున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండలోని జిల్లా పార్టీ కార్యాలయంలో తిరుపతి మాట్లాడారు. శానిటేషన్ కార్మికులకు ఆర్నెళ్లకోసారి అందించే కొబ్బరి నూనె, గ్లౌజులు, మాస్కులు, చెప్పులు, టవల్స్, యూనిఫామ్, ఆప్రాన్స్, షూస్‌ను సిబ్బందికి ఇవ్వకుండా అధికారులు అందుకు సంబంధించిన బడ్జెట్‌ను అడ్డదారిలో నొక్కేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల కొందరికి తూతూమంత్రంగా ఆప్రాన్స్ ఇచ్చినా అవి నాణ్యతాలోపంతో ఉండడంవల్ల త్వరగా చిరిగిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా శానిటేషన్ విభాగం ఉన్నతాధికారులు కార్మికులకు అందించవలసిన పీపీఈ కిట్లను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. లేదా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఐఎఫ్ఐ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్‌కు అభినందన

మట్టెవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ కులగణన చేస్తున్న ఎన్యూమరేటర్‌ను వరంగల్ పిన్నవారి వీధికి చెందిన స్థానికులు, వ్యాపారవేత్త గుండా అమర్‌నాథ్ అభినందించారు. శనివారం వరంగల్ పిన్నవారి వీధికి చెందిన గుండా అమర్‌నాథ్ గుప్తా ఇంటికి వివరాలు సేకరించడానికి వచ్చిన అధికారి శ్రీలతను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

బ్యాటరీ దొంగలను పట్టుకున్న పోలీసులు

గీసుగొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆటో టైర్లు, బ్యాటరీలు, డెక్కులు, ట్రాక్టర్‌లోని డీజిల్‌ను దొంగిలిస్తున్న వారిని గీసుగొండ పోలీసులు శనివారం పట్టుకున్నారు. కొద్ది రోజుల క్రితం ఎలుకుర్తి గ్రామంలో గ్రామంలో చోరీలు జరుగుతున్న విషయాన్ని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ప్రత్యేక నిఘా పెట్టి అడెపు సాంబశివుడు, కాంపెల్లి రితిక్, రాగి నాగులును పట్టుకొని వస్తువులను రికవరీ చేసి వారిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ మహేందర్ తెలిపారు.

బలహీన వర్గాలకు స్థానం కల్పించింది ఎన్టీఆరే

వరంగల్ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాధికారంలో బలహీన వర్గాలకు స్థానం కల్పించిన ఘనత దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుకే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ అన్నారు. శనివారం వరంగల్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన రాజశ్రీ గార్డెన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1982లో టీడీపీని అధికారంలోకి తెచ్చే సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించారని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఉమ్మడి రాష్ట్ర సీఎంగా మహిళల కోసం డ్వాక్రా గ్రూపులు, దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు అందించారని గుర్తు చేశారు. సభ్యత్వ నమోదును ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, సంపత్, దేవేందర్, రాజు, సాంబయ్య, ప్రభాకర్, రవి, మొగిళి, వీరేశం తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు

ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలు పత్రికలు

కేయూ జర్నలిజం విభాగాధిపతి సంగాని మల్లేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న సంగాని మల్లేశ్వర్

కేయూ క్యాంపస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలుగా వార్త పత్రికలు నిలుస్తాయని కేయూ జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అన్నారు. శనివారం కేయూ జర్నలిజం విభాగంలో జాతీయ పత్రికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగాని మల్లేశ్వర్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఎప్పుడూ సమాజం బాగు కోసం పనిచేస్తారని అన్నారు. అవినీతి, అక్రమాలపై కథనాలు రాసే జర్నలిస్టులపై భౌతికదాడులకు దిగడం సరికాదన్నారు. ఈ సమావేశంలో కేయూ జర్నలిజం విభాగం అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, కంజర్ల నరసింహరాములు, డాక్టర్ వంగాల సుధాకర్, డాక్టర్ మోటె చిరంజీవి, సురేందర్, జర్నలిజం విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకాశవాణిలో విద్యార్థుల ప్రతిభ

కాశిబుగ్గ, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి వరంగల్ కేంద్రం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమంలో వివేకానంద కాలనీలోని బాలజ్యోతి పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమం లో విద్యార్థులు పాటలు, నాటికలు, పద్యాలు, ప్రసంగం, సంక్షిప్త కథలు వంటి అంశాల్లో సృజనాత్మకత ప్రదర్శించారు. చిన్నారిలోకం శీర్షికన ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం 9.30గంటలకు రేడియోలో ప్రసారం అవుతుందని పాఠశాల కరస్పాండెంట్ పొన్నోజు చక్రపాణి తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో దోహదపడుతాయని, స్టేజీ ఫియర్ పోతుందని అన్నారు.

పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలి

- డీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మంద రమేశ్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మంద రమేశ్

వడ్డెపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అణగారినవర్గాలకు ఉచిత విద్య, వైద్యంతోపాటు ఇళ్లు, భూమి, ఉపాధి అవకాశాలు కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు మంద రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత విద్య, వైద్యం, ఇళ్లు, భూమి, ఉపాధి అనే ఐదు గ్యారంటీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న జిల్లా కలెక్టర్‌కు, 19, 20 తేదీల్లో తహసీల్దార్లకు వినతిపత్రా లను అందజేయనున్నట్లు తెలిపారు. 25న జిల్లా కలెక్టరేట్, 27, 28 తేదీల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలను వివిధ రూపాల్లో తెలియజేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో డీఎస్‌పీ రాష్ట్ర, జిల్లా నాయకులు చుక్కా రత్నాకర్, షైదం రవి, కొట్టె ఏసోబు, సోమిడి నరేశ్, కొయ్యడ రాహుల్, ఎర్ర ప్రసాద్, కొత్తూరి జయపాల్, గట్టుమల్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ కరువై.. బతుకు బరువై..

- ఆధునికతతో మాయమైన దశాబ్దం నాటి వెలుగులు
- జీవన పోరాటం చేస్తున్న చిందు కళాకారులు
- ఆరునెలలు రంగుల ప్రపంచం.. ఆపైఉపాధి పోరాటం
- ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొంటున్న కుటుంబాలు
- అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్


నాటక ప్రదర్శన ఇస్తున్న కళాకారులు (ఫైల్)

నెక్కొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆడుతూ.. పాడుతూ.. నవ్విస్తూ.. ప్రేక్షకులను కనువిందు చేస్తూ.. చరిత్రను కళ్లకు కట్టినట్టు చూపుతారు చిందు కళాకారులు. ఒకప్పుడు కాలక్షేపంగా ప్రారంభమైన ఈ కళ.. రానురాను వారి వృత్తిగా మారింది. కానీ ఆ కళ నేటి అధునిక ప్రపంచంలో ప్రజాదరణ కరువై కళ తప్పుతోంది. చిందు కళాకారులు ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటూ జీవనపోరాటం చేస్తున్నారు. సినిమా ప్రపంచం అంతగా తెలియని రోజుల్లో ఎనలేని ప్రజాదరణ పొందిన చిందు కళలను నమ్ముకున్న కళాకారుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పాత తరం వారి తరహాలోనే ఇప్పుడూ ఆరునెలల పాటు అడపాదడపా ప్రదర్శనలిస్తున్నా వచ్చే సొమ్ములు రోజువారీ ఖర్చులకే సరిపోతున్నాయి. దీంతో మిగిలిన ఆరునెలలు బతుకు దెరువు కోసం కూలిపనులకు వెళుతున్నారు. ఇక వారి పిల్లలైతే అటు ఉన్నత చదవులకు దూరమవుతూ.. చిందు కళను కొనసాగించే పరిస్థితి కానరాక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దశాబ్ద కాలం క్రితం ఎక్కువగా దళిత కాలనీల్లో.. ప్రదర్శనలిచ్చిన చిందు కళాకారుల శ్రమను గుర్తించిన దళితులు వారిని ప్రోత్సహించడంతో వారిని ఆహ్లాదపర్చడమే లక్ష్యంగా చిందు కళాకారులు కూడా నాటక రంగానికి శ్రీకారం చుట్టారు. తొలిరోజుల్లో కాలక్షేపానికి ప్రదర్శనలు ఇచ్చిన చిందుకళాకారులు, రానురాను దీనినే వృత్తిగా ఎంచుకుని తమ కళకు పదును పెట్టారు.

మహా భారతం, రామాయణం, పాండవ వనవాసం, సతీ సావిత్రి, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణార్జునయుద్ధం, శివగంగ కల్యాణం, అల్లిరాణి, భసవపురాణం, మాడలిక చరిత్ర లాంటి అనేక పురాణ, ఇతిహాసాలను నిరక్షరాస్యులకు కూడా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించే వారు. ఈ ప్రదర్శన సమయంలో అప్పటి ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించిన చిందు కళాకారులు ఇతిహాసాలకు సంబంధించిన పరదాలను నాటకాల సమయంలో స్టేజీలకు వెనుక వైపున మార్చుతూ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేవారు. అయితే కొంత కాలం తరువాత చిందుకళాకారుల కళలకు ఆకర్షితులైన దళితులతో పాటు ఇతర కులాల ప్రజలు కూడా గ్రామాల్లో ప్రదర్శనలు ఇవ్వాల్సిందిగా కోరేవారు. ఇందుకోసం వారికి ఆర్థిక సాయం చేయడంతో ఆ రోజుల్లో చిందు కళలు ఎంతో ఆదరణ పొందాయి. కేవలం ఆరు నెలల పాటు ప్రదర్శనలిస్తే.. ఏడాదంతా వారి కుటుంబాలకు సాఫీగా జీవనం సాగించేవి.

మూడేళ్లకోసారి ప్రదర్శనలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నెక్కొండ, కేసముద్రం, గూడూరు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన దాదాపు 20 కుటుంబాలు చిందు కళా ప్రదర్శనలు ఇస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా వరంగల్, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో ప్రదర్శనలు ఇస్తుంటారు. వారంతా రోటేషన్ పద్ధతిన మూడు సంవత్సరాలకు ఒకసారి ఆయా జిల్లాలకు వెళ్లి ప్రదర్శనలు ఇవ్వడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. ప్రతీ సంవత్సరం జనవరి నుంచి జూన్ వరకు చిందుకళాప్రదర్శనలు ఇస్తుంటారు. ఇందుకుగాను ప్రదర్శనలు ఇచ్చిన దళిత కాలనీల్లో కులాల పాలుగా రూ.15వేల నుంచి రూ.20 వేలు ఇచ్చేవారు. ఇదే సమయంలో గ్రామస్థుల కోరిక మేరకు గ్రామాల్లో కూడా ప్రదర్శలు ఇవ్వడంతో ఆర్థికంగా గిట్టుబాటయ్యేది. కానీ, నేడు ఆదరణ తగ్గడంతో వారి జీవనోపాధికి గాను కేవలం దళిత కాలనీల్లోనే మొక్కుబడిగా ప్రదర్శనలు ఇస్తున్నారు.


నెక్కొండలో ప్రదర్శన ఇచ్చిన చిందుకళాకారుల బృందం(ఫైల్)


సండే స్పెషల్ SUNDAY SPECIAL

భారంగా ఆయుధాలు, పరదాల ఏర్పాటు

చిందుకళాకారులు వారి జీవనోపాధి కోసం ఇస్తున్న ప్రదర్శనలు వారిని ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నాటకాలకు సంబంధించిన ఆయుధాల బొమ్మల తయారీకి, కళాకారుల మేకప్, నాటకల ప్రదర్శన సమయంలో ప్రదర్శించే బొమ్మల పరదాలు, వాయిద్యాల ఏర్పాటు చిందుకళాకారులకు భారంగా మారుతున్నాయి. దీనికి తోడు రవాణా ఖర్చులు కూడా పెరగడంతో కళాకారులందరినీ అన్ని జిల్లాలకు తీసుకుపోవడం కష్టంగా మారింది.

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం

గడ్డం వెంకటనర్సు, కళాకారుల బృందం అధ్యక్షుడు



వంశపారంపర్యంగా వస్తున్న చిందుకళను నమ్ముకున్న మా కుంటుంబాలు ప్రదర్శనలు ఇచ్చినా, ఆదరించే వారు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. కొన్ని కుటుంబాలైతే పస్తులుండాల్సిన పరిస్థితి. ఏడాదిలో ఆరు నెలలు ప్రదర్శలు ఇవ్వగా వచ్చే ఆదాయం ఏ రోజుకారోజు పోషణకే సరిపోతుంది. మిగతా ఆరు నెలలు కూలీ పనులను వెతుకోకతప్పడంలేదు. ప్రదర్శనలను ఇవ్వడానికి ఊరూర తిరగడంతో మా పిల్లలు కూడా పెద్ద చదువులు చదువుకోలేదు. అటు ఉన్నతవిద్యకు దూరమై.. ఇటు ఆదరణకు నోచుకోక చిందు కళాకారుల పిల్లలు భవిష్యత్‌లో రాణించలేకపోతున్నారు.

ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గడ్డం మొగిళి, కళాకారుడు (మహిళా వేషధారణ)



ఆర్థిక ఇబ్బందుల కారణంగా మా పిల్లలు చిందుకళకు దూరంగా ఉంటున్నారు. దీంతో ఈ కళ మా తరం వారతోనే అంతరించిపోయే ప్రమాదం ఉంది. చిందు కళాకారులను ప్రభుత్వం గుర్తించి ఆర్థిక సాయం, ప్రోత్సాహాన్ని అందిస్తే కళ బతుకుతుంది. ఉపాధికోల్పోతున్న కులాలను గుర్తించి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు నిధులను మంజూరు చేస్తున్న తరహాలోనే చిందు కళాకారుల ఆర్థికాభివృద్ధికి ఓ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

దక్ష రెడ్డికి బాలకళారత్న అవార్డు



హనుమకొండ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రొండ్ల దక్ష రెడ్డికి పన్నెండవ కూచిపూడి ఒలింపియాడ్ -2024లో ప్రతిష్ఠాత్మక బాల కళారత్న అవార్డు లభించింది. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు గుంటూరులో జరిగిన ఈ కూచిపూడి ఒలంపియాడ్‌లో దక్ష రెడ్డి ఈ అవార్డుకు ఎంపియ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ విభాగాల సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. ఈపోటీల్లో సీనియర్ విభాగంలో హనుమకొండలోని కనకదుర్గ కాలనీకి చెందిన దీక్ష రెడ్డి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. అలాగే హనుమకొండకు చెందిన శరణ్య, ప్రియ, సబ్ జూనియర్స్ నుంచి వేదాంశి తమ అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. బహుమతులు సాధించారు. దక్షరెడ్డిని ప్రతిభకు గుర్తింపుగా బాలకళారత్న అవార్డుతో సత్కరించారు. శరణ్య, ప్రియ, వేదంశిలు కూడా ప్రథమ బహుమతులను, అవార్డులను అందుకున్నారు. ప్రముఖ కూచిపూడి నృత్యగురువు బొంపెల్లి సుదీర్‌రావు శిష్యరికంలో వీరంతా ఈ అవార్డులను సాధించారు.

సుమతిరెడ్డిలో అవిజ్ఞాన్ 3.0 పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి

హసన్‌పర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిఏటా ట్రిపుల్‌ఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించే నేషనల్ లెవల్ టెక్నో కల్చర్ ప్రోగ్రాం అబిజ్ఞాన్ 3.0 వాల్ పోస్టర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి శనివారం ప్రోగ్రాం కోఆర్డినేటర్, స్టూడెంట్ బ్రాంచి అడ్వైజర్ మూల రాముతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకే ప్రతీ సంవత్సరం ట్రిపుల్‌ఈ స్టూడెంట్ బ్రాంచి ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ కె.మహెందర్, ఏవో వేణుగోపాలస్వామితో పాటు విద్యార్థి కోఆర్డినేటర్లు వనపర్తి సహస్ర, వస్త్రాల నందిని, వర్షిత, సౌమిక, సద, స్నేహ, శ్రీజ, చితుర్వ, కమలాక్షిత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతంటే ప్రాణం



మహబూబాబాద్‌లో వనజీవి రామయ్యతో కలిసి మొక్క నాటుతున్న దైద వెంకన్న (ఫైల్)

- పర్యావరణ పరిరక్షణలో దైద వెంకన్న
- చిన్నతనం నుంచే పలు కార్యక్రమాలు
- 'ఫోన్ కొట్టు.. మొక్క పట్టు'తో ప్రత్యేకత
- పదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 16లక్షల మొక్కల పంపిణీ

• ఆదర్శం

మహబూబాబాద్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మొక్కలంటే ఆయనకు అమిత ప్రేమ... ఖాళీ జాగ కన్పిస్తే చాలు మొక్కలు నాటడం.. వాటిని పరిరక్షించడం అలవాటుగా మార్చుకున్నారు. అలా స్వయంగా నాటి, బతికించిన మొక్కలెన్నో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఒక్క మానుకోటలోనే కాదు..రాష్ట్ర వ్యాప్తంగా ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, హైదరాబాద్, పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంగనర్ జిల్లాల్లో పర్యావరణ పరిరక్షణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే పదేళ్లలో సుమారు 16లక్షల మొక్కలను పంపిణీ చేసి ప్రకృతి తపస్విగా, వన ప్రేమికుడుగా గుర్తింపు పొందాడు మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన దైదవెంకన్న. ప్రజా హృదయం స్వచ్ఛంధ సేవా సంస్థను స్థాపించి ఓ వైపు సామాజిక సేవ చేస్తూనే మరో వైపు పర్యావరణ పరిరక్షణపై దృష్టిసారించారు. మునిసిపల్ జీవ వైవిధ్య కమిటీ సభ్యులుగా తనవంతు కృషి చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని వేమూనూరు శివారు ఉత్తర తండాను దత్తత తీసుకుని అక్కడ ఐదు వేల మొక్కలు నాటారు. 2018లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా హరితమిత్ర అవార్డుతో మరి కొన్ని అవార్డులు సొంతం చేసుకున్నారు. 2020 సంవత్సరంలో గవర్నర్ రంగ రాజన్, అటవీ శాఖ మంత్రి జోగు రామన్న చేతుల మీదుగా దైద వెంకన్న ఆ అవార్డును అందుకున్నారు.

గురువుల స్ఫూర్తితో చిన్నతనం నుంచే..

మహబూబాబాద్ పట్టణానికి చెందిన దైద వెంకన్న ఇందిరానగర్ పాఠశాలలో చదివారు. 1985లో తాను చదువుకునే రోజుల్లో ఆయన గురువులు కృష్ణమూర్తి,షబ్బీర్ విద్యార్థులు మొక్కలు నాటాలని సూచిస్తూ ప్రతీవిద్యార్థికి ఐదు మొక్కలను పంపిణీ చేశా రు. ఆ సమయంలో వెంకన్న నాలుగు జామాయిలు, ఒక చింతచెట్టును నాటి వాటిని సంరక్షించి పెద్దవి చేశాడు. ఇటీవలే తానుపెంచిన చెట్లకు వందనం చేస్తూ నాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అలా పర్యావరణ పరిరక్షణపై ఆసక్తి పెంచుకున్న వెంకన్న విద్యార్థులు, ప్రముఖుల జన్మదినోత్సవం, వివాహాది శుభకార్యాలకు మొక్కను బహూకరించి నాటిస్తారు. ఆరేళ్లుగా రాఖీ పౌర్ణమి పర్వదినాన వృక్షాబంధన్‌ను నిర్వహించి మొక్కలకు రాఖీలు కట్టిస్తారు.


'ఫోన్ కొట్టు మొక్క పట్టు'తో ఇళ్ల వద్దకే మొక్కలు..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014 నుంచి వెంకన్న మొక్కవోని దీక్షతో పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నారు. ఎవరైనా మొక్కలు కావాలని ఫోన్ చేస్తే ఎంత దూరమైనా సొంత ఖర్చులతో తన ఆటోలో మొక్కలను తీసుకెళ్లి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇందుకోసం తన ఇంటివద్ద అన్ని రకాల మొక్కలను అందుబాటులో పెట్టుకుంటున్నారు. ఆయనే కాదు.. కుటుంబ సభ్యులు కూడా మొక్కలను నాటడడంలో భాగస్వాములవుతారు. 2016, 17 సంవత్సరాల్లో ఉదయాన్నే లేచి మహబూబాబాద్ పట్టణంలో 180 రోజుల పాటు డప్పుచాటింపు ద్వారా మొక్కల పెంపకం.. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ మొక్కలు పంపిణీ చేశారు. ఇటీవల రాష్ట్ర స్థాయి వన ప్రేమికులను మానుకోటకు ఆహ్వానించి సదస్సును ఏర్పాటు చేసి వారి సేవలను శ్లాఘిస్తూ అవార్డులను అందించారు.



2014లో ప్రధాని స్వచ్ఛ భారత్ పిలుపుతో...

ప్రధాని నరేంద్రమోదీ 2014లో స్వచ్ఛభారత్ పిలుపుతో మహబూబాబాద్ పట్టణంలో వన ప్రేమికుడు దైద వెంకన్న 45 రోజుల పాటు పారిశుధ్య నిర్వహణలో భాగస్వాములై కరపత్రాల ద్వారా చైతన్యం నింపారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. 2018లో మన్‌కి బాత్‌లో భాగంగా మట్టితో ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల మన్‌కి బాత్ కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరిట లక్ష మొక్కలు నాటాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఈక్రమంలో పట్టణంలోని నర్సింగ్ కళాశాలలో ఒక్క రోజే విద్యార్థులతో వంద మొక్కలు నాటించారు. మానసిక దివ్యాంగులతో కూడా మొక్కలు నాటించారు. హరిత తెలంగాణే లక్ష్యంగా తీసుకువచ్చిన హరితహారంలో తన వంతు బాధ్యతగా వేలాది మొక్కలు నాటుతూ ఇతరులకు మొక్కలను పంపిణీ చేస్తూ దైద వెంకన్న అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.




ఫొటోలు 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

ప్రకృతి గీసిన ముఖచిత్రం

భద్రకాళి గుట్టపై ఆవిష్కృతం

సూర్యోదయ సమయాన.. పసిడి వర్ణంలో ఉదయించిన భానుడి లేలేత కిరణాలు మంచుతెరలను చీల్చుతూ.. ఆకాశమే హద్దుగా నిలిచిన ఆ రాతి గుట్టలను తాకిన వేళ... మనిషి ముఖాన్ని పోలిన ఆకారం ఆవిష్కృతమైంది. పర్యావరణ ప్రేమికులను అమితంగా ఆకట్టుకున్న ప్రకృతి గీసిన ఈ 'ముఖ'చిత్రం శనివారం తెల్లవారుజామున వరంగల్ భద్రకాళి దేవస్థాన ప్రాంగణంలోని భద్రమ్మ గుట్టలపై కనిపించింది. తిరుమల కొండలపై వేంకటేశుని రూపం మాదిరిగానే ఇక్కడ ముఖరూపం కనిపిస్తోంది.

19న ప్రజాపాలన విజయోత్సవ సభ

- హనుమకొండలో లక్షకుపైగా మహిళలతో నిర్వహణ
- మీడియా సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
- సభ నిర్వహణపై ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశం
- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాట్ల పరిశీలన


ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

హనుమకొండ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వ ఏడాది ప్రజాపాలన సందర్భాన్ని పురస్కరించుకొని ఈనెల 19న హనుమకొండలో విజయోత్సవ సభను నిర్వహించనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే విజయోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలనకు గాను ఆయన శనివారం హనుమకొండ వచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ప్రజాపాలన విజయోత్సవ సభ విజయవంతానికి ప్రతీ ఒక్కరు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఒక్కో నియోజకవర్గం వారిగా సభకు తరలించే బాధ్యతలను ఎమ్మెల్యేలు చూసుకోవాలన్నారు. ఆ మేరకు బాధ్యతల విభజన జరగాలని దిశా నిర్దేశం చేశారు. ప్రజాపాలన విజయోత్సవ సభ చరిత్రలో నిలిచేలా ఉండాలని లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఒక్కో నియోజకవర్గం వారిగా ప్రధాన సమస్యలు, ఆ సభలో ముఖ్యమంత్రి ద్వారా వెల్లడింపచేసే అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపుల వివరాలను కూడా మహేశ్‌కుమార్‌గౌడ్ చర్చించారు. వరంగల్ నగరంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, కాళోజీ కళాక్షేత్రం, నయీంనగర్ బ్రిడ్జి ప్రారంభం ఇతర పనుల వివరాలను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. 19న లక్షకుపైగా మహిళలతో నిర్వహించబోయే సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని, ఏడాదిలో కాంగ్రెస్ సర్కారు చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల వివరాలతో పాటు భవిష్యత్‌లో చేపట్టబోయే చర్యలను వెల్లడిస్తామన్నారు. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీఆర్ఎస్ మాయం కానుందని, ప్రజలు ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కల్పిస్తే దానిని అగౌరవపరిచారని, కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పరిమితం కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టే యత్నం చేస్తున్నారని, సోషల్ మీడియాతో నిజాలను వక్రీకరిస్తూ ప్రజలను నమ్మించే కుట్రలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మతం పేరిట అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని, ఆ పార్టీ శ్రమ ఎప్పటికీ వృథాయే అవుతుందన్నారు. హైదరాబాద్ భవిష్యత్ కోసం మూసీ ప్రక్షాళన చేస్తుంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకునే చర్యలకు పాల్పడుతున్నారని, బీజేపీ మూసీ నిద్రతో ఒరిగేదేమీ లేదని మండిపడ్డారు. నిరుపేదల జీవన, ఆర్థిక ప్రగతి కోసమే రాష్ట్రంలో కుల సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. పార్టీలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని కొట్టి పారేశారు.

సభా మైదానం పరిశీలన

నేతలు, విలేకరులతో సమావేశం అనంతరం మహేశ్ కుమార్‌గౌడ్ సభ నిర్వహించనున్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. వేదిక ఏర్పాటు, గ్యాలరీలు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, పార్కింగ్ తదితర అంశాలను చర్చించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద తదితర అధికారులతో ఏర్పాట్లు, బందోబస్తు గురించి చర్చించారు. సభ వాస్తు ప్రకారంగా జరిగేలా ఏర్పాట్లు ఉండాలనే అభిప్రాయాలను నేతలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఎంపీలు బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మురళీనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఈవీ శ్రీనివాస్‌తో పాటు ఉమ్మడి వరంగల్‌లోని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.


ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సభ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, మంత్రులు

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సమావేశమైన పీసీసీ చీఫ్

ఆర్ట్స్ కళాశాల మైదానం పరిశీలన అనంతరం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మరోసారి మంత్రులు, కొందరు ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులతో కలిసి ఒక్కో ఎమ్మెల్యేతో విడివిడిగా సభ నిర్వహణ అంశాలను చర్చించారు. నియోజకవర్గం వారీగా సభకు తరలించేందుకు జనం, వాహనాల సమీకరణ, సభ నిర్వహణలో నిర్వర్తించాల్సిన బాధ్యతలు, తదితరఅంశాలపై చర్చించారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మురళీనాయక్, రాంచంద్రునాయక్‌తో పాటు పలువురు ముఖ్య నేతలతో టీపీసీసీ అధ్యక్షుడు వేర్వేరుగా భేటీ అయ్యారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలి

- సదస్సులు, సంగోష్ఠులతోనే అవకాశం
- నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధీ
- నిట్‌లో ప్రారంభమైన రెండు రోజుల సింపోజియం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధీ

హనుమకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణల పట్ల పూర్తిస్థాయి అవగాహనను పెంచుకోవడానికి సదస్సులు, సంగోష్ఠులు, వర్క్‌షాపులు ఎంతో దోహదపడతాయని వరంగల్ నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధీ అన్నారు. శనివారం వరంగల్ నిట్, ఇండియన్ నేషనల్ అకాడెమీ ఆఫ్ ఇంజనీరింగ్ (ఐఎన్ఏఈ) ఆధ్వర్యంలో 18వ నేషనల్ ఫ్రాంటియర్స్ ఆఫ్ ఇంజనీరింగ్ సింపోజియం జరిగింది. నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ప్రారంభమైన ఈ రెండు రోజుల సంగోష్ఠిని డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, ఐఎన్ఏఈ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ శివాజీ చక్రవర్తి, ఎన్ఐటీ వరంగల్ డీన్ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్)) ప్రొఫెసర్ శిరీష్ సోనావానే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సుబుధీ మాట్లాడుతూ.. నూతన సాంకేతిక ప్రక్రియల సమాచారం ఆదానం ప్రదానం జరిగినప్పుడే రాణించడానికి వీలుకలుగుతుందన్నారు. నిట్‌లో నిర్వహిస్తున్న ఈ సింపోజియం తాజా పరిశోధనలను పంచుకునేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. రెండు రోజు ఈ సదస్సులో సంకలిత తయారీ, ఆటోమేషన్, స్మార్ట్ గ్రిడ్, పవర్ ఎలక్ట్రానిక్ కన్వర్టర్లు, కంట్రోల్ అండ్ ప్రొటెక్షన్, గ్రీన్ హైడ్రోజన్, స్టోరేజీ టెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, మెషిన్ అనే నాలుగు థీమ్‌లలో ప్లీనరీ, కీనోట్ సెషన్లను నిర్వహిస్తారు. ఐఎన్ఏఈ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ శివాజీ చక్రవర్తి ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్ పరిశోధనా రంగంలో సాగిస్తున్న కృషి, సాధించిన విజయాల గురించి వివరించారు. ప్రొఫెసర్ ఇంద్రనీల్ మన్నా వర్చువల్‌గా తన సందేశాన్ని పంపారు. డీన్ ఆర్ అండ్ డీన్ ప్రొఫెసర్ శిరీష్ సోనవానే సింపోజియంవల్ల వినూత్న ఆవిష్కరణల ఆకళింపునకు వీలు కలుగుతుందన్నారు. వివిధ ఇంజనీరింగ్ సంస్థలకు చెందిన 70 మంది అధ్యాపకులు పరిశోధకులు ఈ సంగోష్ఠికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 28 పోస్టర్లను, తయారీ పద్ధతుల్లో ఆవిష్కరణలు ప్రదర్శిస్తారు. ఉత్తమ ఆవిష్కరణలకు రూ.40వేలు, రూ.20వేలు నగదు బహుమతులన అందచేస్తారు.

జుట్టు నెరుస్తోందా!

చిన్న వయసులోనే జుట్టు నెరవడం సర్వ సాధారణమవుతోంది. దీనికి జన్యుపరమైన కారణాలున్నప్పటికీ వాతావరణ కాలుష్యం, పోషకాహార లోపం, నిద్రలేమి వల్ల కూడా జుట్టు సహజత్వాన్ని కోల్పోయి రంగు మారుతోంది. రసాయనాలతో పని లేకుండా ఇంటి వద్ద లభించే వాటితోనే జుట్టుని నల్లగా మార్చుకొనే చిట్కాల గురించి తెలుసుకుందాం!

- **తేయాకు:** ఇందులో అధిక మొత్తంలో టానిన్లు ఉంటాయి. ఇవి వెంట్రుకలను సహజ రీతిలో నల్లబరుస్తాయి. ఒక బౌల్‌లో రెండు గ్లాస్‌ల నీళ్లు, రెండు చెంచాల టీ పొడి వేసి బాగా మరిగించండి. ఈ తేనీటిని చల్లార్చి ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తల మొత్తం వెంట్రుకలకు పట్టేలా స్ప్రే చేయండి. ఇలా తరచూ చేస్తూ ఉంటే వెంట్రుకలు క్రమంగా నలుపు రంగులోకి మారతాయి.



- **రోజ్‌మేరీ:** ఇందులో రక్త ప్రసరణను మెరుగు పరిచే లక్షణాలు ఉన్నాయి. ఒక గిన్నెలో మూడు చెంచాల రోజ్‌మేరీ ఆయిల్ వేసి దానికి రెండు చెంచాల కొబ్బరి నూనె లేదా జోజోబా ఆయిల్ లేదా ఆముదం కలపాలి. ఆ మిశ్రమాన్ని మాడు మీద, తల చుట్టూరా రాసి వెంట్రుకల కుదుళ్లకు చేరేలా వేళ్లతో మర్దన చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే వెంట్రుకల కుదుళ్లు బలంగా మారి నలుపు రంగుని ఉత్పత్తి చేస్తాయి.

- **ఉసిరి:** తెల్ల జుట్టుని నల్లగా మార్చడంలో ఉసిరిని మించిన ఔషధం లేదు. ఇందులో ఇరన్ ఎక్కువగా ఉంటుంది. ఉసిరిని ఆహారంలో చేర్చుకున్నా సౌందర్య సాధనంగా వాడినా మంచి ఫలితాలు వస్తాయి. నాలుగు చెంచాల ఉసిరి పొడికి తగినంత కొబ్బరి నూనె కలిపి పేస్టులా చేయాలి. దీనిని తలంతా పట్టించి వెంట్రుకల కుదుళ్లకు చేరేలా మర్దన చేయాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే వెంట్రుకలకు మంచి పోషణ అంది నల్లగా మారతాయి. ఇది చిన్న పిల్లల్లో కనిపించే బాల నెరుపుకు అద్భుతంగా పనిచేస్తుంది.

- **హెన్నా:** ఇది మంచి ఆయుర్వేద ఔషధం. తలలో వేడిని తగ్గిస్తుంది. వెంట్రుకలకు అందమైన రంగునిస్తుంది. ఒక బౌల్‌లో అయిదు చెంచాల గోరింటాకు పొడి, తగినంత టీ డికాషన్, రెండు చుక్కల కొబ్బరినూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వెంట్రుకలకు కుదుళ్ల నుంచి చివరి దాకా పట్టించాలి. ఇరవై నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. షాంపూ లేదా కుంకుళ్లు ఉపయోగించకూడదు. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే క్రమంగా తెల్ల వెంట్రుకలు రంగు మారతాయి.



- **మందారం:** నిర్జీవంగా ఉండి చిక్కులు పడే వెంట్రుకలకు పోషణని, మృదుత్వాన్ని, మెరుపుని ఇస్తుంది మందారం. గుప్పెడు కుంకుడు కాయలను కొన్ని మందారం ఆకులతో కలిపి రుబ్బి ఆ మిశ్రమంతో తలస్నానం చేస్తూ ఉంటే వెంట్రుకలు నల్లగా ఒత్తుగా పెరుగుతాయి. ఒక కప్పు కొబ్బరి నూనె లేదంటే ఆముదంలో అయిదు మందారం పూలు వేసి బాగా కాచి వడకట్టాలి. ఈ నూనెని చల్లార్చి గాజు సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ రాత్రి పడుకొనే ముందు కొంచెం నూనెను తీసుకొని తల వెంట్రుకలకు పట్టించాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. క్రమంగా తెల్లజుట్టు నల్లగా మారుతుంది.

సండే సెలబ్రిటీ

మనకున్న అచ్చమైన తెలుగు దర్శకులు అతి కొద్ది మందే! వారిలో ఇంద్రగంటి మోహనకృష్ణ ఒకరు. 'అష్టాచెమ్మా', 'సమ్మోహనం', 'వి' లాంటి హిట్ చిత్రాలకు మోహనకృష్ణ దర్శకత్వం వహించారు. ఆయన రూపొందించిన 'సారంగపాణి జాతకం' సినిమా త్వరలో విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.



దైవాంశసంభూతుడు

చాలాకాలం తర్వాత మళ్లీ హాస్య సినిమాతో ముందుకు వస్తున్నారు... కారణమేమిటి?

నా దృష్టిలో పూర్తి హాస్యం పండించే సినిమాను తీయటం చాలా కష్టం. చాలామంది హాస్యం పండించటం సులభమనుకుంటారు. కానీ కమల్‌హాసన్‌గారు అన్నట్లు- 'కామెడీ ఈజ్ సీరియస్ బిజినెస్'. నేను నా కెరీర్‌లో మొత్తం 12 సినిమాలు చేశాను. దానిలో 'అష్టాచెమ్మా' 'అమీతుమీ... ఈ రెండూ పూర్తి హాస్య రస ప్రధానమైనవి. ఇవి తీసి చాలాకాలం అయిపోయింది కాబట్టి- ఏదైనా ఒక హాస్యరస ప్రధాన సినిమా తీయాలని అనుకున్నా. 'సారంగపాణి జాతకం' కథ ఎంతోకాలంగా నా మనస్సులో నలుగుతోంది. ఈ మధ్య నేను దర్శకత్వం వహించిన 'ఆ అమ్మాయి గురించి చెప్పాలి' అనేది సీరియస్ డ్రామా. అది పెద్దగా ఆడలేదు. ఆ తర్వాత ఏం చేయాలని ఆలోచిస్తున్నప్పుడు ఈ కథ బయటకు వచ్చింది. దీనితో పాటు- 'శ్రీదేవి మూవీస్' కృష్ణప్రసాద్ గారు కూడా- "మనం 'సమ్మోహనం' తర్వాత కలిసి పని చేయలేదు. ఏదైనా చేద్దాం" అని కొద్ది కాలంగా అంటున్నారు. 'సారంగపాణి జాతకం' కథ చెబితే ఆయనకు వెంటనే నచ్చేసింది. ఇలా ఈ సినిమా మొదలైంది.

ఈ మధ్యకాలంలో పూర్తి హాస్యరస ప్రధాన సినిమాలు రావటం లేదు.. కారణమేమిటి?

ఒకప్పుడు హాస్యరస ప్రధాన సినిమాలను ప్రేక్షకులు ఎక్కువగా ఆదరించేవారు. జంధ్యాల, రేలంగి నరసింహారావు, ఈవీవీ సత్యనారాయణ- ఇలా అనేకమందికి హాస్య దర్శకులుగా ముద్ర ఉండేది. కానీ క్రమేణ యాక్షన్ సినిమాల జోరు పెరిగింది. థియేటర్‌కు వెళ్లి సినిమా చూడాలంటే అది రూ. 500 కోట్ల సినిమా అయి ఉండాలని కూడా కొందరు ప్రేక్షకులు భావిస్తున్నారు. దీనితో హాస్య సినిమాల సంఖ్య తగ్గుతూ వచ్చింది. అయితే మరో వైపు మన జీవితాల్లో హాస్యం తగ్గిపోలేదు. రీల్స్, మీమ్స్, ట్రోల్స్‌ను కోట్ల మంది చూస్తున్నారు. ఆస్వాదిస్తున్నారు. అంటే ప్రేక్షకుల జీవితాల్లో హాస్యానికి ప్రాధాన్యత ఉన్నట్లే కదా!

నేటితరం ప్రేక్షకులకు నిజమైన హాస్యం తెలియదా?

ఈ ప్రశ్నకు అనేక కోణాలున్నాయి. ఒకప్పుడు సాహితీ పోకడలున్న హాస్యాన్ని ఆస్వాదించేవారు. ముళ్లపూడి, జంధ్యాల లాంటి వారి సినిమాలు అందుకే హిట్ అయ్యాయి. వీరు మన జీవితంలోని అనేక అసందర్భాలను తీసుకొని.. వాటిని హాస్యంగా మలచేవారు. ఊరి పేర్లను చదివే ఒక వ్యక్తి, నడకంటే ఇష్టమున్న వ్యక్తి, వంట రాకపోయినా వంట చేసి ఇబ్బంది పెట్టే గృహిణి... ఇలాంటి పాత్రలెన్నో అప్పుడు వచ్చేవి. తరం మారింది. ఇప్పటి తరం వారిలో తెలుగు సాహిత్యాన్ని చదివేవారు అతి తక్కువ మంది. వారిలో కూడా పాపులర్ సాహిత్యం అంటే యండమూరి, మల్లాది, యద్దనపూడి లాంటి వారే ఎక్కువ మందికి తెలుసు. మునిమాణిక్యం రచనల లాంటి గత వైభవాలు వారికి తెలియదు. ఉదాహరణకు ఒక చోట జంధ్యాల- 'పాండవుల సంపాదనంతా కౌరవుల తద్దినాలకే సరిపోయిందన్నట్లు' అని రాస్తారు. ఇలాంటి హాస్యం ఈ తరంలో వారికి ఎలా అర్థమవుతుంది? వీరికి తెలిసింది- రిఫరెన్స్ హ్యూమర్. అంటే ఏదో ఒక జోకు తీసుకొని, దానిమీద ఒక రీల్ చేయటం. ఒక పాపులర్ సీన్‌ను తీసుకొని స్పూఫ్ చేయటం. హాస్యరసభరిత సినిమాలు రాకపోవటానికి ఇది ఒక కారణం. ఇది కేవలం తెలుగులోనే కాదు. బాలీవుడ్‌లో కూడా పూర్తిగా హాస్యభరిత సినిమాలు రావటం లేదు.

మంచి కథలను అందించే రచయితలు లేరనే వాదన వినిపిస్తూ ఉంటుంది...

పూర్తిగా కనుమరుగయ్యారంటే ఒప్పుకోను. హాస్యరస ప్రధానంగా తీయగలిగిన వారు అతి కొద్దిమంది మాత్రమే ఉన్నారు. చాలామంది దర్శకులు సినిమాలో కొన్ని సన్నివేశాల్లో హాస్యాన్ని పెట్టి పండించగలుగుతున్నారు. ఈ మధ్యకాలంలో 'సామజవరగమన', 'మిడిల్ క్లాస్ మెలొడీస్' లాంటి సినిమాల్లో మంచి హాస్యమే ఉంది. అయితే హాస్యం- ఒక పెద్ద సినిమాలో చిన్న ప్లాట్‌గా మారిపోయింది. హాస్యం మాత్రమే కాదు. రొమాన్స్ పాటలు కూడా తగ్గిపోయాయి. ఎటు చూసినా యాక్షన్... యాక్షన్... యాక్షన్. అంతే కాకుండా సినిమా అంతా హీరో సెంట్రిక్‌గా మారిపోయింది.

కానీ తెలుగు సినిమాలు మొదటి నుంచి హీరోపై ఆధారపడినవే కదా..

ఒకప్పుడు కథానాయకుడు సామాన్యుడిగా ప్రారంభమై, కష్టాలు అధిగమించి నిజమైన హీరోగా అయ్యేవాడు. కానీ ప్రస్తుతం ఒరవడి మారిపోయింది. ప్రస్తుతం సినిమాల్లో కథానాయకుడు మొదటి నుంచి మహానుభావుడు, దైవాంశసంభూతుడు. కొన్ని సినిమాల్లో దైవాంశసంభూతుడి నుంచి దేవుడిగా కూడా మారిపోతున్నాడు. అతను అన్ని పనులు చేయగలడు. కొన్ని వందలమందిని ఒంటి చేత్తో చంపేయగలడు. ఇంగ్లీషులో చెప్పాలంటే మనది హీరో సెలబ్రేషన్. నిజానికి మన తెలుగులో ఉన్న స్టార్స్ అందరూ మంచి నటులు. వారికి ఉన్న నటనా సామర్థ్యంలో మనం పదిశాతం మాత్రమే వాడుకుంటున్నాం. సంక్లిష్టమైన పాత్రలను మనం వారికి ఇవ్వటం లేదు.

> సినిమాకు రిలాక్స్ కావటానికి వెళ్తారనేది తప్పుడు వాదన. సినిమా ఒక కళారూపం. ఇది మనలో ఏదో ఒక అనుభూతిని కలగజేస్తుంది. ఏడిపిస్తుంది, నవ్విస్తుంది, కవ్విస్తుంది.. అంతేతప్ప రిలాక్స్ కాని వ్వదు.

కథకు ప్రాధాన్యత ఇచ్చే మీలాంటి దర్శకుల పరిస్థితి ఏమిటి?

ఇబ్బందిగానే ఉంటుంది. 'మాస్‌గా తీయగలడా.. హీరో ఎలివేషన్ ఇవ్వగలడా..' లాంటి చర్చలు జరుగుతూనే ఉంటాయి. అందరూ హాయిగా కలిసి కూర్చుని చూసే సినిమాలు తీయాలనేది నా లక్ష్యం. చాలా ఆలోచించి తీసుకున్న నిర్ణయమిది. నా ఉద్దేశంలో ప్రేక్షకులు అందరికన్నా తెలివైన వారు. మంచి కథతో కూడిన సినిమా వచ్చినప్పుడు తప్పనిసరిగా చూస్తారు. ఈ మధ్యకాలంలో కొన్ని చిన్న సినిమాలు కూడా విజయవంతమయ్యాయి కదా! నా ఉద్దేశంలో సామాన్య ప్రేక్షకుడికి జీవితానుభవం ఉంటుంది. జీవిత సత్యాలు చెప్పేది కూడా వాళ్లే! మీకో రెండు ఉదాహరణలు చెబుతా. ఒకసారి కొవ్వూరులో ఒక రిక్షా అతన్ని- "ఫలానా చోటికి వస్తావా? ఇక్కడి నుంచి ఎంత దూరం?" అని అడిగా. నేను అడిగిన ప్రాంతం దగ్గరే! కానీ అతనికి బేరం పోగొట్టుకోవటం ఇష్టం లేదు. వెంటనే అతను- "కళ్లకు దగ్గర... కాళ్లకు దూరం" అన్నాడు. ఎంత చక్కని మాట! దీన్ని 'అష్టాచెమ్మా'లో ఒక చోట వాడా. ఇలాగే మరోసారి రాజోలు నుంచి కారులో వెళ్తున్నాం. డ్రైవర్ ఘంటసాల పాత పాటలు పెడుతున్నాడు. "మీకు ఘంటసాల అంటే ఇష్టమా?" అని అడిగా. అప్పుడతను- "అవును సార్! మనిషి జీవితంలో పాడాల్సిన పాటలన్నీ ఘంటసాల పాడేశాడు" అన్నాడు. ఇది కూడా ఎంత గొప్ప మాట! నా ఉద్దేశంలో నిజమైన మాస్ కల్చర్ వేరు. ప్రస్తుతం మనం చూస్తున్నది- సినిమా వాళ్లు సృష్టించిన మాస్ కల్చర్. దానిని కూడా ప్రేక్షకులు చూస్తారు. కానీ వారి జీవితాల నుంచి వచ్చిన కథలను కూడా ఆదరిస్తారు.



> ఒకసారి నరసరాజు గారిని విశ్వనాథ సత్యనారాయణగారు "మాస్... మాస్ అంటారు నాకు వాళ్లెక్కడా కనబడరేంటయ్యా?" అని అడిగారట. అప్పుడు నరసరాజు గారు "వారు మాలాంటి వాళ్లకు తప్ప మీలాంటి వాళ్లకు కనబడరు సార్!" అని సమాధానమిచ్చారట.

మరి అలాంటి కథలెందుకు రావటం లేదు?

రచయితలు తగ్గిపోయారు. దీనికి కారణం- సాహిత్యాన్ని చదవకపోవటం. సమకాలీన అంశాలపై విశ్లేషణ సామర్థ్యం లేకపోవటం. ప్రస్తుత తరానికి బోలెడంత సమాచారం అందుబాటులో ఉంది. కానీ విశ్లేషణ లేదు. దీనికి కారణం- 1990వ దశకం నుంచి ఎక్కువ మంది సైన్స్, ఐటీ డిగ్రీలపై దృష్టి పెట్టడం మొదలుపెట్టారు. సామాజిక శాస్త్రాలను చదివేవారే తగ్గిపోయారు. దీనితో ఎక్కువ మందికి సమకాలీన సమాజంపై అవగాహన లేదు. 2000 సంవత్సరం తర్వాత మరిన్ని మార్పులు వచ్చాయి. ప్రస్తుత తరం వారికి డబ్బులు ఉన్నాయి. కొనుగోలు శక్తి ఉంది. ఆకాంక్షలు కూడా ఉన్నాయి. కానీ తమ చుట్టూ ఉన్న సమాజంపై అవగాహన లేదు. అలాంటప్పుడు కొత్త కథలు ఎక్కడి నుంచి వస్తాయి?

> ప్రస్తుతం ఉన్న చాలామంది నటులు అన్ని యాసల్లోనూ మాట్లాడతారు. కానీ తెలుగు మాత్రం చదవటం రాదు. సీను పేపరు తెలుగులో రాసి పంపితే- "టింగ్లిష్‌లో పంపుతారా?" అని అడుగుతారు. ఎవరికైనా కథ చెప్పిన తర్వాత- స్క్రీన్‌ప్లే పంపేముందు- "మీకు తెలుగు వచ్చా?" అని అడగాల్సిన పరిస్థితి ఉంది.

> నా ఉద్దేశంలో మూడు కోట్ల సినిమా అయినా, 300 కోట్ల సినిమా అయినా చూడటానికి మనకొక కారణం కావాలి. అది మనకు ఎంత సంతృప్తి ఇస్తుందనే విషయాన్ని ఆలోచించాలి. '300 కోట్ల సినిమా కాబట్టి థియేటర్‌కు వెళ్లి చూద్దాం, మూడు కోట్ల సినిమాను ఓటీటీలో చూద్దాం' అనుకోవటం కరెక్ట్ కాదు. కానీ ఎక్కువ మంది ప్రేక్షకులు ఈ మధ్య ఇలాగే ఆలోచిస్తున్నారు.

> తెలుగు సినిమా అంటే వసూళ్ల గురించి మాట్లాడతారు. అంతే తప్ప సినిమా నిర్మాణంలో మనం ఎంత పరిణతి చెందాం? ఎంత గొప్ప కథలు వస్తున్నాయి? అనే విషయాన్ని మాట్లాడటం లేదు. నా ఉద్దేశంలో సినిమాకు కథ ఆత్మలాంటిది. టెక్నాలజీ అనేది కొత్త హంగులు అద్దుతుందంతే! నా దగ్గర పార్కర్ పెన్ను ఉన్నంత మాత్రాన మంచి కథ రాయలేను కదా ఇది కూడా అంతే!

మరి మళయాళం, తమిళ పరిశ్రమలలో సాంస్కృతిక మూలాలున్న కథలెందుకు తీస్తున్నారు?

వారు సమాజానికి, వారి సంస్కృతికి దూరంగా జరిగిపోలేదు. తమిళంలో వెట్రిమారన్ తీసే సినిమాలు చూడండి. మనకు తెలియని సంస్కృతిని పరిచయం చేస్తాయి. కన్నడ సినిమా 'కాంతార'లో కూడామూలాలు తెలుస్తాయి. 'మోర్ లోకల్.. మోర్ యూనివర్సల్' అనే సూత్రాన్ని వారు పాటిస్తున్నారు.నా ఉద్దేశంలో మొదటి నుంచి తెలుగు ప్రేక్షకులకు- 'సినిమాకు జీవితానికి సంబంధం లేదు' అనే స్పష్టత ఉందనిపిస్తుంది. అందుకే తెలుగు సినిమాల్లో హీరో సెలబ్రేషన్ చాలా ఎక్కువ.

మరి ఈ పరిస్థితి మారదా?

మారుతుంది. ఇదంతా డ్రగ్స్ వల్ల కలిగే ప్రభావం లాంటిది. సామాన్య ప్రజలకు వ్యవస్థ అంటే భయం కాబట్టి- దాన్ని ఎదిరించేవాణ్ని ఆదరిస్తారు. కానీ అది వ్యక్తి పూజ కాకూడదు. మన జీవితంలో చేయలేని, సమాజంలో ఆచరించలేని పనులను హీరో చేస్తుంటే ఆరాధన కలగవచ్చు. కానీ 'థియేటర్ నుంచి వాస్తవ ప్రపంచానికి వచ్చిన తర్వాత మనం బతకాల్సింది ఈ సమాజంలోనే' అనే విషయం తెలిస్తే దుఃఖం కలుగుతుంది. అంటే దాని ప్రభావం తగ్గిపోతుంది. దీనిని ఇంకో కోణం నుంచి కూడా చూడచ్చు. కొత్తగా విడుదలయిన సినిమా హాలులో చూడండి.. స్క్రీన్ మీద సినిమా ప్రారంభమయిన వెంటనే వందల ఫోన్లు పైకి లేస్తాయి. స్క్రీన్ షాట్‌లను సోషల్‌మీడియాలో వెంటనే పెట్టేస్తారు. దాని ద్వారా ప్రపంచానికి తాము ఒక సినిమా చూస్తున్నామని చెప్పటానికి ప్రయత్నిస్తారు. ఎక్కువమందికి సినిమా కన్నా సెల్‌ఫోన్‌లో వచ్చే రీల్స్‌పైనో, మెసేజ్‌లపైనో దృష్టి చెదురుతూ ఉంటుంది. ప్రేక్షకులు సెల్‌ఫోన్లు చూడకుండా ఏం చేయాలనేది దర్శకులకు పెద్ద సవాలుగా మారింది. దాంతో వారు సినిమాలో కొత్త కొత్త మలుపులు పెట్టేస్తున్నారు. ప్రతి సీన్‌నొ ఒక క్లైమాక్స్‌గా మార్చటానికి ప్రయత్నిస్తున్నారు. ఒకటి పెట్టాల్సిన చోట పది, పది పెట్టాల్సిన చోట వంద- ఇలా ప్రేక్షకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. 'యాక్షన్, గ్లోబల్, స్కేల్, రీచ్' అని పరిగెడుతున్నారు. ప్రేక్షకులు ఒక సినిమాలో ఎన్ని క్లైమాక్స్‌లు చూడగలరు? నెమ్మదిగా ప్రేక్షకులకు ఇలాంటి సినిమాలు చూసి చూసి అలసట కలుగుతోంది. అన్నీ సినిమాలు ఇలాగే వస్తుంటే- ప్రేక్షకులు వీటిని చూడటం మానేసి కథాబలం ఉన్న సినిమాలను చూస్తారు. ఆ రోజు తప్పకుండా వస్తుంది.

- సివిఎల్ఎన్ ప్రసాద్

నోటి పుండ్లను నివారిద్దామిలా!

నోటి పుండ్లు సాధారణంగా దవడ లోపల, పంటి చిగుళ్ల మీద, పెదాల లోపల, నాలుక చివర్లలో ఏర్పడుతుంటాయి. వీటివల్ల ఎటువంటి హాని ఉండదు. కానీ ఆహారం తీసుకోవాలన్నా, మాట్లాడాలన్నా తీవ్రమైన నొప్పి బాధిస్తుంది. నోటిని పరిశుభ్రంగా ఉంచుకోకపోవడం, మలబద్ధకం, పోషకాహార లోపం, జీర్ణాశయ సమస్యలు, హార్మోన్ మార్పుల కారణంగా నోటి పుండ్లు ఏర్పడతాయి. వీటి నివారణలో అద్భుతంగా పనిచేసే ఇంటి చిట్కాల గురించి తెలుసుకుందాం!



తులసి: నాలుక చివర్లలో పుండ్లు ఏర్పడినపు అయిదు తులసి ఆకులను నోటిలో వేసుకుని బాగా నమలాలి. అప్పుడు తులసి ఆకుల నుంచి వచ్చే రసం పుండ్ల మీదకు చేరి వాటిని తగ్గిస్తుంది. ఒక గ్లాసు మంచినీటిలో తులసి ఆకులు వేసి గంటసేపు ఉంచాలి. తరవాత ఆ నీటిని వడబోసి తాగినాకూడా మంచి ఫలితం కనిపిస్తుంది.

కొబ్బరి పాలు: కొబ్బరిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నొప్పి, వాపులను తగ్గిస్తాయి. అర చిప్ప కొబ్బరి ముక్కలకు తగినన్ని నీళ్లు చేర్చి మెత్తగా రుబ్బి సన్నని వస్త్రంతో వడకట్టాలి. ఇలా తయారుచేసుకున్న కొబ్బరి పాలను



నోటి నిండా నింపుకొని ఒక నిముషం అలాగే ఉండాలి. తరవాత నోటిని పుక్కిలించాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తూ ఉంటే రెండు రోజుల్లో పుండ్లు తగ్గిపోతాయి. పుండ్ల మీద తరచూ కొబ్బరి నూనె రాస్తుంటే కూడా ఉపశమనంగా ఉంటుంది.

అతి మధురం: ఇది పేరుకు తగ్గట్టు తీయగా ఉండే ఆయుర్వేద ఔషధం. ఇందులో సహజంగానే నొప్పిని తగ్గించే గుణాలు ఉంటాయి. ఒక గిన్నెలో ఒక చెంచా అతి మధురం పొడి వేసి దానికి రెండు చెంచాల నీళ్లు కలిపి తయారుచేసిన మిశ్రమాన్ని పుండ్ల మీద రాయాలి. కనీసం పదిహేను నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. తరవాత మంచి నీటితో నోరు కడుక్కోవచ్చు. ఇలా రోజుకు రెండు సార్లు చేస్తూ ఉంటే మూడు రోజుల్లో క్రమంగా మంట తగ్గి పుండ్లు మాయమవుతాయి. ఒక చెంచా అతి మధురం పొడిని అర చెంచా తేనెతో కలిపి తింటే నోటి పుండ్లకు కారణమైన వ్యర్థాలన్నీ బయటికి వెళ్లిపోతాయి.

కలబంద గుజ్జు: ఇది పుండ్లను గాయాలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. కలబంద ఆకును నిలువుగా కత్తిరించి అందులోని గుజ్జును తీసుకోవాలి. దీనిని దూది సహాయంతో నోటిలోని పుండ్ల మీద పట్టించాలి. పది నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో నోరు కడుక్కోవాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తే పుండ్లు మానిపోతాయి.


లవంగ నూనె: ఇది దంత సమస్యలతోపాటు పంటి చిగుళ్ల మీద ఏర్పడే పుండ్లకు కూడా మంచి ఔషధంలా పనిచేస్తుంది. నోటిలో ఉండే హానికారక క్రిములను నాశనం చేస్తుంది. ఒక గిన్నెలో మూడు చుక్కల లవంగం నూనె, రెండు చుక్కల కొబ్బరి నూనె లేదా గ్లిసరిన్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని దూది సహాయంతో పుండ్ల మీద అద్దాలి. కొద్దిసేపటి తరవాత నోటిలో ఊరిన లాలాజలాన్ని ఉమ్మివేయాలి. ఇలా రోజుకు నాలుగుసార్లు చేస్తే పుండ్ల చుట్టూ ఉన్న వాపు, నొప్పి తగ్గుతాయి.



తేనె, పసుపు: తేనె క్రిమి నాశినిగా పనిచేస్తుంది. పసుపులోని కర్క్యుమిన్ అనే పదార్థం గాయాలను త్వరగా మాన్పుతుంది. ఒక గిన్నెలో రెండు చెంచాల తేనె, రెండు చిటికెల పసుపు వేసి బాగా కలిపి ఆ మిశ్రమాన్ని పుండ్ల మీద రాయాలి. పదిహేను నిమిషాలు అలాగే ఉంచుకుని తరవాత గోరువెచ్చని నీటితో కడగాలి. ఇలా రెండు రోజులు చేస్తే పుండ్లు తగ్గుముఖం పడతాయి.

త్రిఫల చూర్ణం: ఇది ఉసిరి కాయలు, కరక్కాయలు, తానికాయలు కలిపి పొడిచేసిన ఆయుర్వేద ఔషధం. ఈ పొడి వ్యాధికారక క్రిములతో పోరాడి వాటిని నాశనం చేస్తుంది. ఒక గ్లాసు నీటిలో అర చెంచా త్రిఫల చూర్ణం వేసి బాగా మరగించి కషాయంలా తయారు చేసుకోవాలి. దీనితో రోజుకి మూడు పూటలా పుక్కిలించాలి. ఇలా రెండు రోజులు చేస్తే నోరు శుభ్రపడి పుండ్లు తగ్గిపోతాయి.

అభిమానులకు బహుమతి



నయనతార వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర అంశాలతో 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీ తెరకెక్కింది. సాధారణ నటి నుంచి లేడీ సూపర్‌స్టార్‌గా ఎదిగిన ప్రస్థానాన్ని ఇందులో ఆవిష్కరించనున్నారు. హీరోయిన్‌గా రెండు దశాబ్దాల కెరీర్‌ను పూర్తి చేసుకున్న అరుదైన ఘనతను సొంతం చేసుకున్న నయనతార ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో జయాపజయాలు చవిచూశారు. ఐరన్ లెగ్ ముద్ర నుంచి సౌత్‌లో లేడీ సూపర్‌స్టార్ అనే గౌరవాన్ని అందుకున్నారు. ఆమె దక్షిణాదిన అగ్రహీరోలందరితో నటించారు. వారంతా నయనతార గురించి ఆసక్తికర విషయాలను ఇందులో పంచుకున్నారు. దర్శకుడు విఘ్నేశ్ శివన్‌తో ఆమె వివాహం వేడుకలను ఇందులో చూపించబోతున్నారు. 'ఈ డాక్యుమెంటరీ అభిమానులకు నా బహుమతి' అని నయనతార చెప్పారు. నయనతార 40వ పుట్టిన రోజు సందర్భంగా నవంబర్ 18 నుంచి ఈ డాక్యుమెంటరీ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.


ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్	డాక్యుమెంటరీ ఫిల్మ్	నవంబర్ 18
వాండరూస్ 2	యానిమేషన్ సిరీస్	నవంబర్ 18
జాంబీ వర్స్	కొరియన్ సిరీస్	నవంబర్ 19
ఎ మాన్ ఆన్‌ది ఇన్‌సైడ్	వెబ్‌సిరీస్	నవంబర్ 21
జాయ్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 22
పోకెమాన్ హారిజాన్స్ ది సిరీస్ 4	యానిమేషన్ సిరీస్	నవంబర్ 22
స్పెల్‌బౌండ్	యానిమేషన్ సిరీస్	నవంబర్ 22
ది పియానో లెసన్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 22
యే కాలీ కాలీ ఆంఖే	హిందీ సిరీస్	నవంబర్ 22

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
జియో సినిమా		
బ్యాక్ టూ బ్లాక్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 17
డ్యూన్: ప్రొఫెసి	వెబ్‌సిరీస్	నవంబర్ 18
హారోల్డ్ అండ్ ది పర్పుల్ క్రేయాన్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 23
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ఇంటీరియర్ చైనా టౌన్	వెబ్‌సిరీస్	నవంబర్ 19
కిష్కింధకాండమ్	మలయాళ చిత్రం (తెలుగులో)	నవంబర్ 19
ఏలియన్: రోములస్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 21
అవుట్ ఆఫ్ మై మైండ్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 22
అమెజాన్ ప్రైమ్		
క్యాంపస్ బీట్స్ 2	హిందీ సిరీస్	నవంబర్ 20





ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
ఆపిల్ టీవీ ప్లస్		
బ్లిట్జ్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 22
మనోరమా మ్యాక్స్		
తెక్కువడక్కు	మలయాళ చిత్రం	నవంబర్ 19
బుక్ మై షో		
ది గర్ల్ ఇన్‌ది ట్రంక్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 22
లయన్స్ గేట్ ప్లే		
గ్రీడీ పీపుల్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 22




మీ నిజస్వరూపమేంటో తెలిసింది

హీరో ధనుష్‌పై నయనతార విమర్శలు



తన పెళ్లి డాక్యుమెంటరీలో పదేళ్లక్రితం నాటి సినిమాకు సంబంధించిన 3 సెకన్ల నిడివి దృశ్యాలను వాడుకునేందుకు రూ.10 కోట్లు అడిగిన తమిళ హీరో ధనుష్‌పై హీరోయిన్ నయనతార నిప్పులు చెరిగారు. మీ నిజస్వరూపమేంటో తెలిసిందంటూ శనివారం ఘాటైన బహిరంగ లేఖ రాశారు. తన డాక్యుమెంటరీలో పదేళ్ల క్రితం నటించిన 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని సన్నివేశాలను వాడుకునేందుకు ఎన్‌వోసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికేట్) కోసం రెండేళ్ల నుంచి ప్రయత్నిస్తున్నామని, దీనికి అనుమతి ఇవ్వకపోగా, టీజర్‌లో మూడు సెకన్ల సన్నివేశాలను వాడుకున్నందుకు రూ.10 కోట్లు చెల్లించాలంటూ ధనుష్ డిమాండ్ చేశారని నయనతార ఆరోపించారు. కాగా, నయనతార జీవిత చరిత్ర ఆధారంగా 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే పేరుతో నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీని రూపొందించగా, ఈ నెల 18 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఇందులో నయనతార జీవిత విశేషాలతో పాటు ఆమె ప్రేమ, పెళ్లి తదితర విషయాలను పొందుపరిచారు. నయనతార ఆమె భర్త సినీ దర్శకుడు విఘ్నేష్ శివన్‌తో కలిసి పనిచేసిన తొలి చిత్రమే 'నానుమ్ రౌడీ దాన్'. ధనుష్ నిర్మాత. ఈ సినిమా చిత్రీకరణ సమయంలోనే వీరిద్దరూ ప్రేమించుకుని, పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నారు. ఈ డాక్యుమెంటరీలో ఆ సినిమా విశేషాలను చూపించాలని భావించగా, దానికి నిర్మాత ధనుష్ అనుమతి ఇవ్వలేదు.



నయన్‌కు హీరోయిన్ల మద్దతు...

నయనతారకు హీరోయిన్లు పార్వతి నాయర్, ఐశ్వర్యా రాజేష్, ఐశ్వర్య లక్ష్మి, శృతిహాసన్, అనుపమ పరమేశ్వరన్, నస్రియా, గౌరీ కిషన్, గాయత్రి శంకర్, నమిత కృష్ణమూర్తి, అభిరామి తదితరులు సోషల్ మీడియాలో మద్దతు తెలిపారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా...



ఆది సాయికుమార్ 'ఎస్‌ఐ యుగంధర్' అనే ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. మేఘలేఖ హీరోయిన్. క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా యశ్వంత్ దర్శకత్వంలో ప్రదీప్ జూలూరి నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను సందీప్ కిషన్ క్లాప్ కొట్టి ప్రారంభించగా.. సాయికుమార్ దర్శకనిర్మాతలకు స్క్రిప్టు అందజేశారు. ఈ సందర్భంగా చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఆది సాయికుమార్ ఇందులో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు.


యువతను మెప్పించే చిత్రం



శ్రీ ఇంద్ర, నికిత స్వామి, యుక్త పెర్వి హీరో, హీరోయిన్లుగా నటించిన యాక్షన్ అడ్వెంచర్ సినిమా 'అనాధ'. అన్నాసెట్ కె.ఏ దర్శకుడు. ఈ చిత్రం ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత, హీరో శ్రీ ఇంద్ర మాట్లాడుతూ' ఇది ఒక మంచి కమర్షియల్ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్. చిత్రంలో యూత్‌కి కావాల్సిన అన్ని అంశాలు ఉంటాయి' అని అన్నారు.









బస్తీ నిద్ర కేసీఆర్ దిశా నిర్దేశమే: పొన్నం

కాళోజీ జంక్షన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ బిడ్డ అయితే.. డీఎన్‌ఏ పరీక్ష చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆయన తెలంగాణ బిడ్డ అయితే రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలి కానీ.. అవరోధంగా ఎందుకు మారారని ప్రశ్నించారు. ఈ నెల 19న హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ ప్రజాపాలన సభ నిర్వహించనుంది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి పొన్నం సభా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ నది ప్రకాళన చేపడితే.. మూసీ నిద్రతో కిషన్‌రెడ్డి అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తొలి నుంచీ కేసీఆర్ డైరెక్షన్‌లోనే కిషన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ సూచన మేరకే బీజేపీ అధ్యక్ష బాధ్యతలు సంజయ్ నుంచి కిషన్‌రెడ్డికి అప్పగించారని అన్నారు. కిషన్‌రెడ్డి మూసీ నిద్ర కూడా కేసీఆర్ డైరెక్షనే అని ధ్వజమెత్తారు. మూసీ ప్రక్షాళనను అడ్డుకోవడానికి కేసీఆర్.. కిషన్‌రెడ్డిని ఉసిగొల్పుతున్నారని పేర్కొన్నారు.

3 నెలలు ఉండాలంటే ఒక్క రాత్రి షో చేస్తారా?

- బీజేపీ మూసీ నిద్రపై కాంగ్రెస్ నేతల ధ్వజం
- మూసీ ప్రాజెక్టును అడ్డుకోవద్దంటూ ఆగ్రహం

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మూసీ కంపులో మూడు నెలలు ఉండాలంటూ బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరితే.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఒక్క రాత్రి ఉండి షో చేస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. ఒక్క రాత్రి బస్తీలో బస చేసి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. మూసీ బాధితుల పట్ల బీజేపీ నేతలకు ఏమాత్రం ప్రేమ ఉన్నా మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి నిధులు తెచ్చి సహకరించాలన్నారు. బీజేపీ మూసీ నిద్రపై వేర్వేరు మీడియా సమావేశాలు, ప్రకటనల్లో ఈ మేరకు స్పందించారు. మూసీ పరీవాహక బస్తీల్లో నిద్ర అంటున్న బీజేపీ నేతలు.. దోమ తెరలు, ఫ్యాన్లు, మాస్కులు లేకుండా ఆరు బయటే నిద్రపోవాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. 'మూసీ ప్రక్షాళన కావాలంటూనే అక్కడి నుంచి ఎవరినీ ఖాళీ చేయించవద్దంటూ కిషన్‌రెడ్డి మాట్లాడుతున్నడు. గంగా, సబర్మతీ నదుల ప్రక్షాళన కోసం బీజేపీ ప్రభుత్వాలు ఎవరినీ ఖాళీ చేయించలేదా?' అంటూ ప్రశ్నించారు. మూసీ నది కాలుష్యంతో పరీవాహక ప్రజలు, రైతులు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నారని, మూసీ ప్రక్షాళనను బీజేపీ నేతలు రాజకీయం చేయవద్దని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ కోరారు. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి.. మూసీ కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న నల్లగొండ ప్రజలకు సమాధానం చెప్పాలని మరో ఎమ్మెల్యే మందుల సామేలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోందని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. 'బస్తీల్లో కిషన్‌రెడ్డి నిద్రిస్తే తప్పు లేదు. కానీ కేవలం మూసీ ప్రక్షాళనను అడ్డుకోవడడమే లక్ష్యంగా వెళ్లడమే తప్పు' అని అన్నారు. మూసీ పరీవాహక బస్తీల్లో కిషన్‌రెడ్డి ఒకరోజు నిద్రతో పాటుగా ఉదయం లేచి మూసీ నీటితో స్నానమూ చేయాలంటూ టీపీసీసీ అధికార ప్రతినిధి లింగం యాదవ్ సూచించారు.

కేటీఆర్ జైలుకు వెళ్లక తప్పదు..

జైలుకు పోతానంటూ తొందరపడుతున్న కేటీఆర్.. త్వరలోనే జైలుకు వెళ్లక తప్పదని టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఫార్మా సిటీ కోసం ఆనాడు 14 వేల ఎకరాలు సేకరించారని, లగచర్ల తరహాలో తాము దాడులు చేసి ఉంటే ఒక్క ఎకరా అయినా తీసుకోగలిగేవారా అంటూ ప్రశ్నించారు. లగచర్లలో ఏర్పాటు చేస్తున్నది ఇండస్ట్రియల్ పార్కు మాత్రమేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్‌యాదవ్ చెప్పారు. పరిహారం కింద రైతులకు సర్కారు ఎకరాకు రూ.40 లక్షల చొప్పున చెల్లిస్తుందన్నారు.

దిగొచ్చిన టెన్త్ బోర్డు..

- పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువు 28 వరకు పొడిగింపు

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు గడువును టెన్త్ బోర్డు పొడిగించింది. వచ్చే ఏడాది మార్చిలో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు ఈ నెల 18 వరకు గడువు ఇవ్వగా.. దీనికి సంబంధించి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై 'పది ఫీజు పరేషాన్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' శనివారం కథనం ప్రచురించింది. దీనిపై ప్రభుత్వ పరీక్షల విభాగం స్పందించింది. ఫీజు చెల్లించే గడువును ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించింది. ఫీజు చెల్లించిన అనంతరం ముద్రిత నామినల్ రోల్స్‌ను 30 నుంచి డిసెంబరు 4 వరకు పొడిగించారు. ఆ నామినల్ రోల్స్‌ను సంబంధిత డీఈవోలు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ (టెన్త్ బోర్డు)కు డిసెంబరు 5 నుంచి 7 వరకు సమర్పించాల్సి ఉంటుంది. ఇక రూ.50 అపరాధ రుసుముతో డిసెంబరు 10 వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబరు 19 వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 30వరకు ఫీజు చెల్లించడానికి అవకాశం ఇచ్చారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేసుకోవాలని.. ఐడీ, పాస్‌వర్డ్‌తో బోర్డు వెబ్‌సైట్‌లో లాగిన్ అయి వివరాలు పొందుపరచాలని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీ మతతత్వ పార్టీ కాదు.. మానవత్వ పార్టీ

- దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యం.. ఆ పార్టీని గెలిపించండి
- మహారాష్ట్ర ప్రచారంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్




కుబీర్/మధ్నూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ అంటే మతతత్వ పార్టీ కాదని, మానవత్వ పార్టీ అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో హిందువులకు రక్షణ లేదని.. భారత దేశంలో మాత్రం ఇతర మతాల హీరోలను ప్రజలు అభిమానిస్తారని పేర్కొన్నారు. శనివారం మహారాష్ట్రలోని పాలాజ్ గ్రామంతో పాటు దెగ్లూర్ నియోజకవర్గ పరిధిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాందేడ్ జిల్లా బీజేపీ అభ్యర్థుల తరఫున నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్, సనాతన ధర్మం, దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యమని, ఆ పార్టీని గెలిపించాలని కోరారు. మహారాష్ట్రలో సనాతన ధర్మ రక్షణ కోసం ఛత్రపతి శివాజీ, శివ సేన వ్యవస్థాపకుడు బాల్ థాక్రే చేసిన సేవలను కొనియాడారు. మోదీ నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని చూడాలన్నారు. ఆర్టికల్ 370 రద్దు, దేశ ప్రజల కల అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని నెరవేర్చారని అన్నారు. 12 కోట్ల మంది రైతులకు పీఎం కిసాన్ పథకాన్ని వర్తింపజేశారని తెలిపారు. పాలాజ్ సత్యగణేష్ ఆలయంలో పవన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, బహిరంగ సభలో అభిమానులు కేకలు వేయడంతో "మీరంతా సరిహద్దు తెలంగాణ వాసులని అర్థమైంది" అని పవన్ అన్నారు. తెలంగాణ ఉద్యమ గడ్డ అని కొనియాడుతూ.. బండెనుక బండి గట్టి పదహారు బండ్లు గట్టి అనే పాటను పాడారు.

తప్పు చేయలేదు!

అందుకే ధైర్యంగా నిలబడ్డాను

- ఏ కేసు లేకున్నా గత సర్కారు అరెస్టు చేసింది
- ఏపీలో మేం గెలుస్తామని ముందే ఊహించా
- దేశం కోసం మోదీతో కలిసి పనిచేస్తున్నాం
- సోషల్ సైకోలకు అడ్డుకట్ట వేయాల్సిందే
- లేదంటే భవిష్యత్తులో చాలా నష్టం
- సంకీర్ణంలో చిన్నచిన్న సమస్యలు మామూలే
- హిందూస్థాన్ టైమ్స్ సదస్సులో చంద్రబాబు



న్యూఢిల్లీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి కేసు లేకున్నా, ఏ తప్పూ చేయకున్నా తనను అరెస్టు చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తప్పు చేయలేదన్న ధైర్యంతోనే బలంగా నిలబడ్డానన్నారు. గత ఎన్నికల్లో ఏపీలో కూటమి గెలుస్తుందని నూటికి నూరు శాతం ముందే ఊహించానని అన్నారు. ఓట్లు చీలిపోకూడదని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ముందుకు వచ్చారని, ఆ తర్వాత బీజేపీ కూడా కూటమిలో చేరిందని చెప్పారు. దేశ భవిష్యత్ కోసం ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి పనిచేస్తున్నామని వివరించారు. మోదీ హయాంలో భారతదేశం అగ్రరాజ్యంగా మారి తీరుతుందన్నారు. శనివారం ఢిల్లీలో హిందూస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో చంద్రబాబు మాట్లాడారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ తల్లి, చెల్లిపై ఆ పార్టీ నాయకులే సోషల్ మీడియాలో అత్యంత దారుణంగా, వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పోస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్‌లో తీరని నష్టం జరుగుతుందన్నారు. హిందూస్థాన్ టైమ్స్ నేషనల్ పొలిటికల్ ఎడిటర్ సునేత్రా చౌదరి అడిగిన ప్రశ్నలకు చంద్రబాబు ఇచ్చిన సమాధానాలివి.

జైలు జీవితం మనల్ని మార్చేస్తుందని చాలామంది అంటారు. మీరేమంటారు?

చంద్రబాబు: నా జీవిత కాలంలో మర్యాదల్ని, పద్ధతులను పాటించాను. చాలా క్రమశిక్షణతో ఉన్నా. ఎవరూ నన్ను వేలెత్తి చూపలేదు. కానీ, గత ప్రభుత్వంలో ఎలాంటి కేసు లేకుండా నన్ను అరెస్టు చేశారు. నా జీవితంలో ఇలాంటిది జరగకూడదని నేనెంత జాగ్రత్తగా ఉన్నా జరిగింది. నేను తప్పు చేయలేదు. అందుకే పూర్తి విశ్వాసంతో నిలబడ్డాను. 53 రోజుల జైలు జీవితాన్ని అదే ధైర్యంతో, విశ్వాసంతో గడిపాను. ఆంధ్రప్రదేశ్ లోనే కాదు 80 దేశాల్లో నాకు మద్దతుగా జనం రోడ్లపై నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రజలు నాకు అండగా నిలిచారు. దీంతో మరింత శక్తి పుంజుకున్నా.

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో నిజంగా ఏమి జరిగింది?

జాతీయ స్థాయిలో నరేంద్ర మోదీ నాయకత్వం వల్ల ఎన్డీయే విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో అదనంగా మాకు తోడ్పడింది. గత ప్రభుత్వం పట్ల ప్రజలు పూర్తిగా నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఓట్లు చీలిపోకూడదని ముందుకు వచ్చారు. ఆ తర్వాత బీజేపీ కూడా చేరింది. మూడు పార్టీలు చేరడం వల్ల ప్రజలకు విశ్వాసం పెరిగింది. 93 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓటు శాతంతో మేము విజయం సాధించాం. ప్రజలు చాలా తెలివైన వారు. అన్నీ గమనిస్తారు. సరైన సమయంలో తీర్పు ప్రకటిస్తారు. ఏపీలో అదే జరిగింది.

బీజేపీ 240 సీట్లకే పరిమితమవుతుందని ఊహించారా?

బీజేపీకి పూర్తి మెజారిటీ వస్తుందని మేము అనుకున్నాం. ఆంధ్రప్రదేశ్ గురించి మాకు పూర్తి స్పష్టత ఉన్నది. ఏకపక్ష ఎన్నికలు జరుగుతాయని అందరూ ఊహించారు.

పవన్ కల్యాణ్ కొంత విమర్శనాత్మకంగా మాట్లాడుతున్నట్లుంది! సంకీర్ణ ధర్మం అంటే ఏమిటి?

చంద్రబాబు: ఒక కుటుంబంలో ఎప్పుడూ ఇలాంటివి ఉంటాయి. ఒకరు మరొకరిని ఎలా గౌరవించుకుంటారన్నది ముఖ్యం. రాజకీయాల్లో కూడా ఇవే సూత్రాలు వర్తిస్తాయి. కొన్నిసార్లు కొందరు వేరుగా స్పందిస్తారు. ఏదో ఒక సమాచారం ఆధారంగా మాట్లాడతారు. కానీ మాట్లాడుకుంటే అన్నీ పరిష్కారమవుతాయి. అదే మేము చేస్తున్నాం.

తమిళనాడు సీఎం స్టాలిన్‌లాగే మీరు కూడా మరింత మంది పిల్లలను కనాలని పిలుపునిచ్చారు. దక్షిణాదిన ఎంత మంది పిల్లలుండాలి?

చంద్రబాబు: గతంలో నేను బ్రేక్ సైలెన్స్-టాక్ ఎబౌట్ ఎయిడ్స్ అనే నినాదాన్ని ఇచ్చాను. ఇప్పుడు బ్రేక్ సైలెన్స్-టాక్ ఎబౌట్ పాపులేషన్ మేనేజ్మెంట్ అని పిలుపునిస్తున్నాను. యూరప్ దేశాలతో పాటు చైనా, జపాన్ సహా అనేక ప్రపంచ దేశాల్లో వయోధికులు ఎక్కువై పోయారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలలో ఈ సమస్య ప్రారంభమైంది. 1950లో ఫెర్టిలిటీ రేటు 5.6-6 వరకు ఉండేది. ఇప్పుడు 1.6 మాత్రమే. ఇది ఇంకా తగ్గితే జపాన్, చైనా మాదిరి మన దగ్గర సమస్య మొదలవుతుంది. అందుకే పాపులేషన్ మేనేజ్‌మెంట్‌ను ప్రమోట్ చేయాలనుకుంటున్నాను. అలా చేస్తే ప్రపంచంలో మనల్ని కొట్టేవారే ఉండరు.

ఎన్డీయే 3.0 ప్రభుత్వ ప్రత్యేకత ఏమిటి?

చంద్రబాబు: ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్డీయే హయాంలో భారతదేశానికి అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. గత పదేళ్లుగా ఆయన భారత్ ప్రాధాన్యం పెంచారు. 2047 కల్లా వికసిత్ భారత్ ఏర్పడాలని మోదీ కృషి చేస్తున్నారు. ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో మొదటి లేదా రెండో స్థానాన్ని సాధించగలదనే పూర్తి విశ్వాసం నాకుంది. ఇప్పటికే భారత్ మూడో స్థానాన్ని సాధించడం ఖాయమైంది.



గోల్నాక డివిజన్ తులసీరాంనగర్ బస్తీలో నిద్రిస్తున్న కిషన్‌రెడ్డి

3 నెలలైనా ఉంటా

(మొదటి పేజీ తరువాయి)

గతంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో మూసీ పరీవాక ప్రాంతాల్లో బీజేపీ నేతలు శనివారం రాత్రి బస్తీ నిద్ర చేశారు. గోల్నాక డివిజన్‌లోని తులసీరాంనగర్(లంక) బస్తీలో కిషన్‌రెడ్డి, మూసారంబాగ్‌లో ఎంపీ లక్ష్మణ్, చైతన్యపురిలో ఎంపీ ఈటల రాజేందర్ బస చేశారు. తులసీరాంనగర్ బస్తీలో శనివారం సాయంత్రం కిషన్‌రెడ్డి పర్యటించారు. రచ్చబండ నిర్వహించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. మూసీ సుందరీకరణ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ప్రకటనలతో ప్రజలు భయపడుతున్నారని, ఎప్పుడు బుల్డోజర్ వచ్చి వారి ఇళ్లను కూలగొడుతుందోనని భయాందోళనలో ఉన్నారని చెప్పారు. పేద ప్రజలు కష్టపడి ఇళ్లు కట్టుకుని 40 ఏళ్లుగా నివాసం ఉంటున్నారని, ప్రభుత్వం వారి ఇళ్లను కూల్చి వేస్తామంటే తాము అడ్డుకుంటామని తెలిపారు. "మూసీ సుందరీకరణ ఉద్దేశ్యం ఏమిటి..? ప్రాజెక్టు ఎలా ఉండబోతోంది..? నిధులు ఎక్కడ నుండి తీసుకొస్తున్నారు..? పేదల ఇళ్లను కూల్చి రూ.లక్షా యాభై వేల కోట్లతో సుందరీకరణ అవసరమా..?" అని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టుకు డీపీఆర్, విధివిధానాలు లేవని.. అలాంటప్పుడు కేంద్ర ప్రభుత్వం సహాయం చేయడం లేదనడం సరికాదని అన్నారు. మూసీ పునరుద్ధరణకు బీజేపీ వ్యతిరేకం కాదన్నారు. నదిని ప్రస్తుతం ఉన్న విధంగానే ఉంచి.. రిటైనింగ్ గోడలు కట్టి పనులు చేసుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు.

ఎన్ని బుల్డోజర్లు పంపుతావో పంపు: లక్ష్మణ్

రేవంత్.. మూసీ సుందరీకరణ పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చేందుకు ఎన్ని బుల్డోజర్లు పంపుతావో పంపు. వాటికి అడ్డుగా నిలిచి అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉంటాం' అని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. మూసీ నిద్రలో భాగంగా మూసారంబాగ్ శాలివాహననగర్‌లో శనివారం రాత్రి ఆయన బస చేశారు. అంతకుముందు స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎవరూ అధైర్యపడొద్దని.. బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బస్తీ వాసులతో కలిసి లక్ష్మణ్ రాత్రి భోజనం చేశారు. మూసీ సుందరీకరణకు సంబంధించి ఇప్పటి వరకు డీపీఆర్ సిద్ధం కాలేదని.. అలాంటప్పుడు ఏ ధైర్యంతో ఇళ్లను కూల్చివేస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నిలదీశారు. చైతన్యపురి డివిజన్‌లోని ఫణిగిరి కాలనీలో ఆయన బస చేశారు. ఫణిగిరి కాలనీ, మారుతినగర్ ఫేజ్-1, ఫేజ్-2లను సందర్శించారు. రేవంత్ తుగ్లక్ పాలనతో మూసీ పరీవాహక ప్రాంత వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాడని మండిపడ్డారు. గోల్నాక డివిజన్‌లోని కమలానగర్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, అంబేడ్కర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే రత్నం, శాస్త్రీనగర్‌లో మాజీ మంత్రి కృష్ణ యాదవ్ బస్తీ నిద్ర చేశారు.



నిర్మల్ జిల్లా బాసర అమ్మవారి ఆలయంలో మంత్రి పొంగులేటికి జ్ఞాపికను అందజేస్తున్న ఈవో విజయ రామారావు

భద్రాద్రి తరహాలో బాసరను అభివృద్ధి చేస్తాం

- బాసరలో మంత్రి పొంగులేటి హామీ

బాసర, నవంబరు16(ఆంధ్రజ్యోతి): భద్రాచలం తరహాలో బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆయన శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, పండితులు, స్థానికులు బాసర అభివృద్ధి విషయాన్ని మంత్రి దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందని, అందులో రూ.8 కోట్లతో వివిధ పనులు చేపట్టగా మిగిలిపోయిన రూ.42 కోట్ల నిధులను ఈ ప్రభుత్వం వెనక్కి తీసుకుందని మంత్రితో చెప్పారు. నిధులు వెనక్కి వెళ్లడంతో అమ్మవారి ఆలయ అభివృద్ధి నిలిచిపోయిందని, ఆ నిధులను తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని రెండు ప్రాచీన దేవాలయాల్లో బాసర ఒకటని, ఇక్కడ సరైన వసతులు లేక భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఆలయ విస్తరణ చేపడితే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు.

కిషన్‌రెడ్డి ఏం మాట్లాడుతున్నారు..?

- ఆయన మంత్రి పదవికి అర్హుడేనా..?: మంత్రి పొన్నం



వేములవాడ టౌన్/మల్యాల/హుస్నాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మంత్రి పదవికి అర్హుడా.. కాదా..? తెలియడం లేదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఫార్మా పరిశ్రమకు సంబంధించి అధికారులపై దాడి విషయంలో కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పొన్నం స్పందించారు. అధికారులపై దాడి చేయడం సరికాదని అంటూనే.. గ్రామస్థులను అరెస్టు చేయొచ్చా..? అని కిషన్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. ఏం చేయమంటారో ప్రభుత్వానికి సలహా ఇవ్వొచ్చు కదా..? అని అన్నారు. కేంద్ర మంత్రి పదవిలో ఉండి అలా మాట్లాడడం సరికాదని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామిని, జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాటి చెట్ల ఎత్తు తక్కువ ఉండేలా శాస్త్రీయ పరిశోధనలు జరుగుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. గీత కార్మికులకు రావాల్సిన పాత బకాయిలు, ఎక్స్‌గ్రేషియా విడుదలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

అప్పుల భారంతో రైతు ఆత్మహత్య

ధారూరు, దండేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అప్పుల భారంతో ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని హరిదాసుపలికి చెందిన మహిపాల్ రెడ్డి(45) నాలుగేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద దాదాపు రూ.15.20 లక్షల వరకు అప్పులు తెచ్చి పంటలు సాగు చేశాడు. అయితే అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతినటంతో దిగుబడి రాలేదు. అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్తాపం చెందిన మహిపాల్‌రెడ్డి నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన తిరిగి రాలేదు. ఈ క్రమంలో మహిపాల్ రెడ్డి తమ్ముడు కమాల్‌రెడ్డి శనివారం పొలం వద్దకు వెళ్లాడు. దుర్వాసన రావడంతో అక్కడ పరిశీలించగా మహిపాల్‌రెడ్డి చెట్టుకు ఉరేసుకుని విగత జీవిగా కన్పించాడు.

వృద్ధుని ప్రాణాన్ని ఆర్పిన దీపం

- దీపం కిందపడి మంటలు చెలరేగి సజీవ దహనం

కొత్తకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాత్రివేళ వెలుగు కోసం దీపం వెలిగించుకొని నిద్రపోవడమే ఆ ముసలాయన పాలిట యమపాశమైంది. దీపం కిందపడి మంటలు అంటుకుని ఆయన సజీవ దహనమయ్యారు. ఈ ఘటన వనపర్తి జిల్లా కొత్తకోటలో శనివారం జరిగింది. కొత్తకోటలో నివసించే బలిజపల్లి దేవయ్య (93) తన ఇద్దరు కుమారుల వద్ద కాకుండా సొంత ఇంట్లో ఉంటున్నారు. ఇంటి పక్కనే నివాసం ఉంటున్న పెద్దకుమారుడు శేఖరయ్య శనివారం తెల్లవారుజామున నిద్రలేచి దుర్వాసన వస్తుందని తండ్రి ఇంటి తలుపులు తెరిచి చూశారు. అప్పటికే ఒక్క కాలు మినహా దేవయ్య శరీరం మొత్తం దహనమైంది. దేవయ్య రాత్రివేళ దీపం వెలిగించుకొని నిద్ర పోయేవారు. శుక్రవారం రాత్రి కూడా దీపం వెలిగించుకొని నిద్రపోయి ఉంటారని, దీపం కిందపడటంతో మంటలు మంచం, పరుపునకు తగిలి నిద్రిస్తున్న దేవయ్యకు అంటుకొని సజీవ దహనమై ఉంటారని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందని కారణంగా కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్‌కు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్‌లో చోటు

చిక్కడపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తొడుపునూరి అమర్‌నాథ్‌గౌడ్‌కు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్‌లో చోటు దక్కింది. శనివారం రాజ్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆయనకు ఈ అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. అమర్‌నాథ్‌గౌడ్ అందిస్తున్న న్యాయసేవలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. 2017 నుంచి 2021 వరకు హైదరాబాద్‌లోని ఉమ్మడి హైకోర్టులో సేవలందించారు. 2021 నుంచి త్రిపుర హైకోర్టులో ఆయన సేవలందిస్తున్నారు. అనేక కేసుల పరిష్కారంలో ఆయన చూపిన అసాధారణ ప్రతిభ కారణంగా ఆయనకు ఈ అవార్డు దక్కిందని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్ ఇండియా కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. న్యాయాన్ని అందించడంలో అమర్‌నాథ్‌గౌడ్ అత్యుత్తమ నిబద్ధత, అంకితభావం చూసి ఆయనను ఈ రికార్డుకు ఎంపిక చేశామన్నారు. ఆయన ఇచ్చిన విశేషమైన తీర్పులు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో ఆయన పేరు నమోదుకు కారణమయ్యాయన్నారు.

కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ రైతులకు ఇందిరమ్మ ఇళ్లు

- 863 మందికి మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- 19న వరంగల్‌లో సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీ
- రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే రేవూరి

వరంగల్ సిటీ, నవంబరు 16: (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు భూములిచ్చిన 863 మంది రైతులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ కార్యదర్శి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఏడాది జూన్ 29న వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా టెక్స్‌టైల్ పార్క్‌కు భూములిచ్చిన రైతులకు ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని తాను విజ్ఞప్తి చేశానని, ఆ అభ్యర్థన మేరకు 863 ఇళ్లను మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.5 లక్షలతో ఒక్కో ఇల్లు చొప్పున మంజూరు చేసిందని, ఇది సీఎం రేవంత్ రెడ్డికి టెక్స్‌టైల్ పార్క్‌పై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. ఈ ఉత్తర్వులు వచ్చాయని తెలుసుకున్న రైతులంతా సంతోషం వ్యక్తం చేశారని, రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకూడదని సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని కొనియాడారు. ఈ నెల 19న వరంగల్ జిల్లా పర్యటనకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రైతులకు ఇళ్ల పట్టాలు అందజేస్తామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు.

ఫ్యూచర్‌సిటీ రోడ్డు సర్వే అడ్డగింత

- పరిహారం మాట లేకుండా పనులా?
- అధికారులపై రైతుల తీవ్ర ఆగ్రహం
- 2 గంటల పాటు కొనసాగిన నిరసన
- స్థానిక నేత జోక్యం.. శాంతించిన రైతులు
- రంగారెడ్డి జిల్లా బేగంపేటలో ఘటన



రాచులూరు రెవెన్యూలో పరిధిలో సర్వే చేయడానికి వచ్చిన అధికారులతో మాట్లాడుతున్న బేగంపేట, తుర్కగూడ గ్రామాల రైతులు

కందుకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఫ్యూచర్ సిటీకి సంబంధించి తమ భూముల్లోంచి రోడ్డు సర్వే ఎలా చేస్తారంటూ రైతులు అధికారులను అడ్డుకున్నారు. తమ భూములకు ఇచ్చే పరిహారం మాట చెప్పకుండా పనులు చేపడితే ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని బేగరికంచ, మీర్కాన్‌పేట గ్రామాల రెవెన్యూ పరిధిలో నెలకొల్పనున్న ఫ్యూచర్ సిటీకి సంబంధించి రోడ్డు పనులు చేపట్టడానికి శనివారం డివిజన్ సర్వేయర్ కృష్ణయ్య, మండల సర్వేయర్ సాయికాంత్‌లు రాచులూరు రెవెన్యూ పరిధిలోని బేగంపేట గ్రామానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న బేగంపేట, తుర్కగూడ రైతులు సర్వేయర్లకు అడ్డుపడి నిరసన తెలిపారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా భూములు కొలతలు చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేయర్ కృష్ణయ్య పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఇక్కడికి వచ్చి రైతులను శాంతింపజేయడానికి యత్నించారు. రైతులు మాత్రం తమ భూములు కొలతలు చేసేందుకు ఒప్పుకోమని భీష్మించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కె.గోపాల్ ఘటన స్థలానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. రోడ్డు వేయడానికి ప్రభుత్వం భూసేకరణ చేయాలన్న ఆదేశానుసారం సర్వే చేసేందుకు అధికారులు వచ్చారని, వారిని అడ్డుకోవద్దని కోరారు. రైతులు మాత్రం సర్వే చేయనివ్వబోమని తేల్చిచెప్పారు. దాదాపు రెండు గంటలు తర్వాత స్థానిక నేత వెదిరె రవికాంత్‌రెడ్డి అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎకరం నుంచి ఐదెకరాల వరకు భూమి పోతున్న తమకు ప్రభుత్వం పరిహారం విషయమై ఎలాంటి చర్చలు జరపలేదని రైతులు రవికాంత్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. భూములు కోల్పోతున్న రైతులంతా సోమవారం కలెక్టరేట్‌కు వస్తే సమస్యలు వివరించి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని రవికాంత్ రెడ్డి హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. అనంతరం అధికారులు సర్వే పనులు కొనసాగించారు.

ఆర్‌ఆర్‌ఆర్ దారిలా..

(మొదటిపేజీ తరువాయి)

కన్సల్టెన్సీ సంస్థ గణించింది. దీని ప్రకారం.. బీవోటీ విధానంలో మొత్తం ప్రాజెక్టు వ్యయాన్ని నిర్మాణ సంస్థే భరించినా.. పెట్టిన పెట్టుబడిపై అంతర్గత రాబడి (ఎకనమిక్ ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్) రేటు 5.37 శాతం మాత్రమే ఉంటుందని పేర్కొంది. ఒకవేళ నిర్మాణ వ్యయంలో 40 శాతం నిధులను ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో అందించినా.. అంతర్గత రాబడి రేటు తక్కువగానే ఉంటుందని తెలిపింది. అందుకే బీవోటీ విధానం లాభదాయకం కాదని స్పష్టం చేసింది.

ఆశాజనకంగా అంతర్గత రాబడి!

ఈపీసీ, హెచ్‌ఏఎం విధానాల్లోనైతే అన్ని ఖర్చులు కలుపుకొన్నా.. అంతర్గత రాబడి రేటు ఆశాజనకంగా ఉంటుందని కన్సల్టెన్సీ సంస్థ పేర్కొంది. దాదాపు 12 శాతానికి పైగా రాబడి రేటు ఉందని తెలిపింది. అంతేకాకుండా ఈ విధానాల్లో చేపట్టే నిర్మాణాలకు ప్రభుత్వం కొంతమేర గ్రాంట్ల రూపంలో నిధులు ఇస్తే.. నిర్మాణం పూర్తయిన తరువాత నుంచి 17 ఏళ్లలోనే టోల్ వసూళ్ల రూపంలో ఆదాయం వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, రోడ్డు నిర్మాణం తరువాత 2027 నుంచి 2046 వరకు (ఆ సమయానికి రహదారి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తేనే) దాదాపు రూ.15,768 కోట్లు టోల్ వసూలు ద్వారా రాబడి ఉంటుందని నివేదికలో పొందుపరిచింది. ఇది కూడా ఏటా 5 శాతం చొప్పున వాహనాల పెరుగుదల ఉంటేనే సాధ్యమవుతుందని అంచనా వేసింది. వాహనాల పెరుగుదల, రాబడికి సంబంధించి వేసిన కొన్ని అంచనాలను కూడా వివరించింది.

ఈపీసీ, హెచ్‌ఏఎం అంటే..

ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) అంటే.. ఏదైనా ఒక రహదారి నిర్మాణం కోసం టెండర్ దక్కించుకున్న సంస్థే ఆ రహదారి నిర్మాణంలో ఇంజనీరింగ్ పనులు, మెటీరియల్ సేకరణ, నిర్మాణం, వ్యయం వరకు అన్నింటినీ పర్యవేక్షిస్తుంది. ఇక హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్‌ఏఎం) విధానంలోనైతే.. నిర్మాణ వ్యయంలో నిర్మాణ సంస్థ కొంత, రుణంగా కొంత చొప్పున నిధులను సమకూర్చుకుంటారు. ఒకవేళ జాతీయ రహదారుల నిర్మాణాల్లో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామ్యం కావాలనుకుంటే కొంతమేర పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. రోడ్డు నిర్మాణం పూర్తయిన తరువాత నుంచి వసూలు చేసే టోల్‌లో రాష్ట్రానికి కూడా కొంత వాటా వస్తుంటుంది. ఇందుకు సంబంధించి నిర్మాణానికి ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం టోల్ వసూలు, వాటా ఉంటుంది. ఈ విధానంలో రహదారి నిర్మాణం కోసం ప్రైవేటు సంస్థ వెచ్చించిన నిధులను వారికి ప్రభుత్వం వెంటనే చెల్లించాల్సిన అవసరంలేదు. ఏడాదికి కొంత చొప్పున వాయిదాల పద్ధతిలో చెల్లించేందుకు వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం దేశంలో ఈ హైబ్రిడ్ యాన్యుటీతోపాటు ఈపీసీ విధానం ఎక్కువగా అమల్లో ఉంది. ఇక బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానంలో.. నిర్మాణ సంస్థే టోల్ వసూలు చేసుకుంటుంది, టోల్ వసూలు చేసినంత కాలం రోడ్ నిర్వహణను సదరు సంస్థే పర్యవేక్షిస్తుంది. ఆ తరువాత కొంతకాలానికి ప్రభుత్వానికి అప్పగిస్తుంది.

టోల్ ప్లాజాలు, రెస్ట్ ఏరియాలు..

ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం సంగారెడ్డిలో మొదలై నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, యాదాద్రి భువనగిరి మీదుగా చౌటుప్పల్ వరకు 161 కిలోమీటర్ల మేర నిర్మాణం కానుంది. దీనిని ఆరు ప్యాకేజీలుగా నిర్మించనున్నారు. నిర్మాణానికి 1,940 హెక్టార్ల భూమి అవసరమవుతుండగా.. రూ.15 వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతున్నాయి. ఇందులో దాదాపు రూ.5,200 కోట్లు భూపరిహారానికి చెల్లించాల్సి ఉంది. కాగా ఈ రహదారిని గంటకు 120 కిలో మీటర్ల వేగంతో ప్రయాణించేలా నిర్మిస్తున్నారు. ఇది నాలుగు వరుసలతో పూర్తి యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారిగా నిర్మితం కానుంది. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగం రోడ్డు మార్గంలో పలు జాతీయ, రాష్ట్ర రహదారులను క్రాస్ చేయాల్సి వస్తుంది. కొన్నిచోట్ల ఇరిగేషన్ శాఖకు సంబంధించిన మైనర్, మేజర్, బాక్స్ కల్వర్టులను కూడా నిర్మించాల్సి ఉంది. మొత్తం రోడ్డు విస్తీర్ణంలో 11 ఇంటర్‌ఛేంజ్‌లు, కొన్ని చోట్ల టోల్‌ప్లాజాలు రానుండగా, 6 చోట్ల రెస్ట్ ఏరియాలు ఏర్పాటు కానున్నాయి. చిన్న, మధ్య, భారీ తరహా వెహికల్ అండర్ పాస్‌లు అన్నీ కలిపి దాదాపు 187, రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)లు నాలుగింటిని నిర్మించాల్సి వస్తుంది. ఇవే కాకుండా మేజర్ బ్రిడ్జిలు 26, మైనర్ బ్రిడ్జిలు 81, బాక్స్ కల్వర్టులు 400కు పైగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

ఆరు ప్యాకేజీలుగా నిర్మాణం..

ఆరు ప్యాకేజీల్లో భాగంగా.. మొదటి ప్యాకేజీ గిర్మాపూర్ నుంచి రెడ్డిపల్లి వరకు 34.518 కిలోమీటర్లు ఉండనుంది. రెండో ప్యాకేజీ.. రెడ్డిపల్లి నుంచి ఇస్లామాపూర్ వరకు 26 కి.మీ ఉంటుంది. ప్యాకేజీ-3 ఇస్లామాపూర్ నుంచి గుండన్‌పల్లి వరకు 29 కి.మీ ఉంది. ప్యాకేజీ-4.. గుండన్‌పల్లి నుంచి తుర్కపల్లి వరకు 29 కిలోమీటర్లు. ప్యాకేజీ-5 తుర్కపల్లి నుంచి ఏదుళ్ల గూడెం వరకు 31.100కి.మీ. ప్యాకేజీ-6.. ఏదుళ్లగూడెం నుంచి చౌటుప్పల్ వరకు..17.900కి.మీ ఉండనుంది. ఇక ఉత్తరభాగం రహదారిలో రానున్న 11 ఇంటర్‌ఛేంజ్‌లను వివిధ విధానాల్లో నిర్మించనున్నారు. హైదరాబాద్-పుణె (ఎన్‌హెచ్-65) మార్గంలో సింగిల్ ట్రంపెట్ విధానంలో, హైదరాబాద్-నాందేడ్ (ఎన్‌హెచ్-161) మార్గంలో డబుల్ ట్రంపెట్, హైదరాబాద్-మెదక్ (ఎన్‌హెచ్-765డి)మార్గంలో డైమండ్ పద్ధతిలో, హైదరాబాద్-నాగ్‌పూర్ (ఎన్‌హెచ్-44)లో క్లోవర్‌లీఫ్ విధానంలో, తూప్రాన్-గజ్వేల్ (స్టేట్ హైవే-17) దగ్గర రోటరీ కమ్ ఫ్లై ఓవర్ విధానం, హైదరాబాద్-మంచిర్యాల (స్టేట్‌హైవే-01) క్లోవర్ లీఫ్ పద్ధతిలో ఒకటి, ప్రజ్ఞాపూర్- భువనగిరి (స్టేట్ హైవే-17) దగ్గర రోటరీ కమ్ ఫ్లైఓవర్ విధానం. యాదాద్రి-కీసర రోడ్డులో రోటరీ కమ్ ఫ్లై ఓవర్, హైదరాబాద్-వరంగల్ (ఎన్‌హెచ్-163) మార్గంలో డబుల్ ట్రంపెట్, భువనగిరి-నల్లగొండ రోడ్డులో రోటరీ కమ్ ఫ్లై ఓవర్, హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్-65)మార్గంలో సింగిల్ ట్రంపెట్ విధానంలో వీటిని నిర్మించనున్నారు.

శిశువు పేగుచీలికకు 'అపోలో'లో అరుదైన శస్త్రచికిత్స

హైదరాబాద్ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నెలలు నిండకుండా (28 వారాలకే) జన్మించిన కేవలం 760 గ్రాముల బరువుతో జన్మించి, పేగుచీలికతో బాధపడుతున్న శిశువుకు జూబ్లీహిల్స్ అపోలో క్రెడిల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఆ వివరాలను వైద్యుల బృందం శనివారం వివరించింది. ఈ శిశువును తల్లిదండ్రులు ఆగస్టు 31న అపోలో ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఎక్స్‌రే తీయగా పేగు చీలిక వల్ల శిశువు కడుపు ఉబ్బిపోయి ఆహారం తీసుకోవడంలో సమస్య ఏర్పడినట్లు గుర్తించారు. మొదట శిశువు కడుపులో చిన్నగొట్టం (పెరిటోనియల్ డ్రైన్) ఉంచి రక్తప్రసరణ నిలకడగా ఉండేట్టు చేశారు. అనంతరం పేగుచీలికకు ల్యాపరోటమీ శస్త్రచికిత్స చేశారు. చిన్నపేగు ద్వారా ఆహారం అందించే గొట్టం (ఫీడింగ్ జేజునోస్టమీ) అమర్చి.. శిశువుకు క్రమంగా ఆహార పరిమాణం పెంచుతూ వచ్చారు. దీనికి రెండు నెలల సమయం పట్టిందని, నియోనాటల్ ఐసీయూలో చికిత్స అనంతరం శిశువు బరువు 1.56 కిలోలకు పెరిగి, ఆరోగ్యంగా ఉండడంతో శనివారం డిశ్చార్జి చేశామని వైద్యులు తెలిపారు. పీడియాట్రిక్ సర్జరీ నిపుణుడు డాక్టర్ లలతేందుకుమార్ ఆధ్వర్యంలో అనస్థటిస్ట్ విశ్వనాథ్, ఎన్ఐసీయూ నిపుణుడు కృష్ణస్వరూప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా గుమ్మడి వెన్నెల

హైదరాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సాంస్కృతిక, కళాప్రదర్శనలతో విస్తృత స్థాయిలో ప్రచారం చేయడానికి నిర్దేశించిన తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా డాక్టర్ గుమ్మడి వెన్నెలను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర యువజన సర్వీసులు సాంస్కృతిక, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.శ్రీధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా యుద్ధనౌకగా సుప్రసిద్ధుడైన గద్దర్ కుమార్తెను సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా నియమించడం పట్ల పలు తెలంగాణ ప్రజా, సాంస్కృతిక సంఘాలు, కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రశాంతిహిల్స్‌లో 45 ఎకరాలపై యథాతథ స్థితి

- చీఫ్ సెక్రటరీని సుమోటోగా ఇంప్లీడ్ చేసిన హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్ నౌకన్సా గ్రామపరిధిలోని ప్రశాంతి హిల్స్ సర్వేనెంబర్ 66/2 లో ఉన్న దాదాపు 45 ఎకరాల లావాదేవీలు, అనుమతులు, నిర్మాణాలు సహా అన్ని అంశాలపై స్టేటస్ కో (యథాతథస్థితి) విధిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. భూములపై వివాదం తేలే వరకు ఎలాంటి చర్యలు చేపట్టకూడదని ఆదేశించింది. ఇవి ప్రభుత్వ భూములా, ప్రైవేటువా, ఏ వర్గీకరణ కిందకు వస్తాయి... తదితర అంశాలపై వైఖరి ఏమిటో తెలియజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీచేసింది. వివాదంలో ఉన్న ఈ భూమికి రంగారెడ్డి కలెక్టర్ నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఎలా ఇచ్చారు? అనే విషయమై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంది. సమాధానాలు రాబెట్టే నిమిత్తం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఈ పిటిషన్‌లో సుమోటోగా ఇంప్లీడ్ చేసింది. వివాదంలో ఉన్న ఈ భూముల్లో నాగాహిల్స్ కోఆపరేటివ్ సొసైటీ విజ్ఞప్తి మేరకు సర్వే నిర్వహించడంతోపాటు, కలెక్టర్ ఎన్‌వోసీ ఇవ్వడం చెల్లదని పేర్కొంటూ ఏ. చెన్నమ్మ అనే మహిళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌లో సీఎస్ పార్టీగా లేకపోయినప్పటికీ సుమోటోగా ఇంప్లీడ్ చేసింది. .

విజయసాయిరెడ్డి వృత్తిపర దుష్ప్రవర్తనపై చార్టర్డ్ అకౌంటెంట్స్ సంస్థ అప్పీల్

- విచారించనున్న హైకోర్టు డివిజన్ బెంచ్

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వృత్తిపరమైన దుష్ప్రవర్తన వ్యవహారంలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి అనుకూలంగా సింగిల్ జడ్జి ధర్మాసనం తీర్పు ఇవ్వడంపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. వైఎస్.జగన్ అక్రమాస్తుల విషయంలో ఆయన వృత్తి ధర్మాలను విస్మరించారన్న అంశంపై తమ విచారణ పూర్తి కాకుండానే న్యాయమూర్తి తీర్పు ఇవ్వడాన్ని సవాలు చేసింది. విజయసాయిరెడ్డి తప్పుచేశారని నిర్ధారణకు వచ్చినప్పటికీ ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా సహజన్యాయసూత్రాలను పాటిస్తూ కేవలం షోకాజ్ నోటీసు మాత్రమే జారీచేసిందని పేర్కొంది. చార్టర్డ్ అకౌంటెంట్స్ యాక్ట్ - 1949లోని వృత్తిపరమైన దుష్ప్రవర్తన సెక్షన్ కింద విచారణకు ఆదేశించడాన్ని సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తు చేసింది. విచారణ పెండింగ్‌లో ఉండగా హైకోర్టు జోక్యం చేసుకోరాదన్న అంశాన్ని సైతం సింగిల్ జడ్జి పట్టించుకోలేదని పేర్కొంది. విజయసాయిరెడ్డికి వ్యతిరేకంగా సీబీఐ కోర్టులో క్రిమినల్ ప్రొసీడింగ్స్ పెండింగ్‌లో ఉన్నప్పటికీ, వృత్తిపరమైన దుష్ప్రవర్తన అంశంపై విచారణ చేపట్టవచ్చని సుప్రీంకోర్టు సైతం ధ్రువీకరించిందని.. కానీ దీన్ని విస్మరించారని తెలిపింది. తమ వద్దనే అప్పీల్ చేసుకునే అవకాశం అందుబాటులో ఉన్నప్పటికీ విజయసాయిరెడ్డి హైకోర్టులో నేరుగా రిట్ పిటిషన్ వేయడం చెల్లదని పేర్కొంది. కేవలం నోటీసు ఇచ్చినందుకే హైకోర్టులో పిటిషన్ వేశారని, అది సరికాదని తెలిపింది.

అతిథులమని సాగనంపకండి..

జేఎల్ రిక్రూట్‌మెంట్‌తో గెస్ట్ లెక్చరర్ల భవితవ్యం ప్రశ్నార్థకం.. ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని ఆందోళన

ఎంటీఎస్ కింద విధుల్లో కొనసాగించాలని ప్రభుత్వానికి వేడుకోలు

జనగామ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లుగా పని చేస్తున్న వారి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. జూనియర్ లెక్చరర్ల(జేఎల్) నియామక ప్రక్రియ పూర్తి కానుండడంతో ఉపాధిని కోల్పోయి రోడ్డున పడతామని గెస్ట్ లెక్చరర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మినిమమ్ టైం స్కేల్ (ఎంటీఎస్) ప్రాతిపదికన తమను విధుల్లో కొనసాగనివ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1654 మంది గెస్ట్ లెక్చరర్లు ఉన్నారు. జూనియర్ కాలేజీల్లో బోధన సిబ్బంది కొరతను భర్తీ చేసేందుకు 11 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం గెస్ట్ లెక్చరర్ల విధానాన్ని తీసుకొచ్చింది. కాంట్రాక్ట్, పార్ట్ టైం లెక్చరర్ల మాదిరిగానే గెస్ట్ లెక్చరర్లను కూడా ఓపెన్ నోటిఫికేషన్, ఇంటర్వ్యూ, డెమో, పీజీ మెరిట్ మార్కులు ఆధారంగా త్రిసభ్య కమిటీ ఎంపిక చేసింది. ఎంపికైన అధ్యాపకులకు ఒక్కో పీరియడ్‌కు రూ.390 వేతనంగా ఇస్తారు. సాధారణ సెలవులు, పండుగ రోజులు, వేసవి సెలవులు, ఇతరత్రా సెలవు దినాల్లో వేతనం ఉండదు. ఈ లెక్కన ఒక్కో అధ్యాపకునికి నెలకు



రూ.28వేల దాకా వేతనం అందుతుంది. అయితే, 1392 జేఎల్ పోస్టుల భర్తీకి గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ విడుదలైంది. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించి నెల రోజుల క్రితం ఫలితాలు ప్రకటించారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వాల్సి ఉంది. గెస్ట్ లెక్చరర్లు ఉన్న స్థానాలను ఈ రెగ్యులర్ జేఎల్‌లతో భర్తీ చేస్తారు. దీంతో గెస్ట్ లెక్చరర్లు ఉపాధి కోల్పోతామని రోజులు లెక్కపెట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తమను మినిమమ్ టైం స్కేల్ (ఎంటీఎస్) లోకి బదలాయించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మాకు న్యాయం చెయ్యండి



గెస్ట్ లెక్చరర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలి. ఉన్నపళంగా ఉద్యోగం నుంచి తొలగిస్తే మరో కళాశాలలో చేరే అవకాశాలు కూడా లేవు. ప్రైవేటు కళాశాలల్లో పని చేసేందుకు యువతతో పోటీ పడాలి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా గెస్ట్ లెక్చరర్లను ఎంటీఎస్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలి.

- ఆదర్శ కుమారి, గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్(1145) రాష్ట్ర మహిళా కార్యదర్శి

అధికారంలోకి వచ్చిన వెంటనే తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ హామీ ఇచ్చిన సంగతిని వారు గుర్తు చేస్తున్నారు. ఉపాధి కోల్పోతున్నాననే ఆందోళనతో కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీ హిస్టరీ లెక్చరర్ రాధ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆస్పత్రి పాలయ్యారని తోటి గెస్ట్ లెక్చరర్లు వాపోతున్నారు.

వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ మాయం

కేటీఆర్‌వి పిల్లచేష్టలు.. సోషల్ మీడియాతో వాస్తవాల వక్రీకరణకు ఆయన ప్రయత్నాలు

- విచారణ తర్వాతే కేటీఆర్‌ను జైలుకు పంపుతాం
- 19న వరంగల్‌లో కాంగ్రెస్ విజయోత్సవ సభ
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

హనుమకొండ సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ మాయం కానుందని, అందుకు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితం కావడమే నిదర్శనమని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై ఈ నెల 19న హనుమకొండలో విజయోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 39 సీట్లు వచ్చాయని, బాధ్యతగల ప్రతిపక్షంగా వ్యవహరించాలని ప్రజలు తీర్పు ఇస్తే ఆ హోదాను సైతం కేసీఆర్ అగౌరవపరిచారని విమర్శించారు. నాడు, నేడు ఆయన ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని, తన పదేళ్ల పాలనలో ప్రజాభీష్టాన్ని ధిక్కరించి.. అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారన్నారు. ప్రతిపక్షంగా కూడా విఫలమైన బీఆర్ఎస్‌కు నూకలు చెల్లాయన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌వి రాజకీయ పిల్ల చేష్టలని వ్యాఖ్యానించారు. ప్రజలు గద్దె దించినా ఆయన పాఠాలు నేర్చుకోలేదన్నారు. కేటీఆర్ తన సోషల్ మీడియాతో వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రభుత్వంపై బురదజల్లే చర్యలకు ఒడిగడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చట్టాన్ని గౌరవిస్తుందని, కేటీఆర్ అవినీతిపై విచారణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

జరిగిన తరువాతే ఆయనను జైలుకు పంపుతామన్నారు. కాళేశ్వరంలో అవినీతిపై విచారణ జరుగుతోందని, అది పూర్తయ్యాక అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ నేతలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ ఏడాది పాలనపై చర్చకు తాము సిద్ధమని, బీఆర్ఎస్ సిద్ధమా అని సవాల్ విసిరారు. హైదరాబాద్ భవిష్యత్తు కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన చేపట్టారని మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హైదరాబాద్ చిన్నవర్షాలకే మునిగిపోతోందన్నారు. ఈ అపప్రదను తొలగించి ముంపు ముప్పు లేకుండా ఉండాలంటే మూసీ ప్రక్షాళన జరగాలని, ఇందులో రాజీపడేది లేదన్నారు. బీఆర్ఎస్ భూబకాసురులు చెరువులు, కుంటలను ఆక్రమించి విక్రయించారని, హైడ్రా కూల్చివేతలు బీఆర్ఎస్ పుణ్యమేనన్నారు. బీజేపీ 'మూసీ నిద్ర వల్ల ఒరిగేదేమీ లేదని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు.

లక్ష మందికిపైగా మహిళలతో సభ

హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో లక్షమందికి పైగా మహిళలతో ఈ నెల 19 కాంగ్రెస్ విజయోత్సవ సభ నిర్వహిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నిర్వహించే ఈ సభకు సీఎం రేవంత్ హాజరవుతారన్నారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఎంపీలు బలరాంనాయక్, కావ్య తదితర ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశమైన ఆయన సభ నిర్వహణపై చర్చించారు.

టైసన్‌కు పంచ్



జేక్ చేతిలో ఓటమి
విజేతకు రూ.338 కోట్లు

ఎర్లింగ్టన్ (అమెరికా): మైక్ టైసన్.. బాక్సింగ్ ప్రియులకే కాకుండా ప్రపంచవ్యాప్త క్రీడా ప్రేమికులకు పరిచయం అక్కర్లేని పేరు. కెరీర్ ఉజ్వలంగా సాగిన దశలో అజేయుడిగా పేరుతెచ్చుకున్న ఈ మాజీ హెవీవెయిట్ చాంపియన్.. 58 ఏళ్ల వయస్సులో బరిలో నిలిచి కంగుతిన్నాడు. భారతకాలమాన ప్రకారం శనివారం ఉదయం అమెరికన్ ప్రొఫెషనల్ బాక్సర్, యూట్యూబర్ జేక్ పాల్‌తో జరిగిన పోరులో ఓడిపోయాడు. ముగ్గురు జడ్జిలు 80-72, 79-73, 79-73 పాయింట్లతో ఏకగ్రీవంగా జేక్‌ను విజేతగా ప్రకటించారు. దీంతో జేక్‌కు రూ.338 కోట్ల ప్రైజ్‌మనీ దక్కగా.. ఓడిన టైసన్‌కు రూ.169 కోట్లు అందాయి. షెడ్యూల్ ప్రకారం ఈ ఫైట్ జూలై 20నే జరగాల్సి ఉన్నా టైసన్ అనారోగ్యం కారణంగా వాయిదా పడింది. ఈ బౌట్ మొత్తం 8 రౌండ్లపాటు జరిగింది. అయితే 2005లోనే ప్రొఫెషనల్ బాక్సింగ్ నుంచి తప్పుకొన్న టైసన్‌లో మునుపటి ఉత్సాహం కనిపించలేదు. అటు 27 ఏళ్ల జేక్ మాత్రం రింగ్‌లో వేగంగా కదులుతూ టైసన్‌పై పంచ్‌ల వర్షం కురిపించాడు. వాస్తవానికి తొలి రెండు రౌండ్లలో మైక్ 10-9 స్కోర్లతో కాస్త ఆధిపత్యం చూపాడు. కానీ ఆ తర్వాత పూర్తిగా గతి తప్పాడు. పాదాల కదలికలోనూ చురుకుదనం లోపించగా.. అసలు అతడి పంచ్‌ల్లో ఎలాంటి పవర్ కనిపించకపోవడం గమనార్హం. మూడో రౌండ్ నుంచి జేక్ పంచ్‌లను కాచుకోవడం టైసన్‌కు కష్టంగా మారింది. దీంతో మిగిలిన ఆరు రౌండ్లను 10-9 స్కోర్లతో జేక్ గెలుచుకుం టూ వెళ్లాడు. ఐదో రౌండ్‌లో ముక్కుపై, 7-8వ రౌండ్లలో తలకు ఇరువైపులా ఇచ్చిన జేక్ పంచ్‌లకు టైసన్ బేలగా కనిపించాడు. అయితే బౌట్ ముగిసిన వెంటనే టైసన్ ముందు తలవంచి జేక్ తన గౌరవాన్ని ప్రకటించాడు. ఓవరాల్‌గా జేక్ 78 పంచ్‌లు విసరగా.. టైసన్ నుంచి కేవలం 18 మాత్రమే వచ్చాయి. ప్రస్తుతం టైసన్ కెరీర్‌లో 50 విజయాలు 7 ఓటములున్నాయి. కాగా ఈ ఫైట్ చూసేందుకు విశ్వవ్యాప్తంగా అభిమానులు ఆసక్తి చూపారు. దీంతో ఒక్కసారిగా రద్దీ పెరగడంతో బౌట్ ప్రసారకర్త అయిన నెట్‌ఫ్లిక్స్ యాప్ బౌట్ ఆరంభానికి ముందు యూఎస్, భారత్‌లో కాసేపు షట్‌డౌన్ అయింది.



బౌట్ ముగిశాక టైసన్‌కు పాల్ అభివాదం

ఎవరీ జేక్ పాల్?

అమెరికాకు చెందిన జేక్ మొదట యూట్యూబర్‌గా సుపరిచితుడు. ప్రాంక్ వీడియోలతోపాటు తన హిప్ హప్ మ్యూజిక్‌తో ఆదరణ పొందాడు. అలాగే డిస్నీ చానెల్ బిజార్డ్‌వర్క్ సిరీస్‌లోనూ నటించాడు. అనంతరం 2018 నుంచి బాక్సర్‌గా మారాడు. ఇప్పటి వరకు అతను 13 బౌట్లలో 12 నెగ్గాడు. ఇక బౌట్ ముగిశాక విజేతగా నిలిచిన జేక్ ప్రత్యర్థి టైసన్‌ను కొనియాడాడు. 'అతనో దిగ్గజ బాక్సర్. రింగ్‌లో తనతో ఫైట్ చేసినందుకు గర్వంగా ఉంది. అతడిని గాయపరచాలని చూశాను. కానీ తను కూడా నన్ను దెబ్బతీస్తాడేమోనని భయపడ్డా' అని జేక్ చెప్పాడు. మరోవైపు ఇదే తన చివరి బౌట్ అనే ఊహాగానాలను టైసన్ తోసిపుచ్చాడు. పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటానని, ఇప్పుడే ఏమీ చెప్పలేనని తేల్చాడు. బహుశా జేసన్ సోదరుడు లోగన్‌తో ఫైట్ చేస్తానేమోనని చెప్పగా.. తాను టైసన్‌ను చంపేస్తానంటూ లోగన్ పాల్ సరదాగా అన్నాడు.



తొలి టెస్టుకు గిల్ దూరం!

పెర్త్: ఆస్ట్రేలియాతో తొలి టెస్టుకు ముందే భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా పెర్త్ టెస్టుకు దూరం కానున్నాడు. ఇంట్రా స్క్వాడ్ వామప్ రెండో రోజు ఫీల్డింగ్‌లో గిల్ ఎడమ చేతి బొటనవేలికి గాయమైంది. స్కానింగ్‌లో అతడి వేలికి ఫ్రాక్చర్ అయినట్టు తేలింది. దీంతో గిల్‌కు రెండు వారాల విశ్రాంతి అవసరమని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. అయితే డిసెంబరు 6 నుంచి జరిగే రెండో టెస్టులో మాత్రం ఆడే అవకాశం ఉంది. ఇప్పటికే రాహుల్ మోచేతికి గాయమైంది. అలాగే విరాట్ కూడా గాయపడి గురువారమే స్కానింగ్ తీయించుకున్నాడని చెబుతున్నారు.

స్వదేశంలోనే రోహిత్!

ముంబై: ఆస్ట్రేలియాతో తొలి టెస్టుకు కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో ఉండడం లేదు. శుక్రవారం అతడి భార్య రితిక మగ బిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. దీంతో కుటుంబంతో మరికొన్ని రోజులు గడిపేందుకు రోహిత్ భారత్‌లోనే ఉండనున్నట్టు సమాచారం. రోహిత్ అభ్యర్థనను బోర్డు అంగీకరించింది. దీంతో ఈ నెల 22 నుంచి పెర్త్‌లో జరిగే తొలి టెస్టుకు బుమ్రా నాయకత్వం వహించే అవకాశం ఉంది.

మూడో స్థానంలో అర్జున్

కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ 18 రౌండ్ల బ్లిట్జ్ విభాగంలో తొమ్మిది రౌండ్లు ముగిసే సరికి అర్జున్ ఇరిగేసి (5.5) మూడో స్థానంలో నిలిచాడు. శనివారం జరిగిన తొమ్మిది గేముల్లో నాలుగింటిలో గెలిచిన అర్జున్ మరో మూడింటిని డ్రా చేశాడు. రెండు గేముల్లో ఓడాడు. కార్ల్‌సన్ (6.5) అగ్రస్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో తొమ్మిది రౌండ్లు ముగిసే సరికి కోనేరు హంపి (4.5) నాలుగు, ద్రోణవల్లి హారిక (4) ఐదో స్థానంలో కొనసాగుతున్నారు. ఈ విభాగంలో లగ్నో (7) టాప్‌లో ఉంది.



చైనాకు భారత్ షాక్

● 3-0తో విజయం ● సెమీస్ బెర్త్ ఖరారు
● ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ

రాజ్‌గిర్ (బిహార్): ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో వరుస విజయాలతో జోరుమీదున్న భారత మహిళల హాకీ జట్టు మరో సంచలనం సృష్టించింది. ఒలింపిక్ రజత పతక విజేత చైనాను చిత్తుచేసిన మన అమ్మాయిలు.. వరుసగా నాలుగో విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లారు. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-0తో చైనాను ఓడించింది. నాలుగు మ్యాచ్‌ల నుంచి 8 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా నిలిచింది. సంగీత కుమారి (32వ నిమిషం), కెప్టెన్ సలీమా టెటే (37వ), దీపిక (60వ) గోల్స్ సాధించారు. లీగ్ దశలో ఆదివారం జరిగే ఐదో, ఆఖరి మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ తలపడనుంది. ఆట ఆరంభం నుంచే ఎటాకింగ్ గేమ్‌తో భారత్ విరుచుకుపడడంతో.. చైనా డిఫెన్స్‌కే పరిమితమైంది. తొలి నిమిషంలో భారత్‌కు వరుసగా పెనాల్టీ కార్నర్‌లు లభించినా గోల్స్ మాత్రం చేయలేక పోయింది. తొలి క్వార్టర్‌లో చైనా కూడా పెనాల్టీ కార్నర్ సాధించినా.. భారత్ సమర్థంగా అడ్డుకొంది. ఇక, రెండో క్వార్టర్‌లో మనీషా ఫ్లిక్‌ను చైనా కీపర్ అడ్డుకోవడంతో గోల్ చేసే అవకాశం చేజారింది. దీంతో ఫస్టాఫ్ గోల్ లెస్‌గా ముగిసింది. అయితే, మూడో క్వార్టర్‌లో సమన్వయంగా ముందుకు సాగిన భారత్.. తగిన ఫలితాన్ని సాధించింది. మిగతా మ్యాచ్‌ల్లో జపాన్ 2-1తో మలేసియాను, కొరియా 4-0తో థాయ్‌లాండ్‌ను ఓడించాయి.



కోహ్లీ వారసుడిగా
థండర్ తిలక్

న్యూఢిల్లీ: టీ20 క్రికెట్‌కు విరాట్ రిటైర్మెంట్ ప్రకటించాక ఎంతో కీలకమైన వన్‌డౌన్ స్థానాన్ని భర్తీ చేసేదెవరన్నది పెద్ద ప్రశ్నగా మిగిలింది. టీ20 వరల్డ్‌కప్‌లో రిషభ్ పంత్‌తో ప్రయోగం చేసినా ఆశించినంత ఫలితం దక్కలేదు. గతంలో రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లను మూడో నెంబర్‌లో ఆడించే ప్రయత్నం చేశారు. అయితే, తాజాగా దక్షిణాఫ్రికాతో ముగిసిన టీ20 సిరీస్‌లో ఎడమచేతి వాటం బ్యాటర్ తిలక్ వర్మ రూపంలో అందుకు తగిన సమాధానం లభించింది. నాలుగో నెంబర్‌లో బ్యాటింగ్ చేసే తిలక్.. తనకు అందివచ్చిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. సెంచూరియన్‌లో జరిగిన మూడో టీ20లో తొలిసారి వన్‌డౌన్‌లో దిగిన 22 ఏళ్ల వర్మ శతకంతో దుమ్మురేపాడు. ఆ తర్వాత జొహాన్నెస్‌బర్గ్‌లో జరిగిన నాలుగో మ్యాచ్‌లో వరుసగా రెండో సెంచరీ సాధించాడు. టీమిండియాలో అసాధారణ షాట్లు ఆడే కొద్ది మందిలో సూర్య, పంత్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తాయి. ఇప్పుడు తిలక్ వారి సరసన సగర్వంగా చేరాడు. స్వీప్‌లు ఎలా ఆడగలడో.. రివర్స్ స్వీప్‌లను అదే విధంగా బౌండ్రీ ఆవలకు తరలిస్తున్నాడు. మొత్తంగా డోంట్ కేర్ ఆటతో ప్రత్యర్థుల్లో దడపుట్టించే పవర్‌ప్యాక్ క్రికెటర్‌గా తిలక్ మారాడు. ఇక, రానున్న రోజుల్లో విరాట్ క్లాస్ ఆటను చూసిన స్థానంలో అందుకు భిన్నంగా తిలక్ విధ్వంసకర విన్యాసాలు చూస్తాం.

'ఫ్లయింగ్ కిస్' అందుకే: వర్మ

'వరుసగా రెండో సెంచరీ.. అదీ దక్షిణాఫ్రికా లాంటి పెద్ద జట్టుపై అంటే ఇప్పటికీ నమ్మకం కుదరడం లేదు. వన్‌డౌన్‌లో ఆడే అవకాశం కెప్టెన్ ఇచ్చాడు. దాన్ని ఎంతో ఆస్వాదించా. జట్టు అవసరాలమేరకు ఎక్కడ ఆడమన్నా సిద్ధమే. ఇక, 'ఫ్లయింగ్ కిస్' గురించి అంటారా.. అది దేవుడికి నాదైన కృతజ్ఞతలు..!'

పాకిస్థాన్‌కు ఐసీసీ ఝలక్

చాంపియన్స్ ట్రోఫీ ప్రదర్శన వేదికల నుంచి ఆ నగరాలు అవుట్

దుబాయ్: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) గట్టి షాకిచ్చింది. తమను సంప్రదించకుండా పాకిస్థాన్‌లో చాంపియన్స్ ట్రోఫీని ప్రదర్శించే షెడ్యూల్ ప్రకటించడం..వివాదాస్పద పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని నగరాలను అందులో చేర్చడాన్ని తీవ్రంగా పరిగణించింది. శనివారం విడుదలజేసిన ట్రోఫీ ప్రదర్శన షెడ్యూల్‌నుంచి పీవోకేలోని నాలుగు నగరాలను తొలగించింది. పీసీబీ ప్రకటించిన షెడ్యూల్‌ను ఐసీసీ రద్దు చేసింది. అంతేకాదు తాజా షెడ్యూల్‌ను వెలువరించింది. చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొంటున్న ఎనిమిది జట్ల దేశాలలో ట్రోఫీని ప్రదర్శించనున్నారు. ఈ టోర్నీ ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు జరగాల్సివుంది.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షేక్ రషీద్

తన్మయ్ చేజారిన శతకం

ఆంధ్ర-హైదరాబాద్ రంజీ డ్రా

హైదరాబాద్: ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (95) త్రుటిలో శతకం కోల్పోయాడు. ఆంధ్రతో ముగిసిన ఈ ఎలీట్ గ్రూప్ 'బి' రంజీ మ్యాచ్‌ను హైదరాబాద్ డ్రా చేసుకుంది. అయితే మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఆంధ్ర జట్టుకు మూడు పాయింట్లు లభించగా..హైదరాబాద్ ఒక పాయింటుతో సరిపెట్టుకుంది. తన్మయ్‌తోపాటు మరో ఓపెనర్ అభిరత్ రెడ్డి (70 నాటౌట్) అర్ధ శతకంతో సత్తా చాటడంతో హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో నాలుగో రోజు ఆట ఆఖరికి వికెట్ నష్టానికి 193 పరుగులు చేసింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు 148 పరుగులు జోడించారు. తన్మయ్‌ను రఫీ అవుట్ చేశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ 448/9తో శనివారం, తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర అదే స్కోరు వద్ద ఆలౌటైంది. ఇక మొదటి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 301 పరుగులు సాధించింది.

తమిళ్ తలైవాస్ చేతిలో బెంగాల్ చిత్తు

నోయిడా: డిఫెండర్లు అద్భుతంగా రాణించిన వేళ ప్రొ.కబడ్డీ లీగ్‌లో తమిళ్ తలైవాస్ ఘన విజయం అందుకుంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 46-31తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది. తలైవాస్ రైడర్ విశాల్ చాహర్ సూపర్ టెన్‌తో అదరగొట్టాడు. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 35-25తో బెంగళూరు బుల్స్‌పై నెగ్గింది.

స్పెన్సర్ 'పాంచ్'

ఆసీస్‌దే టీ20 సిరీస్



సిడ్నీ: పేసర్ స్పెన్సర్ జాన్సన్ (5/26) కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో శనివారం పాకిస్థాన్‌తో జరిగిన రెండో టీ20లో ఆస్ట్రేలియా 13 పరుగులతో నెగ్గింది. దాంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో టీ20 మిగిలుండగానే సొంతం చేసుకుంది. టాపార్డర్‌ను జాన్సన్ కకావికలు చేయడంతో 147 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 19.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. అంతకుముందు ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 147/9 స్కోరు చేసింది. హరీస్ రౌఫ్ (4/22), అబ్బాస్ అఫ్రీది (3/17) రాణించారు.

సింహ భాగం
సం'పన్ను'లవే..

పెరిగిన పెద్దోళ్ల పన్ను చెల్లింపుల వాటా

అర కోటికి పైగా ఆర్జిస్తున్న వారి నుంచే 76 శాతం ఆదాయ పన్ను వసూళ్లు

మధ్యతరగతిపై తగ్గిన ఐటీ భారం!!

- రూ.10 లక్షల వరకు వార్షికాదాయ వర్గం వాటా 10.17% నుంచి 6.22 శాతానికి..



న్యూఢిల్లీ: గత దశాబ్ద కాలంలో ఆదాయ పన్ను రిటర్నులు (ఐటీఆర్) సమర్పించే వారి సంఖ్య 120 శాతం పెరిగింది. 2014లో 3.6 కోట్ల మంది ఐటీఆర్‌లు దాఖలు చేయగా.. 2024లో ఈ సంఖ్య 7.9 కోట్లకు పెరిగింది. పన్ను చెల్లింపుదారులతో పాటు భారత ప్రభుత్వానికి సమకూరే పన్ను ఆదాయమూ పుంజుకుంది. అయితే, ఈ పదేళ్లలో రూ.20 లక్షల లోపు వార్షికాదాయం కలిగిన మధ్య తరగతి వర్గంపై ఐటీ చెల్లింపుల భారం మాత్రం గణనీయంగా తగ్గిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. సర్కారుకు సమకూరే ఆదాయం పన్నులో 76 శాతం రూ.50 లక్షలకు పైగా వార్షికాదాయం కలిగిన వారు చెల్లిస్తున్నదేనని ఆ వర్గాలు తెలిపాయి. కాగా, రూ.10 లక్షల వరకు వార్షికాదాయం కలిగిన వారి పన్ను చెల్లింపుల వాటా 2013-24 ఆర్థిక సంవత్సరంలో 10.17 శాతంగా ఉండగా.. 2023 -24లో పదేళ్ల కనిష్ఠ స్థాయి 6.22 శాతానికి తగ్గిందని పేర్కొన్నాయి.

ఐదింతలు పెరిగిన బడా బాబుల రిటర్నులు: ఐటీఆర్ ఫైలింగ్ డేటా ప్రకారం.. రూ.50 లక్షలు, అంతకు పైగా వార్షికాదాయం కలిగిన పన్ను చెల్లింపుదారులు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 9.4 లక్షలు దాటారు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 1.9 లక్షల మందితో పోలిస్తే వీరి సంఖ్య ఐదింతలైంది. అంతేకాదు, 2013-14లో వారు చెల్లించిన మొత్తం పన్ను రూ.2.5 లక్షల కోట్లుగా ఉండగా.. 2023-24 నాటికి 3.2 రెట్ల వృద్ధితో రూ.9.6 లక్షల కోట్లకు పెరిగింది.

4.9 కోట్లకు జీరో ఇన్‌కమ్ ట్యాక్స్ ఫైలింగ్‌లు: 2014లో రూ.2.5 లక్షలు, అంతకు మించిన వార్షికాదాయం కలిగిన వారంతా ఆదాయం పన్ను చెల్లించాల్సి వచ్చేది. గడిచిన దశాబ్ద కాలంలో ప్రభుత్వం కల్పించిన పలు మినహాయింపులు, తగ్గింపులతో ప్రస్తుతం రూ.7 లక్షల వరకు వార్షిక ఆదాయం ఆర్జిస్తున్న వారూ పన్ను చెల్లించాల్సిన అవసరం తప్పింది. దాంతో జీరో ఇన్‌కమ్ ట్యాక్స్ ఫైలింగ్‌లు 2013-14లో 1.8 కోట్ల స్థాయిలో ఉండగా.. 2023-24లో 4.9 కోట్లకు పెరిగాయి.

మధ్యతరగతిపై పన్ను భారం తగ్గిందిలా..: పదేళ్ల క్రితం (2013-14కు ముందు) రూ.2.5 లక్షల నుంచి రూ.7 లక్షల స్థాయి ఆదాయం కలిగిన వారు సుమారు రూ.20,000 వరకు పన్ను చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం పన్ను నుంచి పూర్తి మినహాయింపు లభిస్తోంది. 2023-24లో రూ.7-10 లక్షల వార్షికాదాయం కలిగిన వారు సగటున రూ.43,000 పన్ను చెల్లించాల్సి వచ్చింది. ఈ విభాగ పన్ను రిటర్నుల సంఖ్య 2.2 కోట్లుగా ఉంది. ఈ విభాగ పన్ను చెల్లింపుదారులపై పన్ను భారం వారి ఆదాయంలో కేవలం 4-5 శాతంగా ఉందని, వర్ధమాన దేశాలన్నింటిలోకెల్లా ఇదే అత్యల్పం. గడిచిన పదేళ్లలో ధరల పెరుగుదల (ద్రవ్యోల్బణం) ప్రభావాన్నీ పరిగణనలోకి తీసుకుంటే, రూ.10-15 లక్షల ఆదాయం కలిగిన వారిపై పన్ను భారం 60 శాతం తగ్గిందని, రూ.10-20 లక్షల ఆదాయ వ్యక్తులపై భారం 40 శాతం వరకు తగ్గింది. రూ.20 లక్షల లోపు ఆదాయం కలిగిన మధ్యతరగతిపై పన్ను భారం గణనీయంగా తగ్గిందనడానికిదే నిదర్శనమని తెలిపాయి.

బిజినెస్

మిల్లెట్స్ వ్యాపారంలోకి రామోజీ గ్రూప్

సబల బ్రాండ్‌తో మార్కెట్లోకి ఉత్పత్తులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రామోజీ గ్రూప్.. మిల్లెట్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. సబల మిల్లెట్స్ బ్రాండ్ పేరుతో 45 రకాలైన మిల్లెట్స్ (తృణ ధాన్యాలు) ఉత్పత్తులను తీసుకువచ్చింది. శనివారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో ఈ ఉత్పత్తులను సబల మిల్లెట్స్ డైరెక్టర్ సహరి చెరుకూరి మార్కెట్లోకి విడుదల చేశారు. రామోజీ గ్రూప్ వ్యవస్థాపకుడు రామోజీ రావు జయంతి సందర్భంగా ఈ ఉత్పత్తులను తీసుకువచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ఆహారోత్పత్తుల్లో మిల్లెట్ కుకీస్, హెల్త్ బార్స్, మంచ్, నూడుల్స్ సహా వివిధ రాష్ట్రాలకు తగ్గట్టుగా కిచిడీ తయారీ పదార్థాలు, ఇన్‌స్టంట్ మిక్సెస్ తదితర ఉత్పత్తులు ఉన్నాయన్నారు. మారుతున్న జీవన శైలికి అనుగుణంగా ఈ ఆహార ఉత్పత్తులను తీసుకువచ్చినట్లు ఆమె చెప్పారు. ఈ ఉత్పత్తుల ధరల శ్రేణి రూ.75 నుంచి ప్రారంభమవుతున్నాయన్నారు. ప్రస్తుతం సబల మిల్లెట్స్ వెబ్‌సైట్ ద్వారా ఈ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. రానున్న నెలల్లో ఇతర ఈ-కామర్స్ పోర్టల్స్‌లో వీటిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆమె చెప్పారు.

- యూటీఐ మ్యూచువల్ ఫండ్.. నిజామాబాద్‌లో ఫైనాన్షియల్ సెంటర్‌ను ప్రారంభిస్తోంది. దేశవ్యాప్తంగా 19 యూటీఐ ఫైనాన్షియల్ సెంటర్స్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది.
- స్టార్‌లైనెప్స్ ఎంటర్‌ప్రైజెస్.. సెప్టెంబరు త్రైమాసికంలో రూ.24.43 కోట్ల ఆదాయంపై రూ.3.25 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం, ఆదాయం రెండింతలు పెరిగాయి.



వన్నె తగ్గుతున్న పసిడి

మున్ముందు మరింత తగ్గే అవకాశం.. వెడ్డింగ్ సీజన్‌కు బంపర్ ఆఫర్లు

స్టాక్ మార్కెట్టే కాదు. బులియన్ మార్కెట్ కూడా ప్రస్తుతం దిద్దుబాటు (కరెక్షన్)లో ఉంది. గత నెల రేసు గుర్రంలా పరుగెత్తిన పసిడి ధర.. ప్రస్తుతం నేలచూపులు చూస్తోంది. హైదరాబాద్ మార్కెట్లో గత నెల 30న 10 గ్రాముల మేలిమి (24 క్యారట్స్) బంగారం రికార్డు స్థాయిలో రూ.81,800 పలికింది. దాంతో డిసెంబరు నాటికి 10 గ్రాముల పుత్తడి ధర రూ.లక్షకు చేరుతుందనే అంచనాలు వినిపించాయి. అయితే అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలతో సీన్ మారిపోయింది. ప్రస్తుతం 10 గ్రాముల మేలిమి బంగారం రూ.75,650కు దిగొచ్చింది. కేవలం 17 రోజుల్లోనే 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.6,150 తగ్గడం విశేషం.

పెళ్లిళ్ల సీజన్‌కు ఊరట: అక్టోబరులో జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరిన పసిడి ధర చూసి చాలా మంది బంగారం కొనే ఆలోచన పక్కన పెట్టారు. దీంతో ఈ సంవత్సరం ధనత్రయోదశి కూడా బులియన్ మార్కెట్‌కు పెద్దగా కలిసి రాలేదు. పెళ్లిళ్ల సీజన్‌లో పసిడి ధర తగ్గుముఖం పట్టడంతో కొనుగోళ్లు మళ్లీ ఊపందుకున్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ధర తగ్గడంతో మెట్రో నగరాలతో పాటు చిన్న చిన్న నగరాలు, పట్టణాల్లోని నగల దుకాణాలకూ ప్రస్తుతం రద్దీ పెరిగింది. మరోవైపు పసిడి ధర తగ్గడంతో పెళ్లిళ్ల కోసం చేసే నగల బడ్జెట్ తగ్గిందని వధూవరుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు నగల వ్యాపారులూ కొనుగోలుదార్లను ఆకర్షించేందుకు ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రకటిస్తున్నారు.

మరింత పతనం !

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికవడంతో బులియన్ మార్కెట్ సీన్ మారిపోయింది. అక్టోబరులో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం రికార్డు స్థాయిలో 2,790 డాలర్లు (సుమారు రూ.2.35 లక్షలు) పలికింది. ప్రస్తుతం 2,570 డాలర్లకు దిగొచ్చింది. గత 15 రోజుల్లోనే ఔన్స్ పసిడి ధర 220 డాలర్లు (సుమారు రూ.18,581) పడిపోవడం విశేషం. డిసెంబరు నాటికి ఔన్స్ పసిడి ధర మరో 60 డాలర్ల మేరకు దిగొచ్చే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. దీంతో పెళ్లిళ్ల కోసం పసిడి కొనాలనుకునే వారు మరికొద్ది రోజులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు.

కలిసి రానున్న అంశాలు

టెక్నికల్‌గా చూసినా స్వల్ప, మధ్య కాలానికి పసిడి మార్కెట్ భవిష్యత్ బేరిష్‌గానే కనిపిస్తోంది. ఇందుకు ఈ అంశాలు దోహదం చేయనున్నాయి.

- అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్ ఆర్థిక విధానాలు
- ప్రధాన కరెన్సీలతో బలపడుతున్న డాలర్ మారకం రేటు
- అమెరికాతో సహా ప్రధాన దేశాల్లో తగ్గుతున్న వడ్డీ రేటు

దీర్ఘకాలానికి ఓకే..

బులియన్ మార్కెట్ ప్రస్తుతం బేరిష్‌గా కనిపిస్తున్నా.. దీర్ఘకాలిక పెట్టుబడులకు మాత్రం ఇదే సరైన సమయమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పరిస్థితులు విషమిస్తే ఔన్స్ బంగారం 2025లో 3,000 డాలర్లని కూడా తాకే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,650 ▼	69,350 ▼	99,000 ▼
ముంబై	73,739 ▼	67,545 ▼	87,103 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	565
వరంగల్	542	గోదావరి	560
చిత్తూరు	593	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	90	విజయవాడ	109
వరంగల్	90	గుంటూరు	103
కరీంనగర్	90	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	97
కర్నూలు	90	నెల్లూరు	97
విశాఖపట్నం	103	అనంతపురం	97
గోదావరి	109		

ఇదీ GST
సెల్ఫ్ ఇన్వాయిస్ అంటే..?



రాంబాబు గొండాల

జీఎస్‌టీలో రిజిస్ట్రేషన్ పొందిన వ్యక్తులకు రివర్స్ చార్జ్ మెకానిజం గురించి అవగాహన ఉండే ఉంటుంది. సాధారణంగా వస్తువులు అమ్మే వ్యక్తులు లేదా సేవలు అందించే వ్యక్తులు తాము పొందే మొత్తాల మీద పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అంటే తాము సరఫరా చేసే వస్తువులు లేదా సేవలకు సంబంధించిన విలువ మీద పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే వస్తువులు లేదా సేవల విలువ డబ్బు రూపంలోనే ఉండాలని లేదు. ఉదాహరణకు ఒక నగల వ్యాపారి తాను అమ్మిన నగకు ఎక్స్ఛేంజ్ కింద పాత నగ తీసుకుని మిగిలింది డబ్బు రూపంలో తీసుకోవచ్చు. కార్లు అమ్మే దుకాణాలు కూడా ఇదే పద్ధతి పాటిస్తాయి. ఇలాంటప్పుడు ఈ అమ్మకందారులు కేవలం తాను పొందిన డబ్బు మీదనే పన్ను చెల్లిస్తే సరిపోదు. ప్రతిగా తాము పొందిన పాత నగలు లేదా కారు విలువను కూడా పరిగణనలోనికి తీసుకుని మొత్తం విలువ మీద పన్ను చెల్లించాలి. అందుకే పన్ను అనేది డబ్బు మీద కాకుండా సరఫరా జరిగిన వస్తు లేదా సేవల విలువ మీద కట్టాలి. దీనినే జీఎస్‌టీ పరిభాషలో 'కన్సిడరేషన్' అంటారు. సులభంగా చెప్పాలంటే కన్సిడరేషన్ పొందే వ్యక్తులు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వీరు సరఫరా విలువతో పాటు చెల్లించవలసిన పన్నును కూడా జత చేస్తూ ఇన్వాయిస్ జారీ చేస్తారు.

ఇక రివర్స్ చార్జ్ మెకానిజం విషయానికి వస్తే కన్సిడరేషన్ పొందే వ్యక్తి కాకుండా.. చెల్లించే వ్యక్తి అంటే సరఫరా చేసే వ్యక్తి కాకుండా సరఫరా పొందే వ్యక్తి పన్ను చెల్లించాలి. అయితే ఇవి అన్ని సరఫరాలకు వర్తించవు. ఉదాహరణకు అడ్వకేట్, కంపెనీ డైరెక్టర్, మ్యూజిక్ కంపోజర్, బ్యాంక్ రికవరీ ఏజెంట్, ఇన్సూరెన్స్ ఏజెంట్స్ సేవలకు గాను సేవలు పొందే సంస్థలు లేదా వ్యక్తులు. ఉదాహరణకు డైరెక్టర్‌కు చెందిన కంపెనీ, ఇన్సూరెన్స్ సంస్థ లేదా సంబంధిత బ్యాంకులే తాము చెల్లించే మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాలి. అయితే రివర్స్ చార్జ్ మెకానిజం అమలు కావటమనేది సూచించిన వస్తు సేవలకే కాకుండా అవి అందించే, పొందే వ్యక్తుల మీద కూడా ఆధారపడి ఉంది. కొన్ని సేవలకు, అందించే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ ఉన్నా, లేకున్నా రివర్స్ చార్జ్ మెకానిజం అమలు అవుతుండగా, కొన్నిటికి సేవలందించే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ లేని సందర్భంలో మాత్రమే రివర్స్ చార్జ్ మెకానిజం అమలవుతుంది. ఉదాహరణకు పైన సూచించిన సేవలు అన్నిటికీ సేవలందించే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ ఉన్నా, లేకున్నా రివర్స్ చార్జ్ మెకానిజం వర్తిస్తుంది. అయితే, వాణిజ్య అవసరాలకు భవనాలు అద్దెకు ఇచ్చే సందర్భంలో భవన యజమానికి రిజిస్ట్రేషన్ లేనప్పుడు మాత్రమే రివర్స్ చార్జ్ మెకానిజం వర్తిస్తుంది. అంటే అలాంటి సందర్భంలో మాత్రమే ఆ బిల్డింగ్‌ను అద్దెకు తీసుకున్న సంస్థలు లేదా వ్యక్తులు తాము చెల్లించే అద్దె మీద జీఎస్‌టీ చెల్లిస్తారు. ఒక వేళ భవన యజమానికి రిజిస్ట్రేషన్ ఉంటే సంబంధిత పన్నును బిల్డింగ్ ఓనరే చెల్లించాలి. అప్పుడు రివర్స్ చార్జ్ మెకానిజం వర్తించదు.

మరి రివర్స్ చార్జ్ మెకానిజం వర్తించే కేసుల్లో ఇన్వాయిస్ ఎవరు జారీ చేయాలి? ఆయా సేవలు అందించే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ ఉంటే, వారే ఇన్వాయిస్‌ను జారీ చేయాలి. అయితే వీరు జీఎస్‌టీ చెల్లించే అవసరం లేదు. కాబట్టి జీఎస్‌టీ వివరాలు వేయకుండా కేవలం సరఫరా వివరాలు, దాని విలువను చూపాలి. మరి అదే సరఫరాదారుడికి రిజిస్ట్రేషన్ లేకుంటే? అప్పుడు సరఫరా పొందిన వ్యక్తే స్వయంగా ఒక ఇన్వాయిస్ జారీ చేసుకోవాలి. దీన్నే సెల్ఫ్ ఇన్వాయిస్ అంటారు. నవంబరు 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త విధానం ప్రకారం సెల్ఫ్ ఇన్వాయిస్ అనేది వస్తువులు లేదా సేవలు పొందిన తేదీ నుంచి 30 రోజుల లోపు కచ్చితంగా జారీ చేయాలి. ఈ సెల్ఫ్ ఇన్వాయిస్ సిస్టమ్ ఇంతకు ముందే ఉన్నప్పటికీ గడువు అనేది చెప్పలేదు. ఇప్పుడు కొత్త నిబంధనల ప్రకారం సెల్ఫ్ ఇన్వాయిస్ జారీ చేయటానికి గడువు ఇవ్వటంతో పాటుగా పన్ను చెల్లించటానికి గడువు నిర్ధారించే 'టైమ్ ఆఫ్ సప్లయ్' నిబంధనల్లో కూడా మార్పు చేయటం జరిగింది. కాబట్టి రివర్స్ చార్జ్ మెకానిజం వర్తిస్తూ రిజిస్ట్రేషన్ లేని వ్యక్తుల నుంచి సరఫరా పొందే ప్రతి ఒక్కరూ ఈ సెల్ఫ్ ఇన్వాయిస్ విధానాన్ని విధిగా పాటించాలి

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

మణిపూర్‌లో మళ్లీ నిరసన జ్వాల

» పశ్చిమ ఇంఫాల్‌లో కర్ఫ్యూ.. 7 జిల్లాల్లో ఇంటర్నెట్ బంద్

ఇంఫాల్, నవంబరు 16: మణిపూర్‌లో మళ్లీ నిరసన జ్వాల చెలరేగింది. నిరసన ప్రదర్శనలతో ఇంఫాల్ లోయ దద్దరిల్లింది. ఆందోళనకారులు రాజకీయ నాయకుల ఇళ్లను లక్ష్యంగా చేసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం కనిపించింది. ఇద్దరు మంత్రులు, ముగ్గురు ఎమ్మెల్యేలు, పలువురు బీజేపీ నేతల ఇళ్లపై ఆందోళనకారులు దాడులకు పాల్పడ్డారు. ఇందులో మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ అల్లుడు రాజ్‌కుమార్ సింగ్ నివాసం కూడా ఉంది. సీఎం ఇంటిపైనా దాడికి యత్నించారు. నిరసనలు తీవ్రం కావడంతో పశ్చిమ ఇంఫాల్‌లో నిరవధిక కర్ఫ్యూ విధించారు. ఇంఫాల్ లోయ సహా ఏడు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. శుక్రవారం ముగ్గురు మైతేయీల(ఇద్దరు పిల్లలు, ఒక మహిళ) మృతదేహాలు జిరి నదిలో తేలి కనిపించడం తాజా నిరసన జ్వాలలకు కారణమైంది. కాగా. శనివారం హింసాత్మక నిరసనలపై కేంద్రం కూడా స్పందించింది. శాంతిభద్రతల పునరుద్ధరణకు భద్రతా బలగాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

హెల్త్ సప్లిమెంట్లను ఔషధాలుగా పరిగణించాలి!

న్యూఢిల్లీ, నవంబరు 16: ఆరోగ్య సమస్యలను, వ్యాధులను నయం చేస్తాయంటూ పలు కంపెనీలు విక్రయిస్తున్న హెల్త్ సప్లిమెంట్లను ఔషధాల జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి ఓ అంతర్ మంత్రిత్వశాఖల కమిటీ సిఫార్సు చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖకు తన నివేదికను సమర్పించింది. ఈ సిఫార్సు సర్కారు ఆమోదం పొందితే హెల్త్ సప్లిమెంట్లు.. ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) పరిధిలోకి వస్తాయి. తద్వారా వాటి నాణ్యతా ప్రమాణాలను ఔషధాల స్థాయిలో పరీక్షించటం జరుగుతుంది. అలాగే, ఔషధాల ధరలను నిర్ణయించే 'జాతీయ ఔషధ ధరల సాధికార సంస్థ' (ఎన్‌పీపీఏ) వాటి ధరలను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న హెల్త్ సప్లిమెంట్లు.. 'సురక్షిత ఆహార, ప్రమాణాల సాధికార సంస్థ' (ఎఫ్ఎస్ఎస్ఏఐ) పరిధిలో ఉన్నాయి.

నాకు ఉద్యోగం వచ్చే వరకు నీవూ చేయకూడదు

» భార్యపై భర్త ఒత్తిడి.. భార్యకు విడాకులిప్పించిన కోర్టు

భోపాల్, నవంబరు 16: 'నాకు ఉద్యోగం వచ్చే వరకు నీవు కూడా జాబ్ చేయడానికి వీల్లేదు. చేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని మానేసెయ్' అంటూ భార్యపై ఒత్తిడి తెచ్చిన భర్తపై మధ్యప్రదేశ్ హైకోర్టు కఠినంగా వ్యవహరించింది. ఇది క్రూరత్వం కిందికే వస్తుందని పేర్కొంటూ విడాకులు మంజూరు చేసింది. ఓ జంటకు 2014లో వివాహం జరిగింది. ఇద్దరూ భోపాల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు. 2017లో ఆ మహిళ (33 ఏళ్లు)కు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలో మేనేజర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆయనకు ఏ ఉద్యోగం రాలేదు. దాంతో ఆమెను వేధించడం ప్రారంభించాడు. చేస్తున్న ఉద్యోగాన్ని మానేసి, భోపాల్ తిరిగి వచ్చి తనతో కలిసి ఉండాలంటూ ఒత్తిడి తెచ్చాడు. తనకు ఉద్యోగం వచ్చే దాకా ఆమె ఏ ఉద్యోగం చేయడానికి వీల్లేదని గట్టిగా చెప్పాడు. విసిగిపోయిన ఆమె ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించి విడాకుల కోసం దరఖాస్తు చేసింది. విడాకులు ఇచ్చేందుకు ఆ కోర్టు నిరాకరించడంతో హైకోర్టులో అప్పీలు చేసింది. విచారణ జరిపిన ధర్మాసనం విడాకులు ఇప్పించింది.

విద్యార్థుల సొమ్ము కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

కోల్‌కతా, నవంబరు 16: సైబర్ నేరగాళ్ల దృష్టి విద్యార్థుల పైనా పడింది. ట్యాబ్స్ కొనుగోలు కోసం వారి బ్యాంకు ఖాతాల్లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం జమ చేసిన సొమ్మును అక్రమ మార్గాల్లో బదిలీ చేయించుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10, 12వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించేందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరుణర్ స్వప్నో పథకాన్ని అమలు చేస్తోంది. మొత్తం 16లక్షల మంది విద్యార్థుల ఖాతాల్లో రూ.10వేల వంతున జమ చేస్తోంది. అయితే అందులో 1,911 మంది విద్యార్థుల ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు సొమ్మును అపహరించినట్టు పోలీసులు గుర్తించారు. దీనిపై 93 కేసులు నమోదు చేసి, 11 మందిని అరెస్టు చేసినట్టు శుక్రవారం తెలిపారు. నేరగాళ్లు మహారాష్ట్ర, ఝార్ఖండ్, రాజస్థాన్ ఇతర రాష్ట్రాల నుంచి వ్యవహారాన్ని నడిపినట్టు చెప్పారు.

కొలువుల భర్తీకి ఇకపై 'ట్యాబ్' ఆధారిత పరీక్షలు

» రాజస్థాన్ సర్కారు నిర్ణయం..ఐఐటీ హ్యాకర్లతో ట్రయల్

జైపూర్, నవంబరు 16: పోటీ/ప్రవేశ పరీక్షల్లో ఆప్టికల్ మార్క్ రీడర్(ఓఎంఆర్), కంప్యూటర్ ఆధారిత పరీక్షల(సీబీటీ)ను చూశాం. ఇకపై ట్యాబ్/ట్యాబ్‌లెట్ ఆధారిత పరీక్షల(టీబీటీ)ను నిర్వహించాలని రాజస్థాన్ సర్కారు నిర్ణయించింది. మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీ, ట్యాంపరింగ్ వంటి సమస్యలకు టీబీటీతో చెక్ పట్టవచ్చని భావిస్తోంది. ఈ విషయాన్ని రాజస్థాన్ స్టాఫ్ సెలక్షన్ బోర్డు(ఆర్‌జేఎస్ఎస్‌బీ) చైర్మన్ అలోక్‌రాజ్ వెల్లడించారు. లీకేజీ రహితంగా పరీక్షల నిర్వహణకు టీబీటీని పరిశీలిస్తున్నట్లు వివరించారు. "ఈ నెలాఖరులో 400 మంది డమ్మీ విద్యార్థులతో షిఫ్టుల వారీగా మాక్‌టెస్ట్ నిర్వహిస్తాం. పరీక్ష ప్రారంభానికి ముందు.. పరీక్ష జరుగుతున్నప్పుడు లీకేజీ, కాపీయింగ్ సాధ్యమవుతుందా? అనే కోణంపైనా దృష్టి పెట్టాం. మాక్‌టెస్ట్ సమయంలో ఐఐటీ-కాన్పూర్‌కు చెందిన హ్యాకర్లను నియమించి.. ప్రశ్నపత్రం లీకేజీకి ప్రయత్నిస్తాం. హ్యాకర్లు విఫలమైతే.. టీబీటీ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలుచేస్తాం" అని చెప్పారు.

తెరుచుకున్న శబరిమల అయ్యప్ప ఆలయం

తిరువనంతపురం, నవంబరు 16: మండల-మకరవిళక్కు దీక్షల సీజన్‌లో భాగంగా శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం తెరుచుకుంది. శనివారం ఉదయం నుంచి భక్తులను అయ్యప్ప దర్శనానికి అనుమతిస్తున్నారు. తొలి రోజునే 30 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. ఆలయ ప్రధాన పూజారుల సమక్షంలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు గర్భాలయ తలుపులు తెరిచారు. పూజా కార్యక్రమాల అనంతరం శనివారం ఉదయం నుంచి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పిస్తున్నారు. కాగా, రోజూ లక్ష మంది భక్తులు దర్శనం చేసుకునేందుకు వీలుగా ఆలయం వద్ద ఏర్పాట్లు చేశామని ఏడీజీపీ శ్రీజిత్ తెలిపారు.

చైనా కాలేజీలో యువకుడి కత్తిదాడి..8 మంది మృతి

బీజింగ్, నవంబరు 16: చైనాలో ఓ యువకుడు కత్తితో కళాశాల క్యాంపస్‌లోకి ప్రవేశించి స్వైరవిహారం చేశాడు. విద్యార్థులపై విచక్షణారహితంగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఎనిమిది మంది చనిపోయారు. 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. శనివారం జియాంగ్సు ప్రావిన్స్‌లోని వుషీ నగరంలో గల వొకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ కళాశాల క్యాంపస్‌లోకి ప్రవేశించిన ఆగంతకుడు.. విద్యార్థులపై కత్తితో దాడికి తెగబడ్డాడు. ఈ ఘటనలో 8 మంది మరణించారు. పోలీసులు నిందితుడ్ని ఘటనా స్థలంలోనే అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. నిందితుడ్ని అదే పాఠశాలకు చెందిన 21 ఏళ్ల వ్యక్తిగా గుర్తించారు.

యూకే వర్సిటీలా.. వద్దులే!

లండన్, నవంబరు 16: యూకేలోని విశ్వవిద్యాలయాల్లో చేరడానికి భారతీయ విద్యార్థులు ఆసక్తి కనబర్చడం లేదు. ఇప్పటికే పరిమిత బడ్జెట్లతో సతమతమవుతున్న వర్సిటీలకు ఈ ధోరణి శరాఘాతంలా మారింది. విద్యార్థులు తమ దరఖాస్తులను వాయిదా వేస్తుండటం వాటి ఆర్థిక ఇబ్బందులను మరింత పెంచుతోందని ఆఫీస్ ఫర్ స్టూడెంట్స్(ఓఎఫ్ఎస్) సంస్థ శుక్రవారం విడుదల చేసిన సర్వే నివేదిక వెల్లడించింది. 2022-23 నుంచి 2023-24 వరకూ యూకే వర్సిటీల్లో చదివే భారత విద్యార్థుల సంఖ్య 1,39,914 నుంచి 1,11329కి తగ్గిందని తెలిపింది. ఇటీవల కొన్ని నగరాల్లో ఇమిగ్రేషన్ వ్యతిరేక అల్లర్లు జరగడం, పరిమిత ఉద్యోగావకాశాలు, భద్రతాపరమైన ఆందోళనలు దీనికి కారణం కావచ్చని భావిస్తున్నారు.

సంక్షేమమే తారకమంత్రం

ఇదే పరమార్థంగా పాలిస్తున్నాం.. అందుకే కేంద్రంలో మాకు మూడోసారీ చాన్స్

» నాడు ఉగ్రవాదం భయపెట్టేది

» నేడు సొంతగడ్డపైనే అది భయపడుతోంది

» హిందూస్థాన్ టైమ్స్ సదస్సులో మోదీ

న్యూఢిల్లీ, నవంబరు 16: ఓటు బ్యాంకు రాజకీయాలకు దూరం.. సంక్షేమమే తారకమంత్రం...ఇదే పరమార్థంగా తన ప్రభుత్వం పనిచేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే అనే స్ఫూర్తితో ముందుకు వెళుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వాలు దీనికి పూర్తి వ్యతిరేకంగా ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం వల్ల దేశం ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నదని విమర్శించారు. ఉగ్రవాదులు తమ సొంతగడ్డ పైనే భయంభయంగా బతికే పరిస్థితులను కల్పించామని మోదీ వ్యాఖ్యానించారు. 100 ఏళ్లు పూర్తిచేసుకున్న 'హిందుస్థాన్ టైమ్స్' నిర్వహించిన లీడర్‌షిప్ సదస్సులో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విపక్షాలను దుయ్యబట్టారు. ఎన్నికలు జరిగిన ప్రతి దేశంలో ప్రభుత్వాలు మారుతున్నాయని, భారత్‌లో మాత్రం మూడోసారి కూడా ప్రజలు తమకు అధికారం కట్టబెట్టారని చెప్పారు. తమ ప్రభుత్వంపై ప్రజలకున్న నమ్మకానికి ఇదే నిదర్శనమన్నారు. దుష్ప్రచారాలను, తప్పుడు సమాచారాన్ని వెదజల్లేందుకు ఎక్కువ అవకాశం ఉన్న సోషల్ మీడియా యుగంలోనూ ఎన్డీయే కూటమి, ప్రభుత్వం పట్ల ప్రజలు విశ్వాసం కలిగి ఉన్నతీరును అంతా అర్థం చేసుకోవాలన్నారు. "గతంలో ఎన్నికల్లో గెలిచిన ప్రభుత్వానికి తిరిగి వచ్చే ఎన్నికలపైనే ధ్యాస ఉండేది. దీనికోసం ఓటుబ్యాంకు రాజకీయాలే లక్ష్యంగా పలు పథకాలను ప్రవేశపెట్టేవి. కాంగ్రెస్ పాలన అంతా ఇలాగే గడిచింది" అని మోదీ ఆక్షేపించారు. అభివృద్ధిలో భారత్‌ను పరుగులు పెట్టించే దిశగా న్యూ ఇండియాను నిర్మించడమే పరమార్థంగా తన ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కాగా, పాత పత్రికలు తిరగేస్తుంటే ఉద్వేగం కలుగుతూ ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు. 1947 అక్టోబరులో భారత్‌లో కశ్మీర్ విలీనమైన వార్త ఉన్న పత్రికను చదివిన అప్పటి పాఠకులు ఎలాంటి ఉద్విగ్నతకు లోనయ్యారో, ఇప్పటికీ తాను కూడా అదే అనుభూతికి గురవుతుంటానని చెప్పారు. కాగా, విదేశీ పర్యటన నిమిత్తం మోదీ శనివారం బయలుదేరి వెళ్లారు. ఆయన అయిదు రోజుల పాటు నైజీరియా, బ్రెజిల్, గుయానా దేశాల్లో పర్యటించనున్నారు. నైజీరియా ప్రధాని బోలా అహ్మద్ టినుబు ఆహ్వానం మేరకు వెళ్తున్న మోదీ ఆ దేశంలో రెండు రోజుల పాటు గడపనున్నారు. మోదీ అక్కడ నుంచి బ్రెజిల్ వెళ్లి ఈనెల 18న జీ-20 19వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారు. చివరగా ఈ నెల 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు గుయానాలో పర్యటిస్తారు.



హిందూస్థాన్ టైమ్స్ ఎడిటోరియల్ డైరెక్టర్ శోభనతో ప్రధాని మోదీ

బీజేపీ, కాంగ్రెస్‌కు ఈసీ నోటీసులు

న్యూఢిల్లీ, నవంబరు 16: బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నోటీసులు జారీ చేసింది. ఇరు పార్టీలకు చెందిన స్టార్ క్యాంపెయినర్లు అమిత్ షా, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. వారి వ్యాఖ్యలు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించేలా ఉన్నాయని తెలిపింది. సోమవారం మధ్యాహ్నం 1 గంటకల్లా స్పందన తెలియజేయాలని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేలకు స్పష్టం చేసింది. ఈ నెల 6న ముంబైలో జరిగిన ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ మహారాష్ట్ర యువతను రెచ్చగొట్టేలా మాట్లాడారని బీజేపీ ఈ నెల 11న ఈసీకి ఫిర్యాదు చేసింది. మహారాష్ట్రలోని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ఇతర రాష్ట్రాల వారు దోచుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు దేశ సమగ్రతకు, ఐక్యతకు ముప్పు కలిగిస్తాయని బీజేపీ పేర్కొంది. దీనికి ప్రతిగా కాంగ్రెస్ పార్టీ కూడా బీజేపీ నేత అమిత్ షాపై ఈసీకి ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్, కూటమి పార్టీలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను లాగేసుకొని, ఒక మతానికి ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారంటూ షా ఆరోపించారని.. ఇది మత విద్వేషాలను రెచ్చగొట్టడమేనని ఫిర్యాదులో పేర్కొంది.

బైడెన్‌లాగే మోదీకీ మతిమరుపు..

అమెరికా అధ్యక్షుడు బైడెన్ లాగే ప్రధాని మోదీ కూడా జ్ఞాపకశక్తి కోల్పోయారని రాహుల్ గాంధీ విమర్శించారు. కాంగ్రెస్ మాట్లాడే విషయాలపైనే ఆయన మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శనివారం మహారాష్ట్రలోని అమరావతిలో ఎన్నికల ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. 'బీజేపీ రాజ్యాంగంపై దాడి చేస్తోందని.. హక్కులను హరిస్తోందని గతేడాది కాలంగా నా ప్రసంగాల్లో చెబుతుంటే.. కాంగ్రెస్సే రాజ్యాంగంపై దాడి చేస్తోందని మోదీ అంటున్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమి అధికారంలోకి వస్తే 50% రిజర్వేషన్ల పరిమితి ఎత్తేస్తానని లోక్‌సభలో చెప్పాను. కానీ రాహుల్ గాంధీనే రిజర్వేషన్లకు వ్యతిరేకమని మోదీ ఇప్పటికీ అంటున్నారు. అందుకే ఆయనకు మతిమరుపు వచ్చినట్లనిపిస్తోంది. ఇప్పటికైనా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి. ఏమో.. వచ్చే సమావేశంలో కులగణనకు రాహుల్ గాంధీనే వ్యతిరేకమని మోదీ చెప్పినా చెబుతారు' అంటూ ఎద్దేవా చేశారు. అంతకుముందు హెలికాప్టర్‌లో రాహుల్ అమరావతి చేరుకోగానే.. ఆయన బ్యాగులను ఎన్నికల సిబ్బంది తనిఖీ చేశారు.

నటి కస్తూరి అరెస్టు

హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న చెన్నై పోలీసులు



హైదరాబాద్ సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల తెలుగువారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సినీ నటి కస్తూరిని చెన్నై పోలీసులు హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం అరెస్టు చేశారు. ఆమె పుప్పాలగూడలో బీఆర్‌సీ అపార్టుమెంట్‌లో ఉన్నట్లు గుర్తించి.. సైబరాబాద్ పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకుని చెన్నై తరలించారు. ఇటీవల చెన్నైలో బ్రాహ్మణ సమాజం సమ్మేళనంలో పాల్గొన్న కస్తూరి తమిళనాడులో స్థిరపడ్డ తెలుగువారిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. 'తమిళనాడులోని తెలుగువారు ఊడిగం చేసుకోవడానికి ఉండిపోయారా.. తెలుగువారంటే అంత చిన్నచూపా' అంటూ పలు తెలుగు సంఘాలు కస్తూరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. ఆందోళనలు చేపట్టాయి. దీంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. మహాజన సంఘం రాష్ట్ర సభ్యుల ఫిర్యాదు మేరకు చెన్నై పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. ఆమె అప్పటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆమె ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు కొట్టివేసింది.

నా దగ్గర బాంబు ఉంది

» శంషాబాద్ నుంచి బ్యాంకాక్ వెళ్లాల్సిన విమానంలో ఓ ప్రయాణికుడి బెదిరింపు

శంషాబాద్ రూరల్/చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ నుంచి బ్యాంకాక్ వెళ్లాల్సిన విమానంలో ఎక్కిన ఓ ప్రయాణికుడు విమానం కొద్దిసేపట్లో టేకాఫ్ అవుతుందనగా.. తన దగ్గర బాంబు ఉందని ప్రయాణికులను బెదిరించాడు. ఉలిక్కిపడ్డ ఫ్లైట్ సిబ్బంది వెంటనే భద్రతా బలగాలను అప్రమత్తం చేశారు. అయితే, తనిఖీల్లో ఎలాంటి బాంబు దొరకలేదు. అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30గంటలకు విమానం బయల్దేరాల్సి ఉండగా, బాంబు బెదిరింపుతో 16 గంటలు ఆలస్యంగా శనివారం సాయంత్రం 5గంటలకు బయల్దేరి వెళ్లింది. కాగా, హైదరాబాద్ నుంచి తిరుపతికి బయల్దేరిన విమానంలో హఠాత్తుగా సాంకేతికలోపం తలెత్తడంతో చెన్నై విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు.

వృద్ధుల సంరక్షణకు పాలసీ!

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని అమిత్ యాదవ్ వివరించారు. 'మా మంత్రిత్వ శాఖ ప్రస్తుతం రెండు అంశాలపై పని చేస్తోంది. వాటిలో మొదటిది.. కొత్త విధానం రూపకల్పన. 1999లో అప్పటి ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం ఒక పాలసీని తీసుకొచ్చింది. ఆ తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు విస్తృత సంప్రదింపులతో కొత్త విధానాన్ని తీసుకొచ్చే కసరత్తు ప్రారంభించాం. ఇది రాబోయే 25 ఏళ్లకు మార్గదర్శనం చేస్తుంది. ఇక రెండో అంశం.. 'తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ, సంక్షేమ చట్టం-2007'కు సవరణలు. కాలంతోపాటు వచ్చిన మార్పులు, సవాళ్లకు పరిష్కారం చూపేలా, సీనియర్ సిటిజన్లకు భవిష్యత్ భారతదేశం సౌకర్యవంతంగా ఉండేలా కొత్త పాలసీని రూపొందిస్తాం' అని తెలిపారు. దేశంలో ప్రస్తుతం 15.67 కోట్లుగా ఉన్న వృద్ధుల సంఖ్య.. 2050 నాటికి 34.6 కోట్లకు పెరుగుతుందన్న అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో, వృద్ధుల సంక్షేమానికి సమగ్రమైన సంస్కరణలు అవసరమనే వాదనలు బలంగా ముందుకొస్తున్నాయి. అస్లీ (అసోసియేషన్ ఆఫ్ సీనియర్ లివింగ్ ఇండియా) అనే స్వచ్ఛంద సంస్థ.. వృద్ధుల సంరక్షణకు ప్రపంచ దేశాల్లో పాటిస్తున్న అత్యుత్తమ విధానాలపై అధ్యయనం చేయటానికి వీలుగా ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. వృద్ధుల అవసరాలకు అనుగుణంగా అపార్ట్‌మెంట్లను, కాలనీలను నిర్మించే స్థిరాస్తి సంస్థలకు అనుమతుల జారీ విషయంలో సింగిల్ నోడల్ ఏజెన్సీని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. సీనియర్ సిటిజన్ల కోసం హౌసింగ్ ప్రాజెక్టులు నిర్మించే డెవలపర్లు ప్రస్తుతం 18 శాతం జీఎస్టీ చెల్లిస్తున్నారని, దీనిని తగ్గించాలని ఆశియానా హౌసింగ్ ఎండీ అంకుర్ గుప్తా పేర్కొన్నారు.

మస్క్ రాకెట్.. ఇస్రో శాటిలైట్!

ఫాల్కన్-9తో జీశాట్-ఎన్2 ప్రయోగం.. స్పేస్ ఎక్స్, ఇస్రో మధ్య కీలక ఒప్పందం

» వచ్చే వారం అమెరికాలో ప్రయోగం

» ఈ ఉపగ్రహంతో భారత్‌లో ఇన్‌ఫ్లైట్ సేవలు.. ఇంటర్నెట్ వినియోగం

న్యూఢిల్లీ, నవంబరు 16: వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఇస్రో వచ్చేవారం మరో వాణిజ్య ప్రయోగానికి సిద్ధమవుతోంది. అయితే ఈ ప్రయోగానికి అమెరికా బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ రూపొందించిన ఫాల్కన్-9 రాకెట్‌ను వినియోగించనుంది. ఈ మేరకు స్పేస్ ఎక్స్‌తో ఇస్రో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఇస్రో, స్పేస్ ఎక్స్ మధ్య వాణిజ్య ఒప్పందాల్లో ఇదే మొదటి ప్రయోగం. అలాగే డొనాల్డ్ ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఇరు సంస్థల మధ్య కుదిరిన మొదటి డీల్ కూడా ఇదే కావడం విశేషం. డొనాల్డ్ ట్రంప్‌తోపాటు, భారత ప్రధాని మోదీ కూడా గతంలో ఎలాన్ మస్క్‌ను 'నా స్నేహితుడు' అని పేర్కొంటూ.. ఆయనతో తమకున్న గొప్ప అనుబంధాన్ని చాటుకున్న సంగతి తెలిసిందే. మస్క్ కూడా తాను మోదీ అభిమానినని గతంలో చెప్పారు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న కేప్ కెనరెవాల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు. జీశాట్-ఎన్2 లేదా జీశాట్-20గా పిలిచే ఈ ఉపగ్రహం భారత్‌లో ఇన్-ఫ్లైట్ ఇంటర్నెట్ సేవలను అందించనుంది. ప్రస్తుతానికి దేశంలో ఇన్-ఫ్లైట్ ఇంటర్నెట్ యాక్సెస్‌పై నిషేధం ఉంది. ఈ సేవలను అందిస్తున్న విమానయాన సంస్థలు కూడా భారత గగనతలం మీదుగా ప్రయాణించే సమయంలో వాటిని నిలిపివేయాలి. అయితే భారత గగనతలంపై 3,000 మీటర్ల ఎత్తుకు చేరుకున్న తర్వాత ప్రయాణికులు వైఫై ద్వారా ఇంటర్నెట్ సేవలను వినియోగించుకోవచ్చని పేర్కొంటూ ఈ నెల 4న ప్రభుత్వం నిబంధనలు సవరించింది. ఈ నేపథ్యంలో జీశాట్-ఎన్2 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తే.. ఇన్-ఫ్లైట్ ఇంటర్నెట్ సేవలు కూడా పొందే అవకాశం ఉంటుంది. ఇస్రో ప్రయోగిస్తున్న ఈ శాటిలైట్ జీవితకాలం 14 సంవత్సరాలు. భారత్‌లోని మారుమూల ప్రాంతాల్లో సైతం అత్యాధునిక కమ్యూనికేషన్‌ను అందించడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది. ఈ ప్రయోగం కోసం ఇస్రో దాదాపు రూ.590 కోట్లు చేస్తున్నట్టు అంచనా.


ఫాల్కన్-9 రాకెట్

స్పేస్ ఎక్స్ రాకెట్ ఎందుకంటే..?

భారీ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చాలంటే ఇస్రో.. తన సొంత ప్రయోగ వాహనం మార్క్-3 రాకెట్‌ను రంగంలోకి దించుతుంది. బాహుబలిగా పేరు గాంచిన ఈ రాకెట్ 4,000 కేజీల బరువున్న భారీ శాటిలైట్లను సైతం మోసుకెళ్లగలదు. అయితే ఇస్రో తాజాగా సిద్ధం చేసిన జీశాట్-ఎన్2 బరువు దాదాపు 4,700 కేజీలు. గతంలో ఇలాంటి భారీ ఉపగ్రహ ప్రయోగాల కోసం ఫ్రెంచ్ సంస్థ ఏరియన్ స్పేస్‌పై ఇస్రో ఆధారపడింది. ప్రస్తుతం ఆ కంపెనీ వద్ద ఇలాంటి ఆపరేషనల్ రాకెట్లు లేవు. అలాగే ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా రష్యా సేవలను పొందే అవకాశం కూడా లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో భారీ రాకెట్లను ప్రయోగించగల స్పేస్ ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్‌ను ఇస్రో ఎంచుకుంది.

అబూజ్‌మడ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్

ఐదుగురు నక్సల్స్ హతం

» మృతుల్లో ఇద్దరు మహిళలు

» డీవీసీ సభ్యుడు రంజిత్ కూడా..

చర్ల, నవంబరు 16: మావోయిస్టుల కంచుకోట అబుజ్‌మడ్ మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లింది. పోలీసులు-నక్సల్స్‌కు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మరణించగా.. ఇద్దరు జవాన్లకు బుల్లెట్ గాయాలయ్యాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలి నుంచి భారీగా ఆయుధాలను సీజ్ చేసినట్లు తెలుస్తోంది. రాత్రి కడపటి వార్తలందేసరికి ఇరువైపులా కాల్పులు కొనసాగుతున్నాయి. బస్తర్ ఐజీ సుందర్‌కుమార్, కాంకేర్ ఎస్పీ ఇందిర కల్యాణ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని దంతేవాడ, ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్, నారాయణ్‌పూర్ సరిహద్దుల్లోని అబుజ్‌మడ్ అడవుల్లో కేంద్ర కమిటీ సభ్యులు సమావేశమైనట్లు సమాచారం అందడంతో.. మూడు జిల్లాల డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్ బలగాలు.. మహారాష్ట్ర నుంచి సీ-60 కమాండోలు, బీఎస్ఎఫ్ జవాన్లు శనివారం తెల్లవారుజామున కూంబింగ్ ప్రారంభించారు. ఉదయం 8 గంటల సమయంలో మావోయిస్టులు తారసపడడంతో.. ఇరువైపులా హోరాహోరీగా కాల్పులు ప్రారంభమయ్యాయి. సుమారు నాలుగు గంటల పాటు కాల్పులు కొనసాగాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో.. మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు నిలిచిపోవడంతో.. జవాన్లు ముందుకు సాగారు. ఈ క్రమంలో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. "మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. ఐదుగురిలో ఒకరిని డివిజనల్ కమిటీ సభ్యుడు రంజిత్‌గా గుర్తించాం. అతని తలపై రూ.8 లక్షల రివార్డు ఉంది. ఘటనాస్థలి నుంచి రెండు ఆటోమెటిడ్ తుపాకులు, ఒక ఇన్సాస్, ఒక ఎస్ఎల్ఆర్, మరో దేశవాళీ తుపాకీని స్వాధీనం చేసుకున్నాం" అని కాంకేర్ ఎస్పీ ఇందిర కల్యాణ్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. మావోయిస్టుల కాల్పుల్లో ఇద్దరు డీఆర్‌జీ జవాన్లు గాయపడ్డారు. ఖిలేశ్వర్ గావ్డే అనే జవానుకు భుజం, తలపై తూటా గాయాలయ్యాయి.

320 రోజులు.. 194 మంది హతం

ఈ ఏడాది ఆరంభం నుంచి శనివారం వరకు మొత్తం 320 రోజుల్లో జరిగిన 97 ఎన్‌కౌంటర్లు మావోయిస్టు పార్టీని కోలుకోకుండా చేశాయి. ఈ ఎన్‌కౌంటర్లలో 194 మంది నక్సల్స్ మృతిచెందారు. వీరిలో 38 మంది మహిళా నక్సల్స్ ఉన్నారు. కాగా, ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని బీజాపూర్ జిల్లా కొండపల్లి సీఆర్‌పీఎఫ్-151 క్యాంపుపై మావోయిస్టులు గ్రనేడ్ లాంచర్లతో దాడులు జరిపారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు పదుల సంఖ్యలో గ్రనేడ్లు, రాకెట్లను ప్రయోగించడంతో.. ఆ ప్రాంతంలో యుద్ధవాతావరణం కనిపించిందని పరిసర గ్రామస్థులు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.